www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వలంటీర్లతో సీఎం రహస్య భేటీ!

లబ్ధిదారుల ఓట్లు రాబట్టడంపై దిశానిర్దేశం!

తరలించినవారినే మళ్లీ మళ్లీ

సీఎం సభ ఎక్కడ జరిగినా వారే 'సిద్ధం'

కావలి సభలో సీమ జనాలే ఎక్కువ 11

ఆదివారం | 7-4-2024 | పేజీలు: 14 + 48 పేజీల ఉగాది అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 353 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి ఉ. 6.55 తదుపరి చతుర్దశి తె. 3.21 వరకు; నక్షత్రం: పూర్వాభాద్ర మ. 12.59 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: రా. 9.28-10.53; దుర్ముహూర్తం: సా. 4.48-5.37; అమృతఘడియలు: తె. ఉ. 7.17; తె. 5.58 మొదలు; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.09; సూర్యాస్తమయం: 6.27 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భవన నిర్మాణ కార్మికులకు

మాదీ భరోసా!

ఒకప్పుడు ట్రాక్టర్ ఇసుక రూ.వెయ్యి ఉంటే.. ఇప్పుడు రూ.7 వేలు వసూలు చేసి మాఫియా లీడర్ జగన్‌కు ఇస్తున్నారు. ఈ ఇసుకాసురులను బొక్కలో వేసి, ఉచిత ఇసుక ఇచ్చి, 40 లక్షల మంది నిర్మాణ కార్మికులను ఆదుకునే బాధ్యత తీసుకుంటా.

\- చంద్రబాబు

మేమొస్తాం.. ఉచిత ఇసుక ఇస్తాం

తాపీ మేస్త్రీలు వైసీపీకి సమాధి కట్టాలి

జగన్.. కార్మికుల పొట్టగొట్టారు!
తన కడుపు నింపుకొన్నారు
వెయ్యికి వచ్చే ట్రాక్టర్ ఇసుక 7 వేలా
ఇదంతా మాఫియా లీడర్‌కే వెళ్తోంది
నాది విజన్.. జగన్‌రెడ్డిది పాయిజన్
ఈ కురుక్షేత్రంలో కౌరవుల వధ తప్పదు
రంకెల రాంబాబు సంగతి తేలుస్తాం
ప్రజాగళంలో చంద్రబాబు ఆగ్రహం

గుంటూరు-ఆంధ్రజ్యోతి/ సత్తెనపల్లి, ఏప్రిల్ 6: ఉచిత ఇసుకను ఆపేసి.. జనానికి అందుబాటులో లేకుండా చేసి సీఎం జగన్ 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్టగొట్టారని టీడీపీ అధినేత చంద్రబాబు విరుచుకుపడ్డారు. తన సొంత పొట్ట నింపుకొన్నాడని అన్నారు. తాపీ మేస్త్రీలంతా కలిసి వైసీపీ ఫ్యాన్‌కు సమాధి కట్టడానికి

మిగతా 11వ పేజీలో...



సత్తెనపల్లిలో ప్రజాగళం..

తల్లి.. కొడుకు.. కూతురు ఫ్యామిలీ డ్రామా.. జగన్ వ్యతిరేక ఓటు చీల్చడానికి కుట్ర

పిల్ల కాంగ్రెస్‌కు మేలు కోసం తల్లి కాంగ్రెస్.. వివేకా హత్యపై సునీత పోరుకు అండగా నిలిచాం

కానీ ఆమె షర్మిలకు ఓటేయాలంటోంది.. దీనివల్ల రాష్ట్ర ప్రజలకు చేటు

అన్నా చెల్లెళ్ల మధ్య సమస్య ఉంటే కుటుంబంలోనే తేల్చుకోవాలి: చంద్రబాబు

నన్నూ నరికేస్తారేమో

వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు
వారి చేతిలో అధికారం ఉండొద్దు
వైఎస్ మరణించాక పులివెందుల టికెట్‌ను భాస్కరరెడ్డి అడిగారు
అందుకు వివేకా వ్యతిరేకించారు
ఆయనను తప్పించాలని జగన్, అవినాశ్ కుటుంబం కుట్ర
వివేకా కోరిక మేరకే బరిలో షర్మిల
ప్రజల తీర్పుతోనే న్యాయం: సునీత

రాజకీయంగా అడ్డమనే వివేకాను దారుణంగా నరికి చంపారు

ఆ దుర్మార్గులు ఎంతకైనా తెగిస్తారు



12

ఫోన్ కాల్ రికార్డ్స్ ఎందుకు మ్యాచ్ అవుతున్నాయి?

హంతకులతో మీకు సంబంధమేంటి?
వివేకా ఇల్లంతా రక్తంతో ఉంటే 'గుండెపోటు' అంటారా?
అవినాశ్ ఎందుకు అబద్ధం చెప్పారో?
సోషల్ మీడియాలో మాపై దూషణలు
విజయమ్మనూ అవమానించారు: షర్మిల

మీకే ఎందుకు ఈ 'చొరవ?'



విపక్షాలు, మీడియాపై శనివారం సీఈవో మీనాకు ఫిర్యాదు అందిస్తున్న విజయవాడ కమిషనర్ కాంతిరాణా

ఈ సార్లు సుద్దపూసలా!

ఎన్నికల కమిషన్‌కు 19 మంది ఐపీఎస్‌ల లేఖ

విపక్షాల ఫిర్యాదులపై ఆక్రోశం
మీడియా గొంతు నొక్కాలని డిమాండ్
తమపై తప్పుడు ప్రచారం జరుగుతోందట
ఈసీ ప్రభావితమవుతోందని వింత వాదన
ఐదేళ్లు పోలీసు ప్రతిష్ఠను దెబ్బతీసిందెవరు?
ఏకపక్ష దాడులు, అరెస్టులు మరిచారా?
ఐపీసీని మరిచి వైసీపీ భజన చేయలేదా?
ఎన్నికల విధుల్లో ఉండేందుకే ఈ తహతహ
ఐపీఎస్‌లు ఈ తరహా లేఖలు రాయొచ్చా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మేం సుద్దపూసలం... సత్యవంతులం!' అని 19మంది ఐపీఎస్‌లు తమకు తాము సర్టిఫికెట్ ఇచ్చుకున్నారు. నీతికీ, న్యాయానికీ, నిష్పాక్షికతకూ కట్టుబడి ఉన్నాం... అని చెప్పుకొచ్చారు! అంతేకాదండోయ్! 'మీరు ప్రతిపక్షాలు, మీడియా చెప్పుడు మాటలు వింటున్నారు' అంటూ ఏకంగా ఎన్నికల కమిషన్‌నే నిందించారు. రాష్ట్రంలో 144 మంది ఐపీఎస్‌లు ఉండగా వీరికి మాత్రమే ఈ అవసరం ఎందుకొచ్చింది? మిగిలిన

మిగతా 12వ పేజీలో...

ఔను.. కలికాలమే!



పొత్తుల తర్వాత జగన్మోహన్ రెడ్డి గ్రాఫ్ పెరిగిందని, కూటమి బలం క్షీణించిందని జగన్ అండ్ కో ప్రచారం చేయడం మొదలుపెట్టింది. దీనికి దన్నుగా కొన్ని సర్వే సంస్థలకు డబ్బులిచ్చి తమ ప్రచారానికి మద్దతుగా సర్వే వివరాలు అంటూ కొన్ని గణాంకాలను జనంలోకి వదలడం మొదలుపెట్టారు. ఇదంతా జగన్ అండ్ కో ఆడుతున్న మైండ్ గేమ్. క్షేత్ర స్థాయిలో జగన్ బలం పెరగడానికి ఈ పక్షం రోజులలో చోటు చేసుకున్న మార్పులు, పరిణామాలు కూడా లేవు. క్షేత్రస్థాయిలో జగన్‌కు బలం పెరిగిన విషయం వాస్తవమే అయితే ఇతర పార్టీలకు చెందిన వారు వైసీపీలో చేరడానికి పోటీ పడేవారు. వాస్తవంలో అలా జరగడం లేదు.

చంద్రబాబు మండుటెండలను సైతం లెక్క చేయకుండా, ముఖంలో ఎక్కడా అలసట కనపడనీయకుండా రోజుకు మూడు చోట్ల సభలు నిర్వహిస్తున్నారు. యువకుడినైన తనకు ముసలోడితో పోటీ ఏమిటని ఎద్దేవా చేస్తున్న సీఎం జగన్ మాత్రం రోజుకు ఒక మీటింగ్‌తోనే సరిపెడుతున్నారు. అది కూడా సాయంత్రం పూట ఎండ వేడి తగ్గాక బయటకు వస్తున్నారు.

కలికాలంలో కలి ప్రభావం కారణంగా దేవుళ్లు నివి ఒత్తిమాత్రులవుతారు, పాలకులే శక్తిమంతులుగా అవతరిస్తారు. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డిని ఎవరు హత్య చేశారో, చేయించారో దేవుడికంటే పాలకులకే తెలుస్తుంది.

అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు కోసం దస్తగిరి పెట్టుకున్న పిటిషన్‌పై హైకోర్టు సానుకూల ఆదేశాలు ఇస్తే ఎన్నిక జరిగేలోపే అవినాశ్ రెడ్డి జైలుకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో తనను ఒంటరిని చేసి రాజకీయ ప్రత్యర్థులందరూ తోడేళ్ల గుంపుగా ఒక్కటై దాడి చేస్తున్నారని, తన వాళ్లు కూడా ఒకరిద్దరు వారికి తోడయ్యారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోపించడం మొదలెట్టారు. ఈ సందర్భంగానే కలికాలం గురించి ఆయన ప్రస్తావిస్తున్నారు.

కొత్త పలుకు ఆర్కే విశ్లేషణ 4లో..

బీజేపీని ఓడిస్తాం..
గెలుపు మాదే

» అత్యధిక అవినీతిపరులు మోదీ వెంటే ఉన్నారు: రాహుల్ గాంధీ

» తెలంగాణ తుక్కుగూడ సభలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల


పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న రాహుల్

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అతి పెద్ద వాషింగ్ మెషీన్‌ను బీజేపీ నడుపుతోందని, దేశంలోని అత్యధిక అవినీతిపరులు ఇప్పుడు మోదీ వెంటే ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. తెలంగాణలోని తుక్కుగూడలో శనివారం నిర్వహించిన జన జాతర సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కాంగ్రెస్ మేనిఫెస్టో (గ్యారంటీ కార్డు)ను విడుదల చేశారు. పార్టీ మేనిఫెస్టోను విప్లవాత్మకంగా రాహుల్ అభివర్ణించారు. దాని అమలుతో దేశ ముఖచిత్రమే మారిపోతుందన్నారు. "ప్రపంచంలో అతిపెద్ద కుంభకోణం ఎలక్టోరల్ బాండ్లు. 'పైసలు ఇచ్చుకోండి.. దందాలు చేసుకోండి' అన్నది దాని నినాదం. వ్యాపారులందరినీ దానిని అడ్డు పెట్టి బెదిరించారు" అని ఆరోపించారు. మీడియా, ధనబలం, నిఘా సంస్థలు, ఇంటెలిజెన్స్, ఈడీ, సీబీఐ మోదీ వెంట ఉన్నాయని, తమవెంట వాస్తవాలు, ప్రజల ప్రేమ ఉందని, అంతిమంగా విజయం న్యాయానిదే అవుతుందని వ్యాఖ్యానించారు. "ఐదు గ్యారంటీలతో మేనిఫెస్టో ఉంది. దేశంలో నిరుద్యోగులందరికీ ఏడాది పాటు రూ.లక్ష జీతం వచ్చేలా అప్రెంటిస్ శిక్షణ కోసం చట్టాన్ని తెస్తాం. ఉపాధి హామీ పథకంలో ఉపాధికి గ్యారంటీ ఇచ్చినట్లుగానే ఈ చట్టంతో ప్రతి యువకుడికి ఏడాదిపాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంతోపాటు వైద్య, విద్య రంగంలో శిక్షణ ఇస్తాం" అని వివరించారు. నారీ న్యాయ్ చట్టాన్ని తీసుకురానున్నామని, దీని కింద ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి లక్ష రూపాయలను వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని ప్రకటించారు. మత్స్యకారుల కోసం డీజిల్ సబ్సిడీతో పాటు సహకార బ్యాంకును ఏర్పాటు చేస్తామని తెలిపారు. కిసాన్ న్యాయ్ కింద రుణమాఫీ చేస్తామని, రైతులు పండించే పంటకు కనీస మద్దతు ధర లభించేలా చట్టబద్ధత కల్పిస్తామన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన చేపడతామని ప్రకటించారు. కుల గణన తర్వాత ఆర్థిక గణన చేస్తామన్నారు.

ఇంటింటి ప్రచారానికి సమాచారమిస్తే చాలు!

» ఈసీ వివరణ ఇచ్చాక మార్పులు: సీఈవో మీనా



అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా ఎన్నికల అధికారులు(డీఈవో), ఎస్పీలపైనే ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటింటి ప్రచారానికి ముందస్తుగా పొందాల్సిన అనుమతి విషయంలో కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అయితే, ఈ అంశంలో తగిన వివరణ అందేలోపు ఇంటింటి ప్రచారానికి సంబంధించిన సమాచారాన్ని ముందస్తుగా సంబంధిత ఆర్వోకు, పోలీస్‌స్టేషన్‌కు ఇస్తే చాలనే విషయాన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలన్నారు. శనివారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల డీఈవోలు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాంటి హింసకు, రీపోలింగ్ తావులేకుండా భద్రతా చర్యలను చేపట్టాలన్నారు. గంజాయి, లిక్కర్ నగదు, ఉచితాల అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని, రాష్ట్రాల సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్‌పోస్టుల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గోవా, హరియాణా నుంచి లిక్కర్ రాష్ట్రంలోకి అక్రమంగా రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యక్తులు రూ.50 వేలకు మించి నగదు కలిగి ఉంటే వెంటనే జప్తు చేయాలని, వ్యాపారులు, సాధారణ పౌరుల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని, ఎలాంటి ఇబ్బందులకు గురిచేయవద్దని తెలిపారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలన్నారు. దీనికి సంబంధించి రాష్ట్రమంతా ఒకే విధానాన్ని అనుసరించేలా త్వరలో ఎస్‌వోపీని రూపొందిస్తున్నట్టు తెలిపారు. భారత ఎన్నికల సంఘం రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను నియమించిందని, వీరు పలు ప్రాంతాల్లో పర్యటించారన్నారు.


మార్చి 28న బీజేపీలో చేరిన దమయంతి, భర్తృహరి, సిద్ధాంత్(బీజేపీ కండువాలు కప్పుకొన్నవారు ఎడమ నుంచి)

'జంపింగ్' బలం!

బీజేడీ మాజీ నేతలకు బీజేపీ టికెట్లు

» ఒడిశాలో అధిక ఎంపీ స్థానాలపై కన్ను

» 24 ఏళ్లుగా సీఎం పదవిలో నవీన్

» ఆయనకు తొలిసారి గట్టి పోటీ


నవీన్ పట్నాయక్

ఒడిసాలో పాలక బిజూ జనతాదళ్ (బీజేడీ) నుంచి వచ్చి చేరిన నేతలనే బీజేపీ నమ్ముకుంది. లోక్‌సభకు, ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఏకకాలంలో జరుగుతున్న ఎన్నికల్లో వారికే పెద్దపీట వేసింది. ముఖ్యంగా శాసనసభ కంటే లోక్‌సభ స్థానాలే ఎక్కువ గెలుచుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. సీఎం నవీన్ పట్నాయక్‌కు తొలి నుంచీ చేదోడువాదోడుగా ఉండి పార్టీ బలోపేతానికి తోడ్పడిన భర్తృహరి మెహతాబ్, సిద్ధాంత్ మొహాపాత్ర, అనుభవ్ మొహంతి, ఆకాశ్ దాస్ నాయక్, అరిందమ్ రాయ్, ప్రియదర్శి మిశ్రా, దంబారు సిసా, ప్రదీప్ పాణిగ్రాహి, ప్రశాంత జగదేవ్ వంటి సీనియర్ నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో అత్యధికులు లోక్‌సభకు పోటీచేస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు, నేతలు కూడా బీజేపీలోకి క్యూకట్టి అసెంబ్లీ బరిలో దిగారు. బీజేడీ అధినేత నవీన్ 2000వ సంవత్సరం నుంచి 24 ఏళ్లుగా అప్రతిహతంగా సీఎంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇన్నేళ్ల తర్వాత తొలిసారి ఆయనకు గట్టి పోటీ ఎదురవుతోంది. నిన్నమొన్నటిదాకా ఆయనతోపాటు ఉండి బీజేడీని బలోపేతం చేసిన నేతలు ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో దిగడమే దీనికి కారణం. నీతి నిజాయితీలకు మారుపేరుగా నిలిచిన నవీన్ ప్రభుత్వంపై గత నాలుగేళ్లుగా తీవ్ర అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సంస్థాగతంగా బీజేడీ బలహీనపడుతోందన్న వాదన పార్టీ నేతల్లోనే వినిపిస్తోంది. ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్న బీజేపీలోకి పలువురు నాయకులు చేరిపోయారు. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలకు గాను గత ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 8 స్థానాల్లో గెలిచింది. అసెంబ్లీలో మాత్రం 23 సీట్లకే పరిమితమైంది. 12 ఎంపీ స్థానాలు గెలిచిన బీజేడీ.. అసెంబ్లీకి వచ్చేటప్పటికి 147 సీట్లకు గాను ఏకంగా 112 గెలుచుకుంది. ఒడిశాలో మే 13 నుంచి నాలుగు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి.

పొత్తు చర్చలు విఫలం..

1998 నుంచి 2009 వరకు ఒడిసాలో బీజేడీ, బీజేపీ కలిసి నడిచాయి. 2009లో తెగతెంపులు చేసుకున్నాయి. మోదీ ప్రధాని అయ్యాక నవీన్ పట్నాయక్ ఆయనతో సన్నిహితంగా ఉంటున్నారు. పార్లమెంటులో కీలక బిల్లులకు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల తర్వాత మళ్లీ పొత్తు పెట్టుకోవాలని భావించారు. అయితే బీజేపీ రాష్ట్ర శాఖ అంగీకరించలేదు. బీజేడీ సంస్థాగతంగా బాగా బలహీనపడిందని.. ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని అధిష్ఠానానికి నివేదికలు పంపారు. దీంతో పాటు, 15 లోక్‌సభ సీట్లను బీజేపీకి కేటాయించాలన్న డిమాండ్‌కు నవీన్ అంగీకరించకపోవడంతో పొత్తు కుదరలేదు. - సెంట్రల్ డెస్క్

సోషల్ రిలేషన్.. పార్టీ ప్రమోషన్


కమియా జానీతో రాహుల్‌గాంధీ (ఫైల్)

యూట్యూబర్లు, సోషల్ మీడియా దిగ్గజాలతో పార్టీల అగ్ర నేతల ప్రత్యేక సంబంధాలు

» పార్టీలను ప్రమోట్ చేసే వ్యూహాలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు అన్ని పార్టీలూ అందరినీ చేరువ చేసుకుంటాయి. ప్రతి ఒక్కరినీ తమ వారిగానే భావిస్తాయి. ఇప్పుడు ఈ జాబితాలో సమాజాన్ని ప్రభావితం చేసే యూట్యూబర్లు, ప్రముఖులు, ఆవిష్కర్తలు, సృష్టికర్తలు వంటివారు చేరిపోయారు. బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీ వరకు అన్ని పార్టీలదీ ఇప్పుడు ఆయా ప్రభావ వంతమైన వ్యక్తులను తమవైపు తిప్పుకోవడమే పనిగా పెట్టుకున్నాయి. నాయకుల విషయానికి వస్తే ప్రధాని మోదీ నుంచి విపక్ష నాయకుడు, ఎంపీ రాహుల్ గాంధీ వరకు ఈ ప్రభావవంతమైన వ్యక్తులను అక్కున చేర్చుకునేందుకు ఉత్సాహం చూపించారు. గత నెల మార్చిలో ఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించిన 'నేషనల్ క్రియేటర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "మరికొద్ది రోజుల్లోనే దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాన్ని దానికోసమే నిర్వహిస్తున్నామని భావించొద్దు" అని అన్నారు. ఈ సమయంలో సభలో ఉన్న వారు "అబ్కీ బార్, 400 పార్" అంటూ బిగ్గరగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఇక, అవార్డులకు ఎంపికైన విభాగాల్లో బెస్ట్ డిస్రప్టర్ ఆఫ్ ది ఇయర్ ఒకటి. ఈ అవార్డును రణ్‌వీర్ అల్లాబాదియాకు ప్రదానం చేశారు. రణ్‌వీర్ 'బీర్ బైసెప్స్' ద్వారా ప్రాచుర్యం పొందారు. ఇక, స్వచ్ఛత అంబాసిడర్ అవార్డును మల్హార్ కలాంబేకు అందించారు. అదేవిధంగా 'బెస్ట్ క్రియేటర్ ఇన్ ఫుడ్' విభాగంలో కబితా సింగ్‌కు అవార్డును ప్రదానం చేశారు. 'కబితాస్ కిచెన్' ద్వారా కబితా సింగ్ ప్రాచుర్యం పొందారు. బెస్ట్ ట్రావెల్ క్రియేటర్ అవార్డును కమియా జానీకి అందించారు. 'కర్లీ టేల్స్' ద్వారా జానీ ప్రాచుర్యం పొందారు. ఇక, బెస్ట్ హెల్త్, ఫిట్‌నెస్ క్రియేటర్ అవార్డును అంకిత్ బైయాన్‌పురియాకు అందించారు. ఇలా.. సమాజాన్ని ప్రభావితం చేసేవారిని ఎంపిక చేసి జాతీయ అవార్డులు అందించడం ఇదే తొలిసారి. తద్వారా బీజేపీ ప్రభుత్వం కీలకమైన లోక్‌సభ ఎన్నికల వేళ వారిని మచ్చిక చేసుకునే ప్రయత్నం చేసిందనే విశ్లేషణలు ఉన్నాయి.


అంకిత్ బైయాన్‌పురితో మోదీ(ఫైల్)

ప్రధానితో బంధం

సోషల్ మీడియా ద్వారా ప్రజలను ప్రభావితం చేసే వారితో ప్రధాని మోదీ వ్యక్తిగత అనుబంధం పెంచుకున్నారు. సోషల్ మీడియా ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లుయెన్సర్, హరియాణాకు చెందిన అంకిత్ బైయాన్‌పురియాతో 2023, అక్టోబరు 2న ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఆ సమయంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'శ్రమదాన్'లో అంకిత్‌తో కలిసి మోదీ పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వీడియోను ప్రధాని తన 'ఎక్స్'(ట్విట్టర్)లో పోస్టు చేశారు. దీనిని లక్షల మంది సోషల్ మీడియా ఫాలోవర్లు వీక్షించడం గమనార్హం.

భారీ వ్యూహమే: బీజేపీ నేత

దేశంలో తొలిసారి నేషనల్ క్రియేటర్స్ అవార్డులను ప్రదానం చేయడం వెనుక భారీ వ్యూహమే ఉందని మహారాష్ట్ర బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుడు దేవాంగ్ దవే అన్నారు. సోషల్ మీడియాను ప్రభావితం చేసే వ్యక్తులు ప్రజల అభిప్రాయాలను కూడా మార్చగలరని ఆయన అభిప్రాయపడ్డారు. వీరి కథనాలు తమ ప్రచారంలో కీలకంగా మారనున్నాయని వెల్లడించారు. ఇవి 2024 ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషించనున్నాయని ఆయన వెల్లడించారు. "సంప్రదాయ మీడియా కూడా కొన్ని కొన్నిసార్లు ప్రజలను ప్రభావితం చేయలేకపోవచ్చు. కానీ, సామాజిక మాధ్యమాల్లో దూకుడుగా ఉండే వారు.. రాజకీయ సందేశాల ద్వారా ప్రజలను ఖచ్చితంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది" అని అన్నారు.

కాంగ్రెస్ కూడా..

సోషల్ మీడియాలో ప్రభావవంతమైన వ్యక్తులతో అనుబంధం పెంచుకునే విషయంలో కాంగ్రెస్ కూడా ముందుంది. రాహుల్ గాంధీ.. తన భారత్ జోడో యాత్ర సందర్భంగా ప్రముఖ యూట్యూబర్ కామియా జానీకి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వడం వెనుక ప్రధాన ఉద్దేశం ఇదే. అదేవిధంగా తమిళనాడుకు చెందిన 'విలేజ్ కుకింగ్ చానెల్' యూట్యూబ్ చానెల్ ప్రతినిధులతోనూ రాహుల్‌గాంధీ భేటీ అయ్యారు. వారితో కలిసి వంట చేశారు. కలిసి భోజనం కూడా చేశారు. ఇవన్నీ సోషల్ మీడియాలో జోరుగా వైరల్ కావడంతోపాటు వీక్షకులను ఆకట్టుకున్నాయి. - సెంట్రల్ డెస్క్

బెంగాల్‌లో ఎన్ఐఏ వాహనంపై దాడి

» అర్ధరాత్రి సమయంలో ఎందుకెళ్లారు?: మమత



కోల్‌కతా, ఏప్రిల్ 6: పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా మేదినీపూర్ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. భూపతినగర్ ప్రాంతంలో ఎన్ఐఏ అధికారులు ప్రయాణిస్తున్న వాహనంపై గ్రామస్తులు శనివారం దాడి చేశారు. 2022 బాంబు పేలుడు కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఎన్ఐఏ బృందం తిరిగి కోల్‌కతాకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు రాళ్లు రువ్వడంతో వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయని, ఒక అధికారి గాయపడినట్లు ఎన్ఐఏ బృందం ఫిర్యాదు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. 2022 డిసెంబరు 3న భూపతినగర్‌లోని ఓ ఇంట్లో పేలుడు సంభవించి ముగ్గురు మృతిచెందారు. ఈ కేసు దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించారు. కాగా, ఉత్తర 24పరగణాల్లోని సందేశ్‌ఖాలీ ప్రాంతంలో రేషన్ కుంభకోణానికి సంబంధించి సోదాల కోసం వెళ్లిన ఈడీ అధికారులపై కూడా ఈ ఏడాది జనవరి 5న ఇలాగే దాడి జరిగింది. దాడి ఘటనపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. 'ఎన్ఐఏ అధికారులు సోదాల కోసం అర్ధరాత్రి సమయంలో ఎందుకెళ్లారు? దీనికోసం వారు పోలీసుల అనుమతి తీసుకున్నారా?' అని నిలదీశారు. బీజేపీకి మద్దతుగా ఎన్ఐఏ వ్యవహరిస్తోందని ఆరోపించారు. భూపతినగర్ వాసులపై తొలుత దాడిచేసింది ఎన్ఐఏ అధికారులేనని చెప్పారు. తమపై దాడి చేస్తుంటే మహిళలు చేతులు ముడుచుకొని కూర్చోవాలా? అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని మమత విజ్ఞప్తి చేశారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
కర్నూలు	44.0	29.0
అనంతపురం	43.0	28.0
ఒంగోలు	41.0	23.0
విజయవాడ	40.7	27.0
హైదరాబాద్	40.0	26.0
బాపట్ల	35.0	25.0

ఇజ్రాయెల్‌పై దాడి చేస్తాం

» మీరు మాత్రం దూరంగా ఉండాలి

» అమెరికాను కోరుతూ ఇరాన్ లేఖ

వాషింగ్టన్, ఏప్రిల్ 6: ఇజ్రాయెల్‌పై ఏ క్షణంలోనైనా దాడి చేస్తామని ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు అమెరికాకు లేఖ రాసినట్లు.. ఇజ్రాయెల్‌కు దూరంగా ఉండాలని కోరినట్లు ఇరాన్ ఉన్నతాధికారి మహమ్మద్ జంషిదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. సిరియా రాజధాని డమాస్కస్‌లో ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన దాడిలో.. తమ కాన్సులేట్ భవనంలో ఉన్న ఏడుగురు అధికారులు మృతిచెందారని ఇరాన్ ఆరోపించిన విషయం తెలిసిందే.! దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరిస్తూ వచ్చింది. తాజాగా ఇజ్రాయెల్‌పై యుద్ధానికి సిద్ధమనే సంకేతాన్ని పంపింది. "మీరు(అమెరికా) ఇజ్రాయెల్‌కు దూరంగా ఉండాలి. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఉచ్చులో పడొద్దు. మేం చేసే ప్రతీకారదాడిలో.. ఇజ్రాయెల్ చేసే ప్రతిదాడిలో మీరు పాల్గొనకూడదు. అలా అయితేనే.. మేము అమెరికా సేనలపై దాడి చేయం" అని అమెరికాకు స్పష్టం చేసినట్లు జంషిది ఎక్స్‌లో తెలిపారు. పశ్చిమాసియాలోని తమ స్థావరాలను టార్గెట్‌గా చేసుకోకూడదని అమెరికా అడిగినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే.. ఈ పోస్ట్‌పై అమెరికా స్పందించలేదు. ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి.

ప్రముఖ హైదరాబాద్ సర్జన్ రఘురామ్‌కు ఏఎస్ఏ గౌరవ ఫెలోషిప్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: హైదరాబాద్‌లోని కిమ్స్-ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టికి మరో గౌరవం దక్కింది. అమెరికన్ సర్జికల్ అసోసియేషన్ (ఏఎస్ఏ) ఆయనకు వాషింగ్టన్ డీసీలో గౌరవ ఫెలోషిప్‌ను ప్రదానం చేసింది. ఒక విదేశీ సర్జన్‌కు ఏఎస్ఏ అందించే అత్యుత్తమ గుర్తింపు ఇది. అమెరికాకు చెందిన అత్యంత ప్రతిష్ఠాత్మక సర్జికల్ సంస్థ 144ఏళ్ల చరిత్రలో దక్షిణాసియా నుంచి ఈ అత్యున్నత గౌరవాన్ని పొందిన మూడో సర్జన్ రఘురామ్‌కావడం గమనార్హం. భారత దేశంలో రొమ్ము క్యాన్సర్ సంరక్షణలో వినూత్న కార్యక్రమాల ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో డాక్టర్ రఘురామ్ అగ్రగామిగా ఉన్నారని ఏఎస్ఏ అధ్యక్షుడు ప్రొఫెసర్ స్టీవెన్ స్టెయిన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కారం, డాక్టర్ బీసీ రాయ్ అవార్డు గ్రహీత అయిన డాక్టర్ రఘురామ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ గౌరవాన్ని తన మాతృభూమి భారత్‌కు, కుటుంబానికి, వైద్యులకు అంకితమిస్తున్నట్టు పేర్కొన్నారు.

సహజీవనం చేసినా భరణం ఇవ్వాల్సిందే

భోపాల్, ఏప్రిల్ 6: మహిళల హక్కులను గుర్తించే దిశగా మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. చట్టబద్ధంగా వివాహం చేసుకోనప్పటికీ సహజీవనం చేసిన జంట విడిపోతే ఆ మహిళకు పురుషుడు భరణం చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఓ జంట చాలా కాలం సహజీవనం చేసింది. వారికి బిడ్డ కూడా జన్మించాడు. అనంతరం వారు విడిపోయారు. దాంతో తనకు భరణం చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాస్తవాలను గమనించిన ట్రయల్ కోర్టు నెలకు రూ.1500 భరణం చెల్లించాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ ఆయన హైకోర్టులో అప్పీలు చేశాడు. హైకోర్టు కూడా కిందికోర్టు తీర్పును సమర్థించింది.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముస్లిం లీగ్ ముద్ర

అవినీతి సొమ్మును కాపాడుకోడానికే ఆ పార్టీ ఆరాటం

» మూడోసారి ప్రభుత్వంలో అవినీతిపై అతిపెద్ద నిర్ణయం: ప్రధాని మోదీ


ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ముస్లిం లీగ్ ముద్ర కనిపిస్తోందని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు. ఆ మేనిఫెస్టోలోని మిగిలిన భాగాన్ని వామపక్షాల ఆలోచనలు ఆక్రమించాయని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను 'అబద్ధాల పుట్ట'గా ఆయన అభివర్ణించారు. అందులోని ప్రతి పేజీ లక్ష్యం భారతదేశాన్ని ముక్కలు చేయడమేనని ఆరోపించారు. తొలివిడతలో ఈనెల 19న ఎన్నికలు జరుగనున్న ఉత్తరప్రదేశ్‌లోని సహరన్‌పూర్, రాజస్థాన్‌లోని అజ్మేర్ నియోజకవర్గాలలో మోదీ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బహిరంగసభల్లో మోదీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముస్లింలీగ్ ముద్ర ఉండేదని, ఇప్పుడూ వారి ఆలోచనలు అదేవిధంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. స్వాతంత్ర్యోద్యమం నాటి కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల క్రితమే అంతమైందన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీకి విధానాలుగానీ, సిద్ధాంతాలుగానీ, దేశాభివృద్ధిపై దృష్టిగానీ లేవని ఆరోపించారు. 'ఆ పార్టీ అన్నింటినీ కాంట్రాక్టుకు ఇచ్చేసినట్టు, మొత్తంగా పార్టీనే అవుట్‌సోర్సింగ్ చేసేసినట్టు కనిపిస్తోంది. కాంగ్రెస్ ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి ఉండదు. ప్రజల సొమ్ము దోచేయడమే వంశపారంపర్యంగా తమకు లభించిన హక్కు అని వారు భావిస్తుంటారు. వారి దోపిడీ దుకాణపు షెట్టర్‌ను గత పదేళ్లలో మోదీ దించేశారు. అందుకే వారంతా ఆందోళనలో ఉన్నారు. వారు ర్యాలీలు నిర్వహించేది ఎన్నికల్లో గెలవడానికి కాదు. అవినీతి సొమ్మును కాపాడుకోడానికి' అని మోదీ ఎద్దేవా చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే అవినీతిపై అతిపెద్ద నిర్ణయం తీసుకోనున్నట్టు మోదీ తెలిపారు. అధికారంలోకి వచ్చాక కమీషన్లు తీసుకోవడమే ఇండియా కూటమి లక్ష్యమని, అయితే, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఒక మిషన్ ఉందని మోదీ చెప్పారు. భారతదేశానికి ప్రాధాన్య పార్టీగా బీజేపీ మారిపోయిందని మోదీ మరో సందర్భంలో వ్యాఖ్యానించారు. బీజేపీ 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మోదీ 'ఎక్స్'లో శనివారం శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ తమ ఆకాంక్షలను నెరవేర్చే పార్టీ అని యువత భావిస్తున్నారని, 21వ శతాబ్దంలో దేశానికి నాయకత్వం అందించే పార్టీగానూ చూస్తున్నారని తన సందేశంలో మోదీ పేర్కొన్నారు. సుదీర్ఘకాలం దేశాన్ని పాలించినవారికి 'హాల్‌మార్క్'లా ఉండే అవినీతితోపాటు వారసత్వ, కులతత్వ, మతతత్వ, ఓటుబ్యాంకు రాజకీయాల నుంచి దేశానికి బీజేపీ విముక్తి కలిగించిందన్నారు.

మోదీకి చరిత్ర తెలియదు



ప్రధాని మోదీకి చరిత్ర పట్ల అవగాహన లేదని ఏఐసీసీ నేత జైరామ్ రమేశ్ అన్నారు. "జన్ సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ 1940ల్లో ముస్లింలీగ్‌తో కలిసి పశ్చిమబెంగాల్ సంకీర్ణ ప్రభుత్వంలో అధికారం పంచుకున్నారు. సింధ్, నార్త్ - వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్సుల్లో ముస్లిం లీగ్‌తో కలిసి హిందూ మహాసభ ప్రభుత్వం నడిపింది. మోదీకి తన పార్టీ రాజకీయాల పట్లా అవగాహన లేదు" అని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్ ఎన్నికల ప్రణాళికను తలపిస్తోందన్న మోదీ వ్యాఖ్యలపై జైరామ్ ఇలా స్పందించారు. కాగా, దేశ ప్రతిష్ఠను, ప్రజాతంత్రాన్ని ప్రధాని మోదీ తన చర్యలతో దెబ్బ తీస్తున్నారని ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ అన్నారు. ఇతర పార్టీల నేతలను బీజేపీలో చేర్చుకోవడానికి అన్నిరకాల వ్యూహాలను బీజేపీ అమలుచేస్తోందని ధ్వజమెత్తారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో సోనియా పాల్గొన్నారు. తనను తాను గొప్పవాడిగా భావించే మోదీ హయాంలో అన్ని వ్యవస్థల్లో భయం అలుముకున్నదన్నారు. మోదీని అబద్ధాల నేతగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు.

సలహాలిస్తాం.. గెలిపించేస్తాం!



ఎన్నికల వ్యూహకర్తలకు డిమాండ్

» టికెట్ల పంపిణీ నుంచి ప్రచారం వరకూ అంతా వీరి సలహాలు, సూచనలతోనే

» తెరవెనుకే వ్యూహాలు.. ఎత్తులు, పైఎత్తులు

వేసవిలో ఎండలతోపాటు దేశంలో ఎన్నికల వాతావరణం కూడా వేడెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అభ్యర్థులను ప్రకటించే పనిలో బిజీగా ఉన్నాయి. ఈసారి ఎన్నికల్లో వ్యూహకర్తల పాత్ర కీలకంకానుంది. ఇప్పటికే వేలాది మంది వ్యూహకర్తలు తమను ఎంచుకొన్న అభ్యర్థుల విజయం కోసం రంగంలోకి దిగారు. ప్రత్యర్థులను ఇరుకున పెట్టేలా ఎత్తుగడలు వేయడం, తమ అభ్యర్థికి సలహాలు, సూచనలు ఇవ్వడమే వీరి ప్రధాన బాధ్యత. తెరవెనుకే ఉంటూ ఎన్నికల వ్యూహాలకు నిరంతరం పదును పెడుతూ.. టికెట్ల పంపిణీ నుంచి ప్రచారం వరకూ అన్ని బాధ్యతలు తలకెత్తుకుని అభ్యర్థుల విజయానికి అవిశ్రాంత కృషి చేస్తుంటారు. సమయానుకూలంగా వ్యూహాలు రచించే సత్తా ఉన్నవారిని రాజకీయ పార్టీలు రూ.కోట్లు వెచ్చించి మరీ వ్యూహకర్తలుగా నియమించుకుంటున్నాయి. పోలింగ్ నిపుణులు, వ్యూహకర్తల రంగప్రవేశంతో పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. కేవలం భావోద్వేగాలు, ప్రజా సమస్యలువంటి అంశాలతోనే ఎన్నికల్లో పోరాడటమనేది ఇప్పుడు కుదిరే పనికాదు. సాంకేతిక పరిజ్ఞానం, ఫలితాలను తారుమారు చేయగలిగిన సామర్థ్యం కలిగిన నిపుణులతో నేడు ఎన్నికల ప్రక్రియ మరింత శక్తిమంతంగా మారింది. రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థులకు మద్దతుగా నిలిచేందుకు ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చెందిన సర్వే నిపుణులు, సలహాదారులు, ప్రసంగ రచయితలు, డేటా విశ్లేషకులు, సాంకేతిక, ఏఐ నిపుణులతో కూడిన బృందం తెరవెనుక సిద్ధంగా ఉంటోంది. ఈ సంస్థలు వ్యూహాత్మక ప్రణాళికలు, ప్రచార నిర్వహణ, కమ్యూనికేషన్, మెసేజింగ్, ఓటర్ల నాడిని పట్టే సర్వేలు చేపట్టి వాటి ఫలితాలను విశ్లేషించడంతోపాటు డిజిటల్ మార్కెటింగ్ సేవలను పార్టీలు, అభ్యర్థులకు అందిస్తాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకపాత్ర పోషించింది. అప్పట్లో మోదీ తరఫున ఎన్నికల ప్రచార బాధ్యతలు చేపట్టిన సిటిజన్స్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్ (సీఏజీ) దేశంలోని మిగిలిన ప్రాంతాల్లోనూ 'గుజరాత్ మోడల్'ను అనుకరించగల, అభివృద్ధిని కాంక్షించే బలమైన నాయకుడిగా బీజేపీకి చెందిన మోదీకి విస్తృతంగా ప్రచారం కల్పించడంలో సఫలీకృతమైంది. అప్పటినుంచి రాజకీయ కన్సల్టెంట్లు, ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సంస్థలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం ఆప్, కాంగ్రెస్, టీఎంసీ, బీజేడీపార్టీలూ అదేబాటలో నడుస్తున్నాయి.

సోషల్ మీడియా యుగంలో పోల్ ప్లానింగ్

రాజకీయ సందేశాలు ప్రజలకు చేరేందుకు రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా కీలకంగా మారడంతో దీనిపై పెట్టుబడి ప్రచార నిర్వహణలో కీలకమవుతోంది. ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సంస్థలు సోషల్‌మీడియా నిపుణులు, కంటెంట్ రైటర్లతో బృందాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పార్టీలు ఎన్నికల్లో ప్రచారానికి హోలోనెట్, హోలోఫాన్స్, హోలోబాక్సెస్ వంటి ఆన్‌లైన్ వేదికలనూ వాడుకొనే పనిలో ఉన్నాయి.

వినూత్నంగా ప్రచారం

డిజిటల్ ప్రచారం, ప్రణాళికలను నిర్వహించే సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వ్యూహకర్తలే ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సంస్థలకు ప్రధాన బలం. అగ్రశ్రేణి నాయకులు, పెద్ద రాజకీయ పార్టీలతో కలిసి పనిచేస్తున్న ఈ సంస్థలు ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలోనూ, దేశంలో ఎన్నికల్లో పోరాడే విధానాన్ని సమూలంగా మార్చేయడంలోనూ కీలకపాత్ర పోషించాయి. ప్రస్తుతం రాజకీయ పార్టీలు చేసే వ్యయంలో ఎక్కువ భాగం రాజకీయ కన్సల్టెన్సీల కనుసన్నల్లోనే చేస్తున్నాయి. దేశంలోని చిన్న, పెద్ద వ్యూహకర్తలు తాము అందించే సేవలకు ప్రస్తుతం ఒక్కో నియోజకవర్గానికి రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. 8-10 మంది సభ్యుల బృందానికి ఒక ఎంపీ అభ్యర్థి నుంచి రూ.5 నుంచి రూ.10లక్షల వరకూ చార్జి చేస్తారు. బడా పొలిటికల్ కన్సల్టెంట్లు రాజకీయపార్టీలకు రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకూ ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నాయి. కాగా తమ విజయానికి క్రెడిట్‌ను వేరొకరితో పంచుకోవడానికి అంతగా ఇష్టపడని రాజకీయనాయకులు అందుకోసం కృషి చేసిన వ్యూహకర్తల సహకారాన్ని గుర్తించడం చాలా అరుదు. అందువల్లే వ్యూహకర్తల పాత్ర తెరవెనుకకే పరిమితమైంది. - సెంట్రల్ డెస్క్

44 డిగ్రీలు దాటేసింది!

- ఎండ వేడితో రారెత్తిన రాష్ట్రం
- ఏడు ప్రాంతాల్లో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత
- అనేక ప్రాంతాల్లో 40 డిగ్రీలు
- రాష్ట్ర వ్యాప్తంగా నేడు, రేపు కొనసాగనున్న వడ గాడ్పులు



విశాఖపట్నం/అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఇంకా మే నెల రానే లేదు. అయినా.. రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. శనివారం రాష్ట్రంలోని ఏడు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44.9 డిగ్రీలుగా నమోదయ్యాయి. దీంతో తీవ్రమైన వేడి దీనికితోడు వడగాడ్పులు తోడవడంతో రాష్ట్రం మండిపోయింది. రాష్ట్రంలోని సగానికిపైగా మండలాల్లో వడగాడ్పులు వీచాయి. రాయలసీమలో నంద్యాల, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు, కోస్తాలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం రాష్ట్రంలోని 127 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 231 మండలాల్లో వడగాడ్పులు వీచాయని పేర్కొంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 7 డిగ్రీలు, అక్కడక్కడా 8 డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. అనేకచోట్ల 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రావికమతం, నందికొట్కూరు, నరసరావుపేట, భామిని, జియ్యమ్మవలస, మక్కువ, కురుపాంలలో 44.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ వేసవి సీజన్‌లో ఒకే రోజు ఏడుచోట్ల 44.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకావడం ఇదే తొలిసారని వాతావరణ నిపుణులు తెలిపారు. ఆదివారం 66 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 222 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కాగా, ఆదివారం కోస్తాలో అక్కడక్కడా ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



భృంగి వాహనంపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు

శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం

- భృంగివాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన భ్రమరాంబ

శ్రీశైలం, ఏప్రిల్ 6: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామివారి యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉగాది మహోత్సవాలు ఈ నెల పదోతేదీన ముగుస్తాయి. ఉగాది ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు స్వామి, అమ్మవార్లకు భృంగివాహన సేవ నిర్వహించారు. అదే విధంగా మహాలక్ష్మీ అలంకారణలో భ్రమరాంబికాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీవారి సేవలో జస్టిస్ కిరణ్మయి

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.కిరణ్మయి తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ఆమెకు రంగనాయక మండపంలో వేద పండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



తిరుమల ఆలయం వద్ద జస్టిస్ కిరణ్మయి

వైసీపీకి యామినీబాల గుడ్‌బై

శింగనమల, ఏప్రిల్ 6: అనంతపురం జిల్లా శింగనమల మాజీ ఎమ్మెల్యే యామినీబాల వైసీపీకి శనివారం రాజీనామా చేశారు. ఈ ఎన్నికల్లో యామినీబాల, ఆమె తమ్ముడు అశోక్ వైసీపీ శింగనమల టికెట్ ఆశించినా నిరాశే ఎదురైంది. ఈ క్రమంలో యామినీబాల పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. తన రాజీనామా లేఖను ఫ్యాక్స్ ద్వారా పార్టీ అధినాయకత్వానికి పంపారు. ఆమె టీడీపీలో చేరే అవకాశం ఉంది.

అనంతబాబూ.. గో బ్యాక్

- వైసీపీ ఎమ్మెల్సీకి మరోసారి నిరసన సెగ
- గ్రామంలోకి రాకుండా అడ్డుకున్న గిరిజనులు
- వైసీపీ ప్రభుత్వం పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయలేదని ఆందోళన
- వారిపై తుపాకీ మడమతో పోలీసుల దాడి
- ఇద్దరు గిరిజన యువకులకు గాయాలు



అల్లూరి జిల్లా కూటూరులో అనంతబాబును అడ్డుకుంటున్న గిరిజనులు





పోలీసులు తుపాకీ మడమతో కొట్టడంతో గాయపడిన యువకులు

కూనవరం, ఏప్రిల్ 6: దళిత డ్రైవర్ హత్య కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు మరోసారి నిరసన సెగ తగిలింది. తమ గ్రామంలోకి రావద్దంటూ గిరిజన యువకులు ఆయన్ను అడ్డుకున్నారు. శనివారం అల్లూరి జిల్లా కూనవరం మండలంలో అనంతబాబు పర్యటనలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కూటూరు గ్రామ పర్యటనకు అనంతబాబు రాత్రి సమయంలో వెళ్లగా గిరిజన యువకులు అడ్డుకున్నారు. 'అనంతబాబు గో బ్యాక్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజన యువకులకు, అనంతబాబు వెంట వచ్చిన వైసీపీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ నెలకొంది. ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేసిందని, పోలవరం నిర్వాసితులుగా తాము అన్నీ నష్టపోతున్నా పట్టించుకోలేదన్నారు. గిరిజనులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలవలేదంటూ అనంతబాబుతో వాగ్వాదానికి దిగారు. ఏటా వరదలు వస్తున్నాయని, తరచూ ముంపునకు గురవుతున్నా గిరిజనులను పట్టించుకోవడంలేదన్నారు. గిరిజనులకు ఉద్యోగాలు ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. తక్షణమే అనంతబాబు గ్రామం విడిచి వెళ్లిపోవాలంటూ పట్టుబట్టారు. అనంతబాబు గ్రామంలోకి అడుగుపెట్టకుండా గిరిజన యువకులు వలయంగా ఏర్పడటంతో పోలీసులు వారిపై దాడి చేశారు. విడియం రాము అనే యువకుడి తలపై తుపాకీ మడమతో కొట్టడంతో తీవ్ర గాయమైంది. మరో యువకుడు సోడె వినోద్‌కు తుపాకీ మడమతో కొట్టడంతో వీపుపై బలమైన గాయమైంది. గ్రామస్థులు గాయాలపాలైన వారిని కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమకు న్యాయం జరగలేదని ప్రశ్నిస్తే పోలీసులతో కొట్టించడమేంటని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. డీజీపీ, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా ఇటీవల కాకినాడ జిల్లాలో అనంతబాబును దళితులు అడ్డుకున్నారు.



వైసీపీ పాలనలో ముస్లింలకు రక్షణ లేదు

- టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో పథకాలు పెట్టారు
- జగన్ వచ్చాక వాటిని రద్దు చేశారు: భువనేశ్వరి
- నంద్యాలలో ముస్లిం మహిళలతో మాటామంతీ
- టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



నంద్యాల జిల్లా నాగలూటి గ్రామంలో చిన్నమాసూం కుటుంబాన్ని పరామర్శిస్తున్న భువనేశ్వరి

నంద్యాల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ముస్లింలకు రక్షణ లేకుండా పోయిందని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని, జగన్ వచ్చాక వాటిని రద్దు చేశారన్నారు. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు ఆమె చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర నంద్యాల జిల్లాలో మూడో రోజు శనివారం కొనసాగింది. నందికొట్కూరు నియోజకవర్గం మిడ్తూరు మండలం నాగలూటి గ్రామానికి చెందిన చిన్న మాసూం కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. అదేవిధంగా కల్లూరు అర్బన్ పరిధిలోని టీడీపీ కార్యకర్త బోయ నరసింహులు కుటుంబాన్ని పరామర్శించారు. అంతకుముందు నంద్యాల శివారులో ముస్లిం మహిళలతో ఏర్పాటు చేసిన మాటామంతీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య ఘటనను ప్రస్తావించారు. వైసీపీ వేధింపులు తాళలేక ఇంటిల్లిపాది ప్రాణాలు తీసుకోవడం చాలా బాధాకరమన్నారు. "టీడీపీ హయాంలో రంజాన్ తోఫా, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రూ.240 కోట్ల సబ్సిడీ, ఇమామ్‌లకు రూ.5 వేలు, మౌజాన్లకు రూ.3 వేలను అందించారు. వైసీపీ పాలనలో మైనారిటీలకు ఏమీ చేయకపోగా, ఉన్న వాటిని లాక్కున్నారు. రాష్ట్రంలోని 30 వేల ఎకరాల వక్ఫ్ భూములను వైసీపీ నేతలు ఆక్రమించారు. చంద్రబాబు హయాంలో అనేక కంపెనీలు రాష్ట్రానికి వస్తే, జగన్ వాటిని తరిమేసి యువతకు ఉపాధి లేకుండా చేశాడు. రాష్ట్రాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదంటూ ఎక్కడ ప్రశ్నిస్తారోనన్న ఉద్దేశంతో జగన్ వారిని మత్తులో ముంచెత్తేందుకు రాష్ట్రాన్ని డ్రగ్స్ మయంగా మార్చాడు. రాష్ట్రాన్ని అన్నివిధాలుగా నాశనం చేశాడు. పింఛన్లు ఇవ్వడం చేతగాక అవ్వాతాతలను, నడవలేనివారిని ఇబ్బంది పెడుతూ, ఆ నెపం టీడీపీపై నెడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దె దించి, టీడీపీకి ఓటు వేయండి' అని భువనేశ్వరి కోరారు.

అగ్నికుల్ రాకెట్ ప్రయోగం వాయిదా

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6: అగ్నికుల్ రాకెట్ ప్రయోగం వాయిదాపడింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి శనివారం ఉదయం ప్రయోగించాల్సిన రాకెట్‌ను గాలుల తీవ్రత అధికంగా ఉండడం, సాంకేతిక లోపంతో వాయిదావేశారు. అగ్నికుల్ రాకెట్‌ను శనివారం ఉదయం 6 గంటలకు ప్రయోగించేందుకు ఏర్పాట్లుచేశారు. శుక్రవారం రాత్రి 12 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగాన్ని ఉదయం 7.45 గంటలకు వాయిదా వేశారు.

రాష్ట్రంలో మాఫియా రాజ్యం!

- నాసిరకం మద్యంతో పేదల ప్రాణాలు పోతున్నాయి
- అప్పుల కోసం రాష్ట్ర సచివాలయం, గనులూ తాకట్టు
- ఉద్యోగులకు సకాలంలో జీతాలివ్వలేని దుస్థితి
- ఇలాంటి పాలన మనకు అవసరమా?: పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 6: రాష్ట్రంలో మాఫియా రాజ్యం నడుస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విమర్శించారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికే తెలుగుదేశం, జనసేన పార్టీలతో కూటమి కట్టామని చెప్పారు. రాజమహేంద్రవరంలో బీజేపీ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యాలయాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం పార్టీ ముఖ్యనేతల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇసుక, మైనింగ్, మద్యం మాఫియాలతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతున్నారని, ప్రజలకు విముక్తి కావాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అని గుండెలు బాదుకోవడం కాదని, వారి సమస్యలపట్ల గుండె స్పందించాలని హితవు పలికారు. కవితకు కాదేదీ అనర్హం అని మహాకవి శ్రీశ్రీ అన్నారని, సీఎం జగన్ కబ్జాలు, అక్రమాలకు దేన్నీ వదలడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సచివాలయం, గనులను కూడా తాకట్టు పెట్టి అప్పులు తెస్తున్నారని, అప్పులేకపోతే ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని దౌర్భాగ్య స్థితి రాష్ట్రంలో ఉందని పేర్కొన్నారు. నాసిరకం మద్యంతో పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, కుటుంబాలు ఛిద్రమై ఎంతోమంది చనిపోయారని, వారి బిడ్డలు అనాథలయ్యారని చెప్పారు. ఇటువంటి పరిపాలన మనకు అవసరమా అని ఆమె ప్రశ్నించారు.



ముద్రగడ పద్మనాభం వేదిక వద్దకు చేరుకున్న సమయంలో వెనుక ఖాళీగా ఉన్న కుర్చీలు

వైసీపీ కాపుల సమావేశం వెలవెల

ఇరగవరం, ఏప్రిల్ 6: పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణంలో శనివారం వైసీపీ నిర్వహించిన కాపుల ఆత్మీయ సభ వెలవెలబోయింది. సమావేశానికి కాపు వర్గీయులు తక్కువ సంఖ్యలో పాల్గొనడంతో జనాలను సమీకరించడానికి వైసీపీ నాయకులు సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ 11.30 గంటలకు ప్రారంభమైంది. 10.30కే ముద్రగడ వేదిక వద్దకు చేరుకున్నారు. అప్పటికీ కాపు సోదరులు హాజరు కాకపోవడంతో నాయకుల్లో నిరాశ వ్యక్తమైంది. 12 గంటల తరువాత సభా ప్రాంగణం కొద్దికొద్దిగా నిండింది. అయితే సమావేశంలో సగానికి పైగా ఇతర సామాజిక వర్గీయులు పాల్గొనడం గమనార్హం.

అనకాపల్లి జిల్లా మునగపాక, ఎలమంచిలి మండలం సోమలింగపాలెంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి భారీగా అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.49.35 లక్షలు విలువైన 39,168 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

ఔను... కలికాలమే!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ మధ్య 'కలికాలం' గురించి ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. రాజకీయాల్లో విలువలు, నైతికత లోపించడం చూస్తే కలికాలం గుర్తుకొస్తోందని అంటున్నారు. ఆయన ఏ ఉద్దేశంతో ఈ మాటలు అంటున్నారోగానీ... మనం ఇప్పుడు కలికాలంలోనే ఉన్నాం! కృత యుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం తర్వాత కలికాలం వస్తుందని పురాణాల్లో చెప్పారు. మనం ఇప్పుడు కలికాలంలోనే జీవిస్తున్నాం. న్యాయం, ధర్మం స్థానంలో అధర్మం, అన్యాయం రాజ్యమేలుతోంటే కలికాలంకాక మరేమిటి? జగన్మోహన్ రెడ్డి వంటి వారు అధికారంలోకి రావడం కలికాలానికి సంకేతంకాక మరేమిటి? ప్రజలు కూడా న్యాయానికి, అన్యాయానికి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించలేని స్థితికి చేరుకోవడం, మారీచుల వంటి వారు మహానుభావులుగా గుర్తింపు పొందడం కలికాలం లక్షణమే! రక్తం పంచుకు పుట్టినవాళ్లు తమకు న్యాయం చేయవలసినదిగా ఆర్తనాదాలు చేస్తున్నప్పటికీ చెవికెక్కించుకోకుండా దర్పోపన్యాసాలు చేయడం సాధారణ వ్యక్తులకు సాధ్యమా? తమ చిన్నాన్నను హత్య చేసింది, చేయించింది ఎవరో ఆ దేవుడికి, కడప జిల్లా ప్రజలకే తెలుసునని జగన్మోహన్ రెడ్డి తన బస్సు యాత్ర ప్రారంభం సందర్భంగా చెప్పుకొచ్చారు. కలికాలంలో కలి ప్రభావం కారణంగా దేవుళ్లు నిమిత్తమాత్రులవుతారు, పాలకులే శక్తిమంతులుగా అవతరిస్తారు. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డిని ఎవరు హత్య చేశారో, చేయించారో దేవుడికంటే పాలకులకే తెలుస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వివేకానంద రెడ్డిని హత్య చేయించింది నాటి ముఖ్యమంత్రి చంద్రబాబే అని నిందించిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఐదేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో హంతకులెవరో ఆ దేవుడికి ఎరుక అనడం ఏమిటి?

> తెలంగాణలో తొమ్మిదిన్నరేళ్లపాటు రారాజుగా వెలుగొందిన కేసీఆర్ ప్రస్తుత పరిస్థితి చూసిన తర్వాత ఈ ఎన్నికల్లో ఓడిపోతే జగన్మోహన్ రెడ్డి పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఉండబోదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ ప్రభావంతో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినా... భారత రాష్ట్ర సమితికి క్షేత్రస్థాయిలో పునాదులు బలహీనంగా ఉన్నాయని ఇప్పుడు తేటతెల్లం అయింది. రాజశేఖర రెడ్డి ప్రభావంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ కూడా సంస్థాగతంగా బలహీనంగానే ఉంది. అధికారం లేకపోతే ఆ పార్టీ మనుగడ సాగించడం కష్టతరం. తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తలు ఉన్నారు. ఈ కారణంగానే నాయకులు లేకపోయినా, ఎన్నికల్లో ఓడిపోయినా ఆ పార్టీ నిలదొక్కుకుంది. దీనికి తోడు చంద్రబాబుకు భూదేవికి ఉన్నంత ఓర్పు ఉంది. ఫలితంగా పార్టీని కాపాడుకోగలిగారు. జగన్మోహన్ రెడ్డి పరిస్థితి వేరు. ముఖ్యమంత్రిగా ఈ ఐదేళ్లలో ఆయన వైఖరి గమనించిన వారికి ఆయనతో బలమైన అనుబంధం ఏర్పడలేదు.

నాన్న, చిన్నాన్న... మరణాలతో రాజకీయం

ఐదేళ్లు వెనక్కు వెళితే, వివేకానంద రెడ్డి హత్య విషయంలో జగన్మోహన్ రెడ్డి మాటలు నిజమేనని గుడ్డిగా నమ్మి... ఆయన సోదరీమణులు బాసటగా నిలిచారు. 2019 ఎన్నికల్లో జగన్‌కు రాజకీయ లబ్ధి కలిగేలా ప్రచారం కూడా చేశారు. సీన్ కట్ చేస్తే ఐదేళ్ల తర్వాత వివేకానంద రెడ్డిని హత్య చేసిన వారిని ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్ రెడ్డి రక్షిస్తున్నారని ఆయన తోబుట్టువులే చెబుతున్నారు. జగన్ ప్రభుత్వం రక్తంలో తడిసిందని వివేకా కుమార్తె డాక్టర్ సునీత ఆరోపిస్తుండగా, తమ చిన్నాన్నను హత్య చేయించిన వారికి అండగా ఉంటూ మళ్లీ ఎంపీ టికెట్ ఇచ్చిన కారణంగానే తాను కడప నుంచి పోటీ చేస్తున్నానని షర్మిల అంటున్నారు. ముసుగులు తొలగిపోయాయి. వివేకా హత్య కేసులో ముద్దాయిగా ఉన్న అవినాశ్ రెడ్డిపై వారిరువురూ నేరుగా బాణాలు ఎక్కుపెట్టారు. వైఎస్ రాజశేఖర రెడ్డి జీవించి ఉంటే వివేకా హత్యకు కారణమైన అవినాశ్ రెడ్డికి ఎప్పుడో శిక్ష పడి ఉండేదని షర్మిల తాజాగా చెప్పుకొచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం తాను అక్కచెల్లెమ్మల జీవితాల్లో ఆనందం చూడటం కోసమే పని చేశానని, ఈ ఎన్నికల్లో అవకాశం ఇస్తే మళ్లీ వారికోసం పనిచేస్తానని చెబుతున్నారు. అయితే... ఆ అక్కచెల్లెమ్మల జాబితాలో ఆయన తోబుట్టువులైన షర్మిల, సునీత ఉన్నారా? లేరా? అన్నదే ఇప్పుడు ప్రశ్న! ప్రజలు ఇప్పుడు ఎవరి మాటలు నమ్మాలి? ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పేది నిజం అనుకోవడానికి దాఖలాలు లేవు. వివేకానంద రెడ్డి హత్య విషయం పక్కన పెడితే... హెలికాప్టర్ ప్రమాదంలో రాజశేఖర రెడ్డి మరణం వెనుక కుట్ర జరిగిందని, అప్పట్లో యూపీఏ ప్రభుత్వ సారథి సోనియాగాంధీ రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ సహకారంతో రాజశేఖర రెడ్డిని చంపించారని జగన్మోహన్ రెడ్డి ఊరూవాడా ప్రచారం చేశారు. జనం కూడా కొంతవరకు నమ్మారు. తన రక్తం పంచుకుపుట్టిన జగన్ చెప్పింది నిజమేనని నమ్మిన షర్మిల కూడా అదే విధంగా ప్రచారం చేశారు. మళ్లీ సీన్ కట్ చేస్తే, ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్మోహన్ రెడ్డి తన తండ్రి మరణం వెనుక ఫలానా వారు ఉన్నారని ప్రస్తావించనే లేదు. పైపెచ్చు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తండ్రి మరణానికి కారకుడు అని నిందించిన రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీని తన ఇంటికి ఆహ్వానించి ఆయన కోరిన విధంగా పరిమళ్ నత్వానీ అనే వ్యక్తికి రాజ్యసభ సభ్యత్వం కట్టబెట్టారు. దాంతో వైఎస్ రాజశేఖర రెడ్డి మరణం గురించి జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రచారం బూటకం అని తేలిపోతున్నది కదా? ఆ సంఘటన తర్వాత రాజశేఖర రెడ్డి సోదరుడైన వివేకానంద రెడ్డి తన సొంత ఇంట్లోనే దారుణ హత్యకు గురయ్యారు. 2019 ఎన్నికలకు ముందు ఈ హత్య జరగడంతో జగన్మోహన్ రెడ్డి యథావిధిగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును నిందితుడిగా ప్రచారం చేశారు. ప్రజలు కూడా కొంత వరకు నమ్మారు. అటు వివేకా కుమార్తె డాక్టర్ సునీత, ఇటు సొంత చెల్లెలు షర్మిల కూడా నిజమేనని నమ్మి ఆ మేరకు ప్రచారం చేశారు. కాలక్రమంలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. వివేకాను హత్య చేసిన వారిలో ఒకరైన దస్తగిరి అప్రూవర్‌గా మారి... ఈ హత్య చేయించింది ఎవరో చెప్పారు. ఈ వాస్తవాన్ని డాక్టర్ సునీతతోపాటు షర్మిల కూడా జీర్ణించుకోలేకపోయారు.

అయినా కొంత కాలం పాటు సోదరుడైన జగన్మోహన్ రెడ్డి మాటలను నమ్మారు. చివరకు హత్యకు కారకుడని విచారణలో తేటతెల్లమవుతున్న అవినాశ్ రెడ్డికి మద్దతుగా సాక్షాత్తు జగన్మోహన్ రెడ్డే నిలబడటాన్ని గ్రహించి జీర్ణించుకోలేకపోయారు. ఫలితంగానే... కడప లోక్‌సభ బరిలో అన్నా చెల్లెళ్లు బహిరంగంగా తలపడే పరిస్థితి ఉత్పన్నమైంది. తమ చిన్నాన్నను హత్య చేయించిన అవినాశ్ రెడ్డికి జగన్మోహన్ రెడ్డి మళ్లీ టికెట్ ఇవ్వడాన్ని ప్రస్తుతం పీసీసీ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిల ప్రశ్నించడంతోపాటు... అవినాశ్ రెడ్డిపై కాంగ్రెస్ తరఫున పోటీకి దిగారు. సోదరికి బాసటగా వివేకా కుమార్తె డాక్టర్ సునీత కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. వివేకాను దారుణంగా చంపించిన అవినాశ్ రెడ్డిని ఓడించాలని కడప జిల్లా ప్రజలకు ఆ ఇరువురు ఆడపడుచులూ విజ్ఞప్తి చేస్తున్నారు.

అవును... కడప ప్రజలకు క్లారిటీ...

మరోవైపు అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్ రద్దుకోసం సీబీఐ అధికారులు సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని తెలంగాణ హైకోర్టు తాజాగా ప్రశ్నించింది. అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దు కోసం దస్తగిరి పెట్టుకున్న పిటిషన్‌పై హైకోర్టు సానుకూల ఆదేశాలు ఇస్తే ఎన్నిక జరిగేలోపే అవినాశ్ రెడ్డి జైలుకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో తనను ఒంటరిని చేసి రాజకీయ ప్రత్యర్థులందరూ తోడేళ్ల గుంపుగా ఒక్కటై దాడి చేస్తున్నారని, తన వాళ్లు కూడా ఒకరిద్దరు వారికి తోడయ్యారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోపించడం మొదలెట్టారు. ఈ సందర్భంగానే కలికాలం గురించి ఆయన ప్రస్తావిస్తున్నారు. ఈ ఎపిసోడ్‌లో తమాషా ఏమిటంటే... తల్లి విజయలక్ష్మి అటు జగన్మోహన్ రెడ్డి విజయం కోసం, ఇటు షర్మిల విజయం కోసం ప్రార్థనలు చేశారు. దీంతో ఎవరికి ఆశీస్సులు ఇవ్వాలో తెలియని సంకట స్థితిని జీసస్ క్రీస్తుకు కల్పించారు. రాజశేఖర రెడ్డి మరణం తర్వాత జరిగిన సంఘటనలు, చేసిన ప్రచారాలను పరిగణనలోకి తీసుకుంటే కలికాలానికి తగ్గట్టుగానే జగన్మోహన్ రెడ్డి ప్రవర్తిస్తున్నారని అనిపిస్తుంది. ధర్మం, న్యాయం కోసం సునీత, షర్మిల పోరాటం చేస్తున్నారని నమ్మాల్సిన పరిస్థితి. అయితే... కడప జిల్లా ప్రజలకు మాత్రం వివేకా హత్య వెనుక ఎవరున్నారన్న దానిపై స్పష్టత ఏర్పడిందని తెలుస్తోంది. ఎన్నికల కురుక్షేత్రంలో అవినాశ్‌ను నేరుగా ఢీకొనాలని షర్మిల నిర్ణయించుకొని బరిలోకి దిగడంతో ప్రజలకు మరింత స్పష్టత వచ్చింది. ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కూడా బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ అవినాశ్, షర్మిల మధ్యనే అనే భావన ప్రజల్లో ఏర్పడింది. తన తండ్రి వివేకా హత్య కేసులో న్యాయం జరగాలంటే జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రాకూడదని డాక్టర్ సునీత ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు రాజశేఖర రెడ్డి బిడ్డగా న్యాయం, ధర్మం కోసం తనకు అండగా నిలవాలని ఓటర్లను షర్మిల వేడుకుంటున్నారు.



పని చేయని 'మైండ్‌గేమ్'...

ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఇడుపులపాయ నుంచి ప్రారంభమైంది. అయితే కడప జిల్లాలో కూడా బస్సు యాత్రకు స్పందన అంతంత మాత్రంగానే లభించింది. ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన బస్సు యాత్రలో పాల్గొనడానికి ఇతర జిల్లాలకు చెందిన వైసీపీ నాయకులు కూడా వెళ్లారు. ఇలా వెళ్లిన కొంతమంది నాయకులు కడప జిల్లా ప్రజల మనోగతాలను గుర్తించి ఇతర పార్టీలలో చేరేందుకు దారులు వెదుక్కుంటున్నారు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో బస్సు యాత్ర ముగిసింది. రోత మీడియాతోపాటు కూలి మీడియా ప్రచారం ఎలా ఉన్నప్పటికీ ప్రజల నాడి ఏమిటో ముఖ్యమంత్రి జగన్‌కు అవగతమవుతోంది. దీంతో ఆయన మరో మాయోపాయానికి తెరతీశారు. బీజేపీతో తెలుగుదేశం–జనసేన పార్టీల మధ్య పొత్తు కుదిరిన తర్వాత ఈ సరికొత్త ఎత్తుగడను జగన్ అండ్ కో అమలు చేస్తున్నారు. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన కొన్ని సీట్ల విషయంలో కొంత వ్యతిరేకత ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకున్న జగన్ అండ్ కో పొత్తుల తర్వాత జగన్మోహన్ రెడ్డి గ్రాఫ్ పెరిగిందని, కూటమి బలం క్షీణించిందని ప్రచారం చేయడం మొదలుపెట్టింది. దీనికి దన్నుగా కొన్ని సర్వే సంస్థలకు డబ్బులిచ్చి తమ ప్రచారానికి మద్దతుగా సర్వే వివరాలు అంటూ కొన్ని గణాంకాలను జనంలోకి వదలడం మొదలుపెట్టారు. ఈ మర్మం తెలియని జగన్ వ్యతిరేకులు సైతం ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఈ మధ్య బలపడ్డారట కదా? అని ప్రశ్నించడం మొదలైంది. వాస్తవానికి ఇదంతా జగన్ అండ్ కో ఆడుతున్న మైండ్ గేమ్. క్షేత్ర స్థాయిలో జగన్ బలం పెరగడానికి ఈ పక్షం రోజులలో చోటుచేసుకున్న మార్పులు, పరిణామాలు కూడా లేవు. ప్రజలతో మైండ్ గేమ్ ఆడటం జగన్ అండ్ కోకు కొత్త కాదు. వివేకా హత్య, కోడికత్తి కేసుల విషయంలోనూ ఇలాగే చేశారు. క్షేత్ర స్థాయిలో జగన్‌కు బలం పెరిగిన విషయం వాస్తవమే అయితే ఇతర పార్టీలకు చెందినవారు వైసీపీలో చేరడానికి పోటీ పడేవారు. వాస్తవంలో అలా జరగడం లేదు. కొన్ని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలలో అభ్యర్థులకోసం వైసీపీ వెదుక్కోవాల్సిన పరిస్థితి. తెలుగుదేశం, జనసేన పార్టీలలో చేరేందుకు వైసీపీకి చెందినవారే పోటీ పడుతున్నారు. టికెట్ ఇస్తామన్న హామీ ఇస్తే ఇదివరకే వైసీపీలో టిక్కెట్ పొందినవారు కూడా ఈ రెండు పార్టీలలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు. వాస్తవ పరిస్థితి ఇది కాగా, జగన్ బలం పెరిగిందని కృత్రిమ ప్రచారానికి తెర లేపారు. పింఛన్ల విషయమే తీసుకుందాం! వలంటీర్ల ద్వారా పింఛన్లు వగైరా పంపిణీ చేయడానికి వీలు లేదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకొని పెన్షన్ల పంపిణీలో జాప్యం చేస్తూ అందుకు ప్రతిపక్షాలే కారణమని నమ్మించడానికి జగన్ అండ్ కో ప్రయత్నించింది. అయితే, ఆచరణలో ఇది కూడా వికటించింది. వలంటీర్ వ్యవస్థ అమలులో లేని రాష్ట్రాలలో పెన్షన్లు పంపిణీ కావడం లేదా? అని హైకోర్టు కూడా ప్రశ్నించడంతో ప్రజలు కూడా వాస్తవాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ కుయుక్తులను అర్థం చేసుకున్నారు. శవ రాజకీయాలకు చెక్ పెట్టారు.

> రోత మీడియాతోపాటు కూలి మీడియా ప్రచారం ఎలా ఉన్నప్పటికీ ప్రజల నాడి ఏమిటో ముఖ్యమంత్రి జగన్‌కు అవగతమవుతోంది. దీంతో ఆయన మరో మాయోపాయానికి తెరతీశారు. బీజేపీతో తెలుగుదేశం–జనసేన పార్టీల మధ్య పొత్తు కుదిరిన తర్వాత ఈ సరికొత్త ఎత్తుగడను జగన్ అండ్ కో అమలు చేస్తున్నారు. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన కొన్ని సీట్ల విషయంలో కొంత వ్యతిరేకత ఏర్పడింది. దీన్ని ఆసరాగా చేసుకున్న జగన్ అండ్ కో పొత్తుల తర్వాత జగన్మోహన్ రెడ్డి గ్రాఫ్ పెరిగిందని, కూటమి బలం క్షీణించిందని ప్రచారం చేయడం మొదలుపెట్టింది. దీనికి దన్నుగా కొన్ని సర్వే సంస్థలకు డబ్బులిచ్చి తమ ప్రచారానికి మద్దతుగా సర్వే వివరాలు అంటూ కొన్ని గణాంకాలను జనంలోకి వదలడం మొదలుపెట్టారు. ఈ మర్మం తెలియని జగన్ వ్యతిరేకులు సైతం ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఈ మధ్య బలపడ్డారట కదా? అని ప్రశ్నించడం మొదలైంది. వాస్తవానికి ఇదంతా జగన్ అండ్ కో ఆడుతున్న మైండ్ గేమ్. క్షేత్ర స్థాయిలో జగన్ బలం పెరగడానికి ఈ పక్షం రోజులలో చోటు చేసుకున్న మార్పులు, పరిణామాలు కూడా లేవు. ప్రజలతో మైండ్ గేమ్ ఆడటం జగన్ అండ్ కోకు కొత్త కాదు.

ఎవరు 'ముసలోడు'?

ఈ ఎన్నికలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎంత ముఖ్యమో ప్రతిపక్ష నేత చంద్రబాబుకు అంతకంటే ముఖ్యం. వయసు రీత్యా ఈ ఎన్నికల్లో విజయం సాధించడం చంద్రబాబుకు చాలా అవసరం. ఈ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాలేని పక్షంలో చంద్రబాబు రాజకీయ జీవితం ఫెయిల్యూర్‌తో ముగిసే ప్రమాదం ఉంది. అందుకే ఆయన మండుటెండలను సైతం లెక్క చేయకుండా, ముఖంలో ఎక్కడా అలసట కనపడనీయకుండా రోజుకు మూడు చోట్ల సభలు నిర్వహిస్తున్నారు. యువకుడినైన తనకు ముసలోడితో పోటీ ఏమిటని ఎద్దేవా చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం రోజుకు ఒక మీటింగ్‌తోనే సరిపెడుతున్నారు. అది కూడా సాయంత్రం పూట ఎండ వేడి తగ్గాక బయటకు వస్తున్నారు. దీంతో ఏడు పదులు దాటిన చంద్రబాబుతో ఐదు పదులు దాటిన జగన్మోహన్ రెడ్డి పోటీ పడలేక పోతున్నారన్న అభిప్రాయానికి జనం కూడా వచ్చారు. చంద్రబాబుకు మాత్రమే కాదు, యువకుడినని చెప్పుకొంటున్న జగన్‌కు కూడా ఈ ఎన్నికలు ముఖ్యమే. తెలంగాణలో తొమ్మిదిన్నరేళ్లపాటు రారాజుగా వెలుగొందిన కేసీఆర్ ప్రస్తుత పరిస్థితి చూసిన తర్వాత ఈ ఎన్నికల్లో ఓడిపోతే జగన్మోహన్ రెడ్డి పరిస్థితి కూడా అందుకు భిన్నంగా ఉండబోదన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ ప్రభావంతో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చినా... భారత రాష్ట్ర సమితికి క్షేత్ర స్థాయిలో పునాదులు బలహీనంగా ఉన్నాయని ఇప్పుడు తేటతెల్లం అయింది. రాజశేఖర రెడ్డి ప్రభావంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ కూడా సంస్థాగతంగా బలహీనంగానే ఉంది. అధికారం లేకపోతే ఆ పార్టీ మనుగడ సాగించడం కష్టతరం. తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన కార్యకర్తలు ఉన్నారు. ఈ కారణంగానే నాయకులు లేకపోయినా, ఎన్నికల్లో ఓడిపోయినా ఆ పార్టీ నిలదొక్కుకుంది. దీనికి తోడు చంద్రబాబుకు భూదేవికి ఉన్నంత ఓర్పు ఉంది. ఫలితంగా పార్టీని కాపాడుకోగలిగారు. జగన్మోహన్ రెడ్డి పరిస్థితి వేరు. ముఖ్యమంత్రిగా ఈ ఐదేళ్లలో ఆయన వైఖరి గమనించిన వారికి ఆయనతో బలమైన అనుబంధం ఏర్పడలేదు. దీనికితోడు ఆయన పాలనపై ఒక వర్గం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సంక్షేమ పథకాలే మళ్లీ తమను అధికారంలోకి తెస్తాయన్న నమ్మకంతోనే ఆ పార్టీలో ఉన్నవారు ఉన్నారు. అంతే తప్ప జగన్మోహన్ రెడ్డిపై నమ్మకం, అభిమానంతో కాదు. ఈ ఎన్నికల్లో ఓడిపోతే ఆ పార్టీ చెల్లాచెదురవుతుంది. జగన్ నిరాదరణకు గురైనవారు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పంచన చేరుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే వైసీపీలో అధిక సంఖ్యలో ఉన్నారు. ఎన్నికల్లో ఓడిపోతే వారంతా మళ్లీ కాంగ్రెస్ వైపు చూసే అవకాశం ఉంది. ఈ కారణంగానే జగన్ సోదరి షర్మిల కూడా 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే కాంగ్రెస్ నాయకత్వాన్ని చేపట్టడానికి సిద్ధపడ్డారు. గత ఎన్నికల్లో రాజశేఖర రెడ్డి కుటుంబమంతా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండింది. ఇప్పుడు ఆ కుటుంబంలో చీలిక రావడమే కాకుండా వివేకానంద రెడ్డి హంతకులను జగన్ కాపాడుతున్నారని ఇంట్లో వాళ్లే నిందిస్తున్నారు. ఇవన్నీ జగన్‌కు మైనస్ పాయింట్లు. ఈ నేపథ్యంలో మేలో జరిగే ఎన్నికలు జగన్మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును కూడా నిర్ణయించబోతున్నాయి. గత ఎన్నికల్లో జగన్‌కు ఎంతో కొంత రాజకీయంగా ఉపయోగపడిన వివేకా హత్య రానున్న ఎన్నికల్లో ఆయనకు ఏ మేరకు నష్టం చేయబోతుంది అన్నదే ప్రస్తుతం కీలకం. ఆంధ్రప్రదేశ్ ప్రజలు అన్న జగన్ మాటలను విశ్వసిస్తారా? తోబుట్టువులైన షర్మిల, సునీతల ఆక్రందనలను ఆలకిస్తారా? అన్నది జూన్ 4వ తేదీన తేలిపోతుంది. ఈ ఎన్నికల్లో జగన్ మళ్లీ గెలిస్తే వివేకా హత్యకు కారకులైన వారు నిక్షేపంగా ఉంటారు. ఓడిపోతే మాత్రం వారు చట్టం ముందు దోషులుగా నిలబడక తప్పదు. ఈ ఐదేళ్లుగా డాక్టర్ సునీత అలుపెరుగకుండా చేస్తున్న ఒంటరి పోరాటం ఫలిస్తుందా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే! కలి ప్రభావం ఇంకెంత కాలం ఉంటుందో కూడా తెలియాలంటే ఎన్నికల ఫలితాల వరకు ఎదురు చూడాల్సిందే!

> గత ఎన్నికల్లో రాజశేఖర రెడ్డి కుటుంబమంతా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండింది. ఇప్పుడు ఆ కుటుంబంలో చీలిక రావడమే కాకుండా వివేకానంద రెడ్డి హంతకులను జగన్ కాపాడుతున్నారని ఇంట్లో వాళ్లే నిందిస్తున్నారు. ఇవన్నీ జగన్‌కు మైనస్ పాయింట్లు.

> వలంటీర్ల ద్వారా పింఛన్లు వగైరా పంపిణీ చేయడానికి వీలు లేదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకొని పెన్షన్ల పంపిణీలో జాప్యం చేస్తూ అందుకు ప్రతిపక్షాలే కారణమని నమ్మించడానికి జగన్ అండ్ కో ప్రయత్నించింది. అయితే, ఆచరణలో ఇది కూడా వికటించింది. వలంటీర్ వ్యవస్థ అమలులో లేని రాష్ట్రాలలో పెన్షన్లు పంపిణీ కావడం లేదా? అని హైకోర్టు కూడా ప్రశ్నించడంతో ప్రజలు కూడా వాస్తవాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ కుయుక్తులను అర్థం చేసుకున్నారు. శవ రాజకీయాలకు చెక్ పెట్టారు. ఈ ఎన్నికలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎంత ముఖ్యమో ప్రతిపక్ష నేత చంద్రబాబుకు అంతకంటే ముఖ్యం. వయసు రీత్యా ఈ ఎన్నికల్లో విజయం సాధించడం చంద్రబాబుకు చాలా అవసరం. ఈ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాలేని పక్షంలో చంద్రబాబు రాజకీయ జీవితం ఫెయిల్యూర్‌తో ముగిసే ప్రమాదం ఉంది. అందుకే ఆయన మండుటెండలను సైతం లెక్క చేయకుండా, ముఖంలో ఎక్కడా అలసట కనపడనీయకుండా రోజుకు మూడు చోట్ల సభలు నిర్వహిస్తున్నారు.

మతాన్ని చరిత్ర అంగీకరించదు

మతం చరిత్రగా, చరిత్ర మతంగా మారిపోతున్న సమయంలో చరిత్రకు మతానికి ఉన్న సంబంధం ఏమిటనేది ప్రశ్నించుకుని సమాధానం రాబట్టుకోవలసి ఉంది. అందరికీ తెలిసిన విషయాలు కొన్ని చూస్తే మతం– వస్తువు దేవుడు. చరిత్ర ఇతివృత్తం– మనిషి. మతం తనను అనాది అంటుంది. చరిత్రకు గతం పునాది. మతం విశ్వాసం మీద నిర్మింపబడుతుంది. చరిత్ర నిజం మీద నిలబడుతుంది. మతానికి చరిత్ర ఉంటుంది కానీ చరిత్రకు మతం ఉండదు.

మతం హఠాత్తుగా మొదలౌతుంది. దేవుడు అనంతమైన విశ్వాన్ని, చరాచర జీవకోటిని సృష్టించాడని అంటుంది. ఆ శక్తి సకల చేతనాచేతనాలలోకి విస్తరించి ఉంటుందని విశ్వసిస్తుంది. శ్రీరాముడిగా శ్రీకృష్ణుడిగా అవతారాలెత్తాడని స్థిరీకరిస్తుంది. అయితే చరిత్ర ప్రతి అంశంలో ఒక పరిణామాన్ని చూసినట్లే మతంలోనూ చూస్తుంది. చరిత్ర ఆస్తికురాలూ కాదు, నాస్తికురాలూ కాదు. పరమ అజ్ఞేయవాది. అది భగవంతుని అస్తిత్వం గురించి విచికిత్స చేయదు. దేవుడు మతాన్ని సృష్టించడం గురించి మాట్లాడదు కానీ మతం దేవుణ్ణి సృష్టించుకోవడం గురించి వివరిస్తుంది. తనను పోలిన మనిషిని దేవుడు సృష్టించడం తెలియదు కానీ, తనను పోలిన దేవుణ్ణి మనిషి సృష్టించుకున్నాడంటుంది. స్థూలంగా దేవుడు చేసిన మనుషుల గురించి మతం మాట్లాడితే, మనుషులు చేసిన దేవుడి గురించి చరిత్ర మాట్లాడుతుంది.

మనిషి ప్రారంభ దశలో పశుప్రాయుడనీ పశువు మాదిరిగానే దిగంబరుడనీ, లైంగిక విచక్షణ లేనివాడనీ, ఆహార సేకరణే గానీ ఆహార ఉత్పత్తి తెలియదనీ ఆధారాలతో సహా రుజువు చేస్తుంది చరిత్ర. మతం– భగవంతుడు మనిషిని అనాగరికంగా సృష్టిస్తే అతడు రాతి, రాగి, కంచు యుగాల్ని అధిగమించి ఇనుప యుగంలోకి ప్రవేశించాడని గానీ, ఆహార సేకరణ, పశుపాలక సమాజాల్ని దాటుకుని వ్యావసాయిక సమాజంలోకి చేరుకున్నాడని గానీ చెప్పదు. మతానికి ఈ పరిణామాలతో సంబంధం లేదు. అది దేశ వ్యాపితంగా లభ్యమౌతున్న పనిముట్లు, ఆయుధాల వంటి వేలాది ఆధారాలను నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసి వేస్తుంది. కానీ చరిత్ర ఆ అపురూప సంపదల్ని పదిలపరచి వాటి ఆధారంగా మానవ పురాతన గతాన్ని పునర్నిర్మిస్తుంది.

వేదవాఙ్మయం అంతా దేవసృష్టి అంటుంది మతం. అయితే చరిత్ర... దేవతలకు– పూర్వ మానవులు అనే అర్థం చెప్పడంతో ముడి విడిపోయింది. రుగ్వేదం అంతా తొలినాటి ఆర్యగణాల్లో సృజనాత్మకత, పారలౌకిక దృష్టి ఉన్న రసహృదయులు కొందరు ప్రాకృతిక అంశాలను ఆవాహన చేస్తూ ఆశువుగా చేసిన రచనల సమాహారమే తప్ప, ఆదిభౌతిక శక్తులు సృష్టించినది కాదని చెప్పింది. యజుర్వేదంలో యజ్ఞాది కర్మకాండల నిర్వహణ, సామవేదంలో రుగ్వేద మంత్రాల ఆలాపనా విధానం తప్ప, రహస్యాలేవీ లేవని తేల్చి వేసింది. వేదం తొలి భాగమైన సంహిత మాత్రమే తొలినాటి రచన అనీ వేదాంగాలని పిలువబడిన బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు అనంతరకాలపు రచనలు అనీ, రుగ్వేద రచన క్రీ.పూ. 2000–1500 మధ్య కాలంలో జరిగిందనీ, ఉపనిషత్తులు క్రీ.పూ. 800–600 మధ్య కాలానికి చెందినవనీ కాల నిర్ణయం చేసింది. చరిత్ర ఈ నిర్ణయంలో మానవుల నాగరికతాభివృద్ధినీ, భాషా లిపుల పరిణామాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది. లిపి రూపొందకపోవడమే వేదాలు లిఖితరూపం తీసుకోకపోవడానికీ, కేవలం అనుశ్రుతంగా వల్లె వేయడానికి కారణమనీ నిర్ధారించింది. మతానికి ఈ గొడవ లేమీ లేవు. నారాయణుడి నాభి నుంచి పుట్టిన కమలంలో ఉద్భవించిన బ్రహ్మ ముఖం నుంచి వేదాలు పుట్టాయని చెప్పేస్తుంది. వ్యాసుడనే రుషి ఒక్కటిగా ఉన్న వేదాలను నాలుగుగా విభజించాడని అనేస్తుంది. సోమకుడనే అసురుడు వాటిని ఎత్తుకుపోయి సముద్రంలో దాక్కుంటే విష్ణువు మత్స్యావతారమెత్తి రక్షించాడని అంటుంది. మధ్యయుగాల దాకా లిపిబద్ధం కాని వేదాలను ఏ రూపంలో ఉండగా సోమకుడు ఎత్తుకుపోయాడో మతానికి సంబంధం లేదు.

> మతం తనను అనాది అంటుంది. చరిత్రకు గతం పునాది. మతం విశ్వాసం మీద నిర్మింపబడుతుంది. చరిత్ర నిజం మీద నిలబడుతుంది. మతానికి చరిత్ర ఉంటుంది కానీ చరిత్రకు మతం ఉండదు. మతం హఠాత్తుగా మొదలౌతుంది. దేవుడు అనంతమైన విశ్వాన్ని, చరాచర జీవకోటిని సృష్టించాడని అంటుంది. ఆ శక్తి సకల చేతనాచేతనాలలోకి విస్తరించి ఉంటుందని విశ్వసిస్తుంది. శ్రీరాముడిగా శ్రీకృష్ణుడిగా అవతారాలెత్తాడని స్థిరీకరిస్తుంది. అయితే చరిత్ర ప్రతి అంశంలో ఒక పరిణామాన్ని చూసినట్లే మతంలోనూ చూస్తుంది.



మతంలో మాదిరిగా చరిత్రలో విష్ణు, బ్రహ్మాది దేవతలు ఆది యందు ఉండరు. రుగ్వేద దేవతలలో వరుణుడిది ప్రథమస్థానం. ఇతడు దేవతలకు రాజు. తర్వాతి స్థానం యుద్ధదేవత అయిన ఇంద్రుడిది. కాగా మూడు, నాలుగు స్థానాలు అగ్ని, సోమదేవులవి. ఆకాశదేవత అయిన ద్యుస్, భూదేవత పృథ్వి, సకల దైవాల తల్లి అదితి, పశుసంరక్షక పూషన్, ఉషస్సుకు దారిచూపే అశ్వినీదేవతలు అప్పటి ఇతర దేవతలు. రుగ్వేదంలో అనేకులుగా ఉన్న సూర్యదేవతల్లో ఒకడిగా తొలిసారి కనిపించిన విష్ణువు అనంతర కాలంలో త్రిమూర్తుల్లో ముఖ్యుడిగా పరిణామం చెందాడు. మలివేదకాలపు ప్రధాన దేవత ప్రజాపతి తరువాతి కాలంలో ఎందుకో మరి కనిపించకుండా పోయాడు. సింధులోయ నాగరికతలో కొమ్ముల దేవుడిగా కనిపించిన పశుపతి, రుద్రుడై, శివుడై ఆర్య ద్రావిడ సంస్కృతీ సమ్మేళనానికి నిదర్శనంగా విష్ణువుతో కలిసి త్రిమూర్తుల్లో స్థానం పొంది మొదటిస్థానానికి పోటీదారు అయ్యాడు. తనకు ప్రాతినిధ్యం వహించే వర్గమేదీ లేకపోవడం వల్ల బ్రహ్మ పూజార్హత కోల్పోవలసి వచ్చింది. మొత్తం మీద ముగ్గురూ ముందుకొచ్చే సరికి మిగిలినవాళ్లంతా వెనుక స్థానాల్లో సర్దుకున్నారు. మానవ నాగరికతలో ఒక పనిముట్టో, ఒక వ్యవస్థో మానవ చేతన ననుసరించి వివిధ రూపాలను తీసుకున్నట్టు దేవుడు, మతభావనలు కూడా రకరకాల రూపాలు తీసుకుంటాయనే చారిత్రక దృక్కోణం నుంచి మతాన్ని పరిశీలిస్తే కనిపించే దృశ్యం ఇది.

ఎంత చర్చించినా ఇంకా చర్చించవలసిన అంశం దేవ–దానవ సంఘర్షణ. మతం దేవతలు, రాక్షసులు ఇద్దరూ మనుషులే కాదన్నట్టు, వారి మధ్య యుద్ధాలు ఏవో లోకాల్లో జరిగినట్టు మాట్లాడుతుంది. మతం దృష్టిలో మనుషుల కంటే దేవతలు ఉన్నతులు, రాక్షసులు అధములు. అయితే ఇద్దరూ మనుషులేననీ, ఇది ఆర్య, ద్రావిడ సంఘర్షణ అనీ అంటుంది చరిత్ర. పట్టుధోవతీలు కట్టుకుని, కంఠాభరణాలు, భుజకీర్తులు, కిరీటాలు ధరించి పసుపుపచ్చగా మిసమిసలాడుతూ కనిపించే దేవతల్నీ... మిడిగుడ్లతో, బండ పెదవులతో, బానపొట్టలతో జుగుప్స కలిగించే కరిమబ్బుల్లాంటి రాక్షసుల్నీ మన ఊహల్నించి చెరిపివేయగలిగితే ప్రాథమికంగా వరుసగా తెల్లగా, నల్లగా ఉండే ఆర్య, ద్రావిడ జాతులు ప్రత్యక్షమౌతాయి. దేవతలు చేసే యజ్ఞాది క్రతువులను రాక్షసులు విచ్ఛిన్నం చేసేవారనే ఉదంతాలకు, భిన్నమైన పూజా పద్ధతులు గల ప్రోటో ఆస్ట్రొలాయిడ్‌లు, ద్రావిడులు అనే స్థానిక జాతులు కొత్తగా దేశంలోకి ప్రవేశించి యజ్ఞం ఆరాధనా విధానంగా కలిగిన ఆర్య జాతిని ప్రతిఘటించాయనే సహేతుకమైన అర్థం చెబుతుంది చరిత్ర.

సంఘర్షణతో మొదలైనా సహజీవనం అనివార్యమై సమ్మేళనానికి దారితీసిన ఆర్య, ద్రావిడ సంస్కృతులకు ప్రతినిధి దేవతలు శివుడు, విష్ణువూ. ఇద్దరి మధ్యా జరిగిన ఆధిపత్య పోరాటం రెండు సంస్కృతుల మధ్య జరిగిన పోరాటమే. తమ గోవులకు పచ్చికబయళ్లను అన్వేషించుకుంటూ దేశంలోకి ప్రవేశించి, స్థానిక నాగజాతిని అణగదొక్కిన ఆర్యుల దేవుడు పాలకడలిలో శేషతల్పమున కాక ఎక్కడుంటాడు? ఆదివాసుల దేవుడైనందుకు శివుడు సృష్టి సాధనమైన లింగరూపంలో ఆరాధించబడి శ్మశానాలలో సంచరించే జంగమదేవరే కదా అవుతాడు! విజేత మతం– చరిత్ర రాస్తే దశావతారాలూ తమ దేవుడికే దక్కి, హాలాహలం మాత్రం ఓడినవాడి గొంతుకు అడ్డం పడుతుంది. భస్మాసుర కథైనా, మోహినీ వృత్తాంతమైనా సమస్య సృష్టించడం తెలివితక్కువవాడి వంతైతే పరిష్కరించడం మన వంతు. ఇది అటుంచితే, చరిత్ర ఈ ఇద్దరు దేవుళ్లనీ రెండు పరిణామ దశలుగానే చూస్తుంది. నడుము చుట్టూ జంతుచర్మమూ, మెడలో పాము, క్షణికావేశము, నిష్కపటత్వమూ, భోళాతనమూ నాగరిక పూర్వమానవుడి లక్షణాలు. ఇక వస్త్రధారణ మొదలు శంఖ చక్రాలు, మెడలో పూలమాల, కిరీటం, సమస్యని పరిష్కరించుకోగల తెలివితేటలు, చాకచక్యమూ అనంతరకాలపు మానవుడి లక్షణాలు. ఇవే ఇద్దరిలో ప్రతిఫలించాయంటుంది చరిత్ర.

ఉత్తమ లక్షణాలున్న మనుషులకు దైవత్వం ఆపాదించడం కోసం దేవుణ్ణి అవతారాలెత్తించడం మతం చేసే ఒక విన్యాసం. చారిత్రకవ్యక్తి కంటే పౌరాణికవ్యక్తికి అవతారపురుషుడు కాగలిగే వెసులుబాటు ఎక్కువ ఉంటుంది. ఈ పరిణామాన్ని మత చరిత్రలో భాగంగా చూస్తుంది చరిత్ర. మతం కృష్ణుణ్ణో, రాముణ్ణో విష్ణువు అవతారం చెయ్యడానికి చాలా శ్రమపడుతుంది. వాళ్ల చుట్టూ గాథలల్లుతుంది. ఇతిహాసాలు రచింపచేస్తుంది. సంకీర్తనలు రాసి గానం చేస్తుంది. కుదరకపోతే చివరకు 'అంతా నేనే, నువ్వు నిమిత్తమాత్రుడివి' అని ఆయన చేతే గీతాబోధ చేయిస్తుంది. పిల్లలతో ఆడుకుంటూ అన్నం తినడమే మరచిపోయిన బాలకృష్ణుణ్ణి రమ్మని పిలుస్తూ యశోద పాడే ఒక జానపదగీతంలో ఎన్ని రకాల ఆశలు చూపిస్తూ రమ్మని పాడినా కృష్ణుడు రాడు. అప్పుడు 'యదువంశ ధీరాయ, శ్రీమన్నారాయణ వాసుదేవ వేగ రావేరా' అంటుంది. అనగానే 'నారాయణ యంచు నవ్వుతు పిలచితే నాడే వత్తునింత సేపేలా' అని బదులిస్తాడు. నారాయణుడంటేనే పలుకుతాను అనడం మన చేత పలికించడం కోసమే. మహాభారతంలో అనేక సందర్భాలలో ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రౌపది మొదలైన పాత్రలు పదేపదే 'నువ్వే వాసుదేవుడివి, నువ్వే వాసుదేవుడివి' అని కృష్ణుణ్ణి అనడం మనచేత అంగీకరింపచెయ్యడానికే. పౌండ్రక వాసుదేవుడి ఉదంతం వాసుదేవుడి స్థానం కోసం మరి కొందరు ప్రయత్నించారని చెబుతుంది. అవతారాల పరిణామాన్ని సారస్వతంతోపాటు ఇతర ఆధారాలతో బేరీజు వేస్తుంది చరిత్ర. కృష్ణావతారాన్ని వైదిక మతం హిందూమతంగా మారే సంధిదశగా గుర్తించారు చరిత్రకారులు.

మతానికి ఇదేమీ పట్టదు. వేదాలను, శృతులను స్మృతులను, ఇతిహాసాలను, పురాణాలను, కలగూరగంపను చేస్తుంది. ఎప్పుడేది కావాలంటే దాన్ని పైకి తీస్తుంది. దేన్నైనా దేనిగానైనా మారుస్తుంది. ముందునూ వెనుకనూ, భూమినీ ఆకాశాన్నీ ఏకం చేస్తుంది. స్థలకాలాలూ హేతువు దానికి పూచిక పుల్లలు. ఊహలూ, కట్టుకథలు పట్టుకొమ్మలు.

■ కొప్పర్తి వెంకటరమణమూర్తి


పామర్రులో హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీడీపీ నేతలు



నేడు కృష్ణాకు చంద్రబాబు

పామర్రు, ఉయ్యూరులో బహిరంగ సభలు

- టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల విస్తృత ఏర్పాట్లు

మచిలీపట్నం/పామర్రు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నుంచి ఆయన హెలీకాప్టర్‌లో బయల్దేరి పామర్రు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద మధ్యాహ్నం 2.35 గంటలకు దిగుతారు. అనంతరం బస్సు ద్వారా నాలుగు రోడ్ల కూడలి వరకు రోడ్ షో నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు పామర్రు సెంటర్ సమీపంలో జరిగే ప్రజాగళం సభలో ప్రసంగిస్తారు. అలాగే, కూటమి నేతలకు దిశానిర్దేశం చేస్తారని సమాచారం. సాయంత్రం 4.40 గంటలకు పామర్రు నుంచి రోడ్డుమార్గం ద్వారా బయల్దేరి 5.45 గంటలకు ఉయ్యూరు మార్కెట్ సెంటరుకు చేరుకుంటారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు ఉయ్యూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటనకు వస్తుండటంతో పామర్రు, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులు వర్ల కుమార్‌రాజా, బోడె ప్రసాద్ పెద్దఎత్తున జనసమీకరణ చేస్తున్నారు. చంద్రబాబు సభలు విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ మండల, గ్రామస్థాయి నాయకుల సహకారంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులుగా ఆటోల్లో ప్రచారం చేస్తున్నారు.



నిండుకుండ

వేసవి ఇలా ప్రారంభమైందో లేదో అలా పేదవాడి ఫ్రిజ్ మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. ధర కాస్త ఎక్కువైనా కుండను కొని, చల్లటి నీరు తాగాలని చాలామంది తాపత్రయ పడుతుండటంతో నగర శివారు ప్రాంతాల్లో వీటి తయారీ శరవేగంగా జరుగుతోంది. ఏళ్ల తరబడి కుండల తయారీపై నిమగ్నమైన కుమ్మరులు వేసవిలో చేతినిండా పని ఉంటుందని, ఆడుతూ పాడుతూ అందంగా మట్టి కుండలను తయారుచేస్తామని చెబుతున్నారు.

నగర శివారు కొత్తూరు తాడేపల్లిలో అందంగా మట్టి కుండలు తయారుచేస్తున్న కుమ్మరులు వీరు.





విషాదం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వద్ద రోడ్డు ప్రమాదం

- చీమలపాడుకు చెందిన ముగ్గురు దుర్మరణం
- మృతుల్లో తల్లీ ఇద్దరు పిల్లలు
- తీవ్రంగా గాయపడిన తండ్రి
- పెళ్లి వేడుకకు వెళ్లి వస్తుండగా ఘటన

దమ్మపేట (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా), ఏప్రిల్ 6 : దమ్మపేట మండలం మందలపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో తల్లి చీమ లక్ష్మి (28), ఇద్దరు పిల్లలు శరణ్యశ్రీ (8), షణ్మిక (6) దుర్మరణం పాలయ్యారు. తండ్రి బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, క్షతగాత్రుడు చీమల బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన చీమల బాలకృష్ణ తన భార్య, కుమార్తెలతో కలిసి విస్సన్నపేట మండలం చంద్రుపట్లలో బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యాడు. ద్విచక్రవాహనంపై తిరిగి అశ్వారావుపేట వస్తుండగా, మందలపల్లి ప్రభు నర్సరీ సమీపంలో గుర్తుతెలియని కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం సహా నలుగురూ కిందపడిపోయారు. అదే సమయంలో సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపు వేగంగా వెళ్తున్న లారీ రోడ్డుపైన పడిపోయిన వారి పైనుంచి దూసుకెళ్లింది. దీంతో లక్ష్మి, శరణ్య, షణ్మిక అక్కడికక్కడే మృతిచెందారు. తండ్రి బాలకృష్ణ రోడ్డు పక్కన పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాలకృష్ణను 108 వాహనంలో దమ్మపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

15 నుంచి చేపల వేట నిషేధం

మచిలీపట్నం, ఏప్రిల్ 6 : వేసవిలో సముద్రంలో మత్స్య సంపద పెరిగే తరుణాన్నిదృష్టిలో ఉంచుకుని ఈ నెల 15 నుంచి చేపల వేటను నిషేధిస్తున్నట్లు జిల్లా మత్స్య శాఖాధికారి శివ సామ్రాజ్యం తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు వేట నిషేధ సమయం ఉంటుం దన్నారు. యాంత్రిక పడవలు, మెకనైజ్డ్ బోట్లు, మోటారు బోట్ల ద్వారా జరిగే చేపల వేటను నిషేధి స్తున్నట్టు తెలిపారు. సంతానోత్పత్తికాలంలో తల్లి చేపలు, రొయ్యలను రక్షించడం కోసం, సంతానోత్పత్తి పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ఈ నిషేధం విధిస్తున్నట్టు తెలిపారు. ఉత్తర్వులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తామ న్నారు. నిషేధం అమలయ్యేందుకు కోస్టుగార్డు, మత్స్యశాఖ, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, రెవెన్యూ అధికారులు గస్తీ తిరుగుతారని ఆమె చెప్పారు.



ఏపీటీడీసీలో మాయాజాలం

- 6లో..

- సెకండ్ హ్యాండ్ బోట్ల కొనుగోలు
- రూ.30 లక్షలకు పైగా అవినీతి



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) : 6-23 (ఆది)
సహర్ (ఉదయం) : 4-45 (సోమ)

అధికార పార్టీ అనే అహం.. అధికారం చేతిలో ఉందనే టెంపరితనం.. వైసీపీ పరువుతీసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. తమనెవరూ అడ్డుకోలేరన్న ఆలోచనతో తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా శనివారం ఏర్పాటుచేసిన బ్రాహ్మణ సామాజికవర్గ ఆత్మీయ సమావేశాన్ని మోడల్ కోడ్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు. సమావేశానికి హాజరై ఓట్లు రాబట్టే ప్రయత్నం చేయాలన్న ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కోన రఘుపతిని గేటు వద్దే అడ్డుకుని వెనక్కి పంపేశారు. అనుమతి లేని సమావేశానికి ఆహ్వానం ఎందుకని రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన బ్రాహ్మణులు భోజనం చేసి వెనుదిరిగారు.

ఆవేశం.. సమావేశం..!

అనుమతులు లేకుండా వైసీపీ బ్రాహ్మణ సమావేశం



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ప్రమణ్‌కుమార్



ఖాళీ అయిన కళాక్షేత్ర ప్రాంగణం



భోజనాలకు క్యూలో నిల్చున్న బ్రాహ్మణ సామాజికవర్గ నాయకులు, కార్యకర్తలు

- ఎన్నికల కోడ్ ఉండటంతో పోలీసుల అడ్డు
- బ్రాహ్మణ ఓట్లను రాబట్టే అధికార పార్టీ కుట్ర భగ్నం
- అనుమతులు లేకుండా కుదరదన్న పోలీసులు
- తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉద్రిక్తత
- మల్లాది విష్ణు, కోన రఘుపతి అడ్డగింపు
- నిర్వాహకుల తీరుపై బ్రాహ్మణుల ఆగ్రహం
- అనుమతి లేకుండా ఎందుకు పిలిచారని ఫైర్
- మధ్యాహ్న భోజనాల అనంతరం జంప్

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : ఎన్నికల్లో బ్రాహ్మణ సామాజికవర్గ ఓటర్లను ఆకర్షించేందుకు వైసీపీ పెద్దలు 15 రోజులుగా తెగ కసరత్తు చేశారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు దేవదాయ శాఖ సలహాదారు జె.శ్రీకాంత్, కౌతా చారిటబుల్ ట్రస్టుకు చెందిన కౌతా సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ కార్యక్రమాన్ని నిర్వహించాలని తలపెట్టారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అనుమతి తీసుకుని బ్రాహ్మణ సామాజికవర్గ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అన్ని జిల్లాల్లో అధికార పార్టీ మద్దతుదారులుగా ఉన్న బ్రాహ్మణ సామాజికవర్గాల వారిని ఆహ్వానించారు. ఫోన్ల ద్వారా, మెసేజ్‌ల ద్వారా కార్యక్రమానికి తప్పకుండా రావాలని, పలు కీలక నిర్ణయాలు ఉంటాయని, ఎన్నికల్లో బ్రాహ్మణుల ఓటింగ్ ముఖ్యమని చెబుతూ ఊదరగొట్టారు.

పోలీసుల అడ్డు.. వెనుదిరిగిన మల్లాది, కోన

తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం ఉదయం సమావేశానికి రంగం సిద్ధం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి బ్రాహ్మణ సామాజికవర్గ నాయకులు, కార్యకర్తలు, ఆహ్వానితులందరూ నగరానికి వచ్చారు. ముఖ్య అతిథులుగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు, బాపట్ల సిటింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతి, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ సిటింగ్ ఎంపీ కేశినేని నాని, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులను ఆహ్వానించారు. తొలుత శనివారం ఉదయమే మల్లాది విష్ణు, కోన రఘుపతి కళాక్షేత్రానికి వచ్చారు. అయితే, అప్పటికే అక్కడ మోహరించి ఉన్న మోడల్ కోడ్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ హెడ్ ప్రమణ్‌కుమార్, సిబ్బంది, గవర్నరుపేట పోలీస్ స్టేషన్ సీఐ డీవీ రమణ, ఆయన సిబ్బంది వారిద్దరినీ నిలువరించారు. అధికార పార్టీ వారు కావడంతో విష్ణు, రఘుపతి కొంచెం దూకుడుగా వ్యవహరించి వేదికపైకి వెళ్తామని, వచ్చిన వారికి సందేశమిస్తామన్నారు. కానీ, ఇటు పోలీసులు, మోడల్ కోడ్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ససేమిరా అన్నారు.

సమావేశానికి ఎటువంటి అనుమతులు లేవని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి పరిస్థితుల్లోనూ సమావేశానికి అనుమతించే వీల్లేదని చెప్పారు. కాదని వెళ్తే ఫొటోలు తీసుకుని తాము చేయాల్సింది చేస్తామని హెచ్చరించారు. దీంతో నాయకులు కాసేపటి తర్వాత వెనుదిరిగి వెళ్లిపోయారు. మరోపక్క వచ్చిన వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. అందరినీ వెళ్లిపోవాలని అధికారులు సూచించడంతో నిర్వాహకులు.. పెద్దఎత్తున భోజనాలు ఏర్పాటు చేసుకున్నామని, వృథా అయిపోతాయని, అనవసరంగా రోడ్డు మీద పడేయాల్సి వస్తుందని కోరడంతో అధికారులు అనుమతినిచ్చారు. భోజనాల వరకు త్వరగా ముగించి వెళ్లిపోవాలని ఆదేశించారు. భోజనాలు చేసిన అనంతరం మొత్తం కళాక్షేత్రాన్ని ఖాళీ చేయించేంత వరకు పోలీసులు, అధికారులు అక్కడే ఉండి సౌత్ ఏసీపీ రత్నంరాజు ఆధ్వర్యంలో హాలుకు తాళాలు వేసి వెనుదిరిగారు. సమావేశానికి వచ్చినవారు నిర్వాహకుల తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పదిరోజుల నుంచి మెసేజ్‌లు, ఫోన్లు చేసి సమావేశం ఉంటుందని పిలుస్తున్నవారు ముందుగా తగిన అనుమతులు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

సెంట్రల్‌లో చిచ్చు

సెంట్రల్ నియోజకవర్గంలో బ్రాహ్మణ సామాజికవర్గం ఎక్కువగా ఉంటుంది. ఇక్కడి నుంచి ప్రస్తుతం వెలంపల్లి శ్రీనివాసరావు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు ఏర్పాట్లు జరిగాయి. మరోవైపు సెంట్రల్ సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మల్లాది విష్ణు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందినవారే. గతంలో ఆయన బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా కూడా చేశారు. కానీ, ఆయనకు బ్రాహ్మణ ఆత్మీయ సదస్సు విషయాన్ని చివరి వరకు తెలియజేయలేదు. దీంతో ఆయన మనస్తాపానికి గురై కార్యక్రమానికి దూరంగా ఉండాలని భావించారు. మల్లాది అలకబూనిన విషయం తెలియడంతో వెలంపల్లి అప్రమత్తమయ్యారు. వెంటనే తాడేపల్లి పెద్దలకు సమాచారం చేరవేశారు. దీంతో సజ్జల జోక్యం చేసుకుని మల్లాదిని పిలిపించి మాట్లాడటంతో ఆయన శనివారం కార్యక్రమం వద్దకు వచ్చారు. మొత్తానికి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం జరగకపోయినా మల్లాది, వెలంపల్లి నడుమ ఉన్న దూరాన్ని బట్టబయలు చేసింది.

తిరుగుబాట..!

బదిలీపై వెళ్లిన ఇన్‌స్పెక్టర్లు తిరిగి రావడానికి తహతహ

- కమిషనరేట్‌లో మొదలైన ఆరాలు
- ఇక్కడున్న ఇన్‌స్పెక్టర్లకు వరుస ఫోన్లు



విజయవాడలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్‌కు కాకినాడలో పనిచేస్తున్న ఒక ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేశాడు. మీరు విజయవాడలోనే ఉంటారా? బదిలీపై వెళ్తారా? అని ప్రశ్నించాడు. దీనికి ఏం సమాధానం చెప్పాలో ఆ ఇన్‌స్పెక్టర్‌కు తెలియలేదు. ఉన్నట్టుండి కాకినాడ ఇన్‌స్పెక్టర్ ఇలా ఎందుకు అడుగుతున్నాడో అర్థం కాలేదు. ఎన్నికల కోడ్ ఎత్తేశాక ఆలోచిస్తానని సమాధానం చెప్పడంతో ఆ ఇన్‌స్పెక్టర్ ఫోన్ కట్ చేశాడు. కొద్దిరోజుల క్రితం ఓ ఇన్‌స్పెక్టర్‌కు ఎదురైన అనుభవమిది. అసలు ఎందుకిలా ఆరాలు తీస్తున్నారంటే..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న ఇన్‌స్పెక్టర్లను రేంజ్‌కు బదిలీ చేశారు. ఇలా వెళ్లిన వారిలో కొంతమందికి కాకినాడ జిల్లాలో, మరికొంతమందికి ఏలూరు జిల్లాలో, ఇంకొందరికి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. నోటిఫికేషన్ ఇంకా విడుదల కాలేదు. ప్రస్తుతం ప్రచారాలు మాత్రమే సాగుతున్నాయి. ఇంకా నామినేషన్లు పూర్తై, ఎన్నికల తతంగం ముగిసి, ఫలితాలు వెల్లడి కావడానికి సమయం ఉంది. రెండు నెలలు సమయం ఉండగానే ఎన్టీఆర్ కమిషనరేట్ నుంచి బదిలీపై వెళ్లిన ఇన్‌స్పెక్టర్లు ఇక్కడకు రావడానికి తహతహలాడుతున్నారు. రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని బెర్తులను ఖరారు చేసుకునే పనిలో ఉన్నారు.

మొదలైన ఆరాలు

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రేంజ్‌లోని అన్ని జిల్లాల్లోని పోలీస్‌స్టేషన్లలో కొత్త ముఖాలు వచ్చాయి. తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల నుంచి ఇన్‌స్పెక్టర్లు ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు వచ్చారు. ఇక్కడున్న ఇన్‌స్పెక్టర్లు అక్కడికి వెళ్లారు. ఇందులో ఒకే బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఇక్కడి నుంచి పొరుగు జిల్లాలకు వెళ్లిన ఇన్‌స్పెక్టర్లు ప్రస్తుతం ఇక్కడున్న ఇన్‌స్పెక్టర్లకు ఫోన్లు చేస్తున్నారు. ముందుగా క్షేమసమాచారాలు తెలుసుకుని, స్టేషన్ పరిస్థితులు ఎలా ఉన్నాయని అడుగుతున్నారు. తర్వాత కమిషనరేట్ పరిధిలోనే ఉంటారా, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక వెళ్లిపోతారా అని ఆరా తీస్తున్నారు. తిరిగి విజయవాడకు రావాలనుకుంటున్నామని, దానికి సంబంధించిన ఏర్పాట్లు చేసుకుంటున్నామని చెబుతున్నారు. తమ పిల్లలు విజయవాడలోనే చదువుకుంటున్నారని, అక్కడే సొంతింటిని సమకూర్చుకున్నామని వివరిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో బదిలీపై వచ్చిన తమకు ఈ ఆరాలు ఏమిటని ఇన్‌స్పెక్టర్లు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకుండా, గెలుపోటముల లెక్కలు తేలకుండానే పొరుగు జిల్లాల్లో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు బదిలీ కోసం ఆగలేకపోతున్నారు. తిరిగి కమిషనరేట్‌కు రావడానికి ఎదురు చూస్తున్నారు. ఈ అంశం ఇప్పుడు ఏలూరు రేంజ్‌లో చర్చనీయాంశమైంది.



వైసీపీ ప్రచార కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కళావతి, వలంటీర్ బ్రహ్మం (వృత్తంలో)

వైసీపీ ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్

ఎన్నికల అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 6 : అధికార యంత్రాంగం పదేపదే హెచ్చరిస్తున్నా, చర్యలు తీసుకుంటామని చెబుతున్నా గ్రామీణ ప్రాంతాల్లోని ఉద్యోగులు మాత్రం తమ వైఖరి వీడట్లేదు. తాజాగా జగ్గయ్యపేట రూరల్ మండలంలోని అన్నవరం గ్రామంలో శుక్రవారం రాత్రి స్థానిక వైసీపీ నేతల ఆధ్వర్యంలో జరిగిన 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ చారుగుండ్ల కళావతి, వలంటీర్ బ్రహ్మం పాల్గొన్నారు. పాల్గొనడమే కాదు.. సీఎం జగన్ ఫొటోతో కరపత్రాలు పట్టుకుని ప్రచారం చేశారు. వీరిపై అధికారులకు ఫిర్యాదు చేశామని గ్రామస్థులు తెలిపారు.

మరో రెండు నెలల్లో ప్రజాప్రభుత్వం

● విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, ఏప్రిల్ 6 : మరో రెండు నెలల్లో ప్రజాప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలందరూ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించబోతున్నారని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. కూటమి పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ అలియాస్ సుజనా చౌదరితో కలిసి శనివారం భవానీపురంలోని 40వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బ్యాంకు సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పి.వి చిన్నసుబ్బయ్య, ఇతర నాయకులు వారికి ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. దాసాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాంధీబొమ్మ రోడ్డు, కోళ్ల ఫారం రోడ్డు, తదితర ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని భరోసా ఇచ్చారు. శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజాదరణ చాలా బావుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో టీడీపీ-బీజేపీ-జనసేన అభ్యర్థులు గెలవబోతున్నారన్నారు. ముఖ్యంగా పశ్చి మ నియోజకవర్గంలో సుజనా చౌదరి భారీ మెజారిటీతో గెలుస్తారని చెప్పారు. తనపై కేశినేని నాని చేస్తున్న అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని సవాలు విసిరారు. విజయవాడ ఎంపీగా పదేళ్లు నాని ఉండడానికి కారణం సుజనాచౌదరి అన్నారు. కేశినేని నాని పశ్చిమ నియోజకవర్గంలో సీట్లు ఇప్పిస్తానని ఇద్దరు నాయకుల వద్ద డబ్బులు తీసుకున్నారని దీనిపై చర్చించడానికి రమ్మంటే సమాధానం చెప్పేందుకు ఇంతవరకు రాలేదన్నారు. కేశినేని నాని ఓ ఊసరవెల్లి, పెద్ద మీడియా పక్షి అని విమర్శించారు. సుజనా చౌదరి, చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లను విమర్శించే అర్హత కేశినేని నానికి లేదన్నారు. పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు పోతిన మహేష్ త్వరలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. సుజనా చౌదరి మాట్లాడుతూ తాను, కేశినేని శివనాథ్ కలిసి డబుల్ ఇంజన్ పద్దతిలో పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్రం సహాయంతో యువతకు మంచి భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఏడుకొండలు, ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పశ్చిమ నియోజకవర్గ బీజేపీ నాయకుడు గొలగాని రవికృష్ణ, టీడీపీ నాయకులు కామాదేవరాజ్, వేమూరి మల్లిఖార్జునరావు, వేమూరి రమేష్ చౌదరి రామానాయుడు, మాలకొండయ్య, 40వ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.


బ్యాంకు సెంటర్ వద్ద కేశినేని చిన్ని, సుజనా చౌదరిలను గజమాలతో సత్కరిస్తున్న 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పి.వి.చిన్నసుబ్బయ్య, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా


పంపుల చెరువును పరిశీలిస్తున్న గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము

గుడివాడలో తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే కొడాలి నానీయే బాధ్యుడు : వెనిగండ్ల

గుడివాడ : గుడివాడలో తాగునీటి కష్టాలకు ఎమ్మెల్యే కొడాలి నాని బాధ్యుడని, మూడేళ్ల క్రితం పాత చెరువుకు గండిపడితే కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ఆరోపించారు. శనివారం 25వ వార్డులోని పంపుల చెరువును మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులతో కలిసి వెనిగండ్ల పరిశీలించారు. రాము మాట్లాడుతూ, పాలకుల నిర్లక్ష్యం, అధికారులు బాధ్యతారాహిత్యం కారణంగా గుడివాడ ప్రజలకు తాగునీటి కష్టాలు వచ్చాయన్నారు. ఏ వార్డుకు వెళ్లినా మంచినీరు రావడం లేదని మహిళలు వాపోతున్నారన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తే పాలకుల నిర్లక్ష్యం స్పష్టమైందన్నారు. మూడేళ్ల క్రితం పాత చెరువుకు గండిపడితే పూడ్చకుండా నిర్లక్ష్యం చేయడంతో 36 ఎకరాల చెరువు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. రిజర్వాయర్లు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు అందుబాటులో ఉన్నా తాగునీరు ఇవ్వడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారన్నారు. తాము అధికారంలోకి రాగానే పాత చెరువు గండిని పూడ్చి అందుబాటులోకి తీసుకువస్తామని వెనిగండ్ల హామీ ఇచ్చారు.


జనసైనికుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి బుద్ధప్రసాద్

అవనిగడ్డలో జనసేన జెండా ఎగరేద్దాం

● జనసైనికులతో ముఖాముఖిలో మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఏప్రిల్ 6 : రాష్ట్రంలో అరాచక వైసీపీ పాలనను అంతమొందించేందుకు అందరూ కలిసిరావాలని, ఐక్యంగా పని చేసి అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన జెండాను ఎగురవేద్దామని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ జనసేన నేతలను కోరారు. జనసేన పార్టీలో చేరి అభ్యర్థిత్వం ఖరారు అయిన తర్వాత తొలిసారిగా ఆయన నియోజకవర్గానికి చెందిన జనసైనికులతో శనివారం నేరుగా మాట్లాడారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గుడివాక శేషుబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, జనసేన, టీడీపీ, బీజేపీ కలసి కూటమిగా ఏర్పడి వైసీపీ అరాచకరాలను అణగదొక్కేందుకు కృషి చేస్తున్నాయన్నారు. పవన్ కల్యాణ్ కోరిక మేరకు తాను జనసేన పార్టీలో చేరి పోటీ చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. మూడేళ్లుగా జనసేన, తెలుగుదేశం పార్టీలు ఉమ్మడిగా చేపట్టిన ప్రజా పోరాటాల గురించి బుద్ధప్రసాద్ వివరించి ఇకపైన ఇదే స్ఫూర్తితో పోరాడాలని సూచించారు. రానున్న 36 రోజుల కాలం జనసేన పార్టీకి కీలకమని, కృష్ణాజిల్లాలో జనసేన పార్టీ పోటీ చేస్తున్న ఏకైక అవనిగడ్డలో విజయ దుందుభి మోగించేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వారికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని బుద్ధప్రసాద్ తెలిపారు.


పెదముత్తేవిలో కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

తొలగిన వలంటీర్ల ముసుగు

● జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా రాజీనామాలు

కూచిపూడి, ఏప్రిల్ 6 : వలంటీర్ల ముసుగులు తొలగిపోయాయి. జగన్మోహన్‌రెడ్డికి మద్దతునిస్తున్నట్లు బాహాటంగానే తేల్చి చెప్పారు. తాజాగా పెద్దముత్తేవిలో శనివారం 21 మంది వలంటీర్లు సచివాలయ కార్యదర్శి నరసింహారావుకు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. కాజకు చెందిన మరో 30 మంది రాజీనామా ప్రతాలు అందించేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లగా, ఆయన అందుబాటులో లేరు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నామని, పామర్రు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్ కుమార్ విజయానికి కృషి చేస్తామని వలంటీర్లు తమ రాజీనామా లేఖలో పేర్కొన్నారు.


కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

ఎన్టీఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘాల కార్యవర్గ ప్రమాణ స్వీకారం నేడు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 6 : విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సీఏ గడ్డం సత్యనారాయణ తెలిపారు. కస్తూరిబాయిపేటలోని సంఘ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొగల్‌రాజ్‌పురంలోని అమ్మ కళ్యాణ మంటపంలో ఉదయం 10 గంటలకు విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, మహిళా విభాగం, యువజన విభాగం, సేవాదళ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరుగు తాయన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ పార్లమెంటు సభ్యుడు టిజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. సంఘం అర్బన్ జిల్లా అధ్యక్షునిగా సీఏ గడ్డం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కునుమంచి వెంకటలక్ష్మీ గణేష్, కోశాధికారిగా సోము రమేష్, ఇతర కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. యువజన సంఘం అధ్యక్షుడిగా కనిగళ్ల అరుణ్‌సంపత్, కార్యదర్శిగా చీమకుర్తి శంకర్, కోశాధికారిగా చల్లా చైతన్య, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మారం రోజారాణి, ప్రధాన కార్యదర్శిగా దేసు రాజ్యలక్ష్మి కోశాధికారిగా గర్రె ధనలక్ష్మీ ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు పెనుగొండ సుబ్బారాయుడు, తుమ్మలపెంట శ్రీనివాసులు, వి.వి.కె నరసింహారావు, మారం రోజారాణి, దేసు, రాజ్యలక్ష్మీ, బొగ్గవరపు వెంకట సత్యనారాయణ, సింహాద్రి గోపి, కోన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

12 ఎకరాల సుబాబుల్ బుగ్గి

● రూ.22 లక్షల మేర నష్టం

వీరులపాడు, ఏప్రిల్ 6 : నరసింహారావుపాలెంలో ఓ రైతు చెరుకు తోటకు నిప్పు పెట్టి వెళ్లిపోవడంతో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సుమారు 12 ఎకరాల సుబాబుల్ తోట అగ్నికి ఆహుతయ్యింది. సుమారు రూ.22 లక్షల సుబాబుల్ కర్ర మొత్తం కాలిపోయిందని ఏడుగురు రైతులు లబోదిబో మంటున్నారు. సకాలంలో ఫైర్ ఇంజన్ రాకపోవడంతో నరుకుడు వచ్చిన కర్ర మొత్తం కాలిపోయిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

దేవదాయ శాఖ ఆస్తులను పరిరక్షించాలి

● రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 6: దేవదాయ భూములను, శాఖ ఇతర ఆస్తులను మన సొంత ఆస్తులను కాపాడుకునే రీతిలో ప్రతీ ఈవో పరిరక్షించాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని మాధవ కల్యాణమండప ఆవరణలో శనివారం కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు, కాకినాడ డివిజన్‌లోని 6(ఏ)(బి)(సి)(ఇ) ఆలయాల్లో, ధర్మసత్రాలలో పనిచేసే ఈవోలు, మేనేజర్లు, డివిజినల్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీర్లకు ఆయన దేవాలయ భూములు, ఇతర ఆస్తుల పరిరక్షణ, రీసర్వేపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో భూముల రీసర్వే, ఆడిట్, గడచిన మూడేళ్లలో ఆలయానికి వచ్చిన ఆదాయం, ఖర్చులు ఇతర అంశాలపై చర్చించారు. అయా దేవాలయాల్లో ఏ ఆగమ సంస్కృతి, సంప్రదాయాలు నడుస్తున్నాయి, ఆలయ ధర్మకర్తల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ ఆలయాలకు ఆదాయం చేకూర్చే అంశాలు, భూముల వివరాలు, వాజ్యాలు, భూసేకరణ, ఆభరణాలు, బంగారం ఇతర వస్తువుల భద్రతపై చర్చించారు. ఏ అధికారి అలసత్వం వహించవద్దని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవదాయశాఖ ఏడీసీ రామచంద్రమోహన్, జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్, ఈవో వేండ్ర త్రినాథరావు, డీసీ విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ


గొల్లపూడిలోని కార్యాలయంలో నియోజకవర్గంలోని బీసీ నేతలతో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్

కూటమి విజయంలో బీసీలదే కీలకపాత్ర

● మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్

జి.కొండూరు / గొల్లపూడి, ఏప్రిల్ 6 : బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్‌కే దక్కుతుందని, ఆదే స్ఫూర్తిని చంద్రబాబు కొనసాగిస్తున్నారని బీసీలంతా టీడీపీకి వెన్నుదన్నుగా ఉండి కూటమి విజయంలో కీలక భూమిక పోషించాలని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. గొల్లపూడి పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నియోజకవర్గంలోని బీసీ నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కులాల మధ్య కుంపటి పెడుతూ బీసీలను విచ్ఛిన్నం చేసేందుకు వైసీపీ కుట్ర పన్నిందన్నారు. వైసీపీ కుట్రలను సమర్థంగా ఎదుర్కొంటూ బీసీలంతా ఐక్యంగా ఉండాలన్నారు. చెన్నుబోయిన చిట్టిబాబు, ఉయ్యూరు వెంకట నరసింహారావు, పజ్జూరు రవికుమార్, పటాపంచల నరసింహారావు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, నక్కనబోయిన తిరుపతి రావు (ఎన్టీఆర్), పీతా శ్రీనివాస రాజు, మందా నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తప్పుడు ప్రచారాన్ని ఐటీడీపీ తిప్పికొట్టాలి

వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఐటీడీపీ సమర్థవంతంగా తిప్పి కొట్టాలని వసంత సూచించారు. ఐటీడీపీ నాయకులు చిరుమామిళ్ల కృష్ణ, పరసా కిరణ్ ఆధ్వర్యంలో ఐటీడీపీతో వసంత సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియాలో చేసే ప్రచారం పార్టీ విజయానికి దోహదపడేలా సభ్యులు కృషి చేయాలన్నారు. చంద్రబాబును సీఎం చేసుకునేందుకు సైనికుల్లా పని చేయాలన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన చేసేందుకు యువనేత నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారిస్తారన్నారు.


చెక్‌పోస్టును పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్ శివరాం ప్రసాద్



వాహనాలన్నింటినీ సర్వీసు రోడ్డు ద్వారా వదలడంతో స్తంభించిన ట్రాఫిక్

పకడ్బందీగా వాహనాలు తనిఖీ చేయాలి

● అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

● రవాణా శాఖ జాయింట్ కమిషనర్ శివరాం ప్రసాద్

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 6 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని రవాణా శాఖ జాయింట్ కమిషనర్ శివరాం ప్రసాద్ సూచించారు. గరికపాడులోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును శనివారం ఆయన సందర్శించారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాలిల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తనిఖీలు, వసతులు, తదితర అంశాలపై సూచనలు, సలహాలు అందజేశారు. అన్ని శాఖల అధికారులు సమ్వయంతో పని చేసి నగదు, బంగారం, వెండి, మద్యంతో పాటు పంపిణీ కోసం పెద్ద ఎత్తున తరలించే వస్తువులను గుర్తించాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులను బాధ్యతాయుతంగా నిర్వహిచాలన్నారు. ఏఎంవి కెఎల్ బాలు, ఏఎస్సై హనుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలతో స్తంభిస్తున్న ట్రాఫిక్

ప్రధాన జాతీయ రహదారిని మూసి అన్ని వాహనాలను తనిఖీ నిమిత్తం సర్వీస్ రోడ్డులోకి మళ్లించడంతో కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. చిన్న, భారీ వాహనాలు ఒకే మార్గంలో రావటంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. భారీ వాహనాలు ప్రధాన రహదారి గుండా వెళ్లేలా చూడాలని, చిన్న వాహనాలను సర్వీస్ రోడ్డు గుండా తనిఖీ చేసి పంపించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గలంలో ఐదారు చోట్ల చెక్‌పోస్టుల్లో తనిఖీలు చేయటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తనిఖీలు పారదర్శకంగా నిర్వహించేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం

ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్

తిరువూరు, ఏప్రిల్ 6: రాష్ట్రంలో సీఎం జగన్మోహనరెడ్డి పాలనలో సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. సీపీఐ కార్యాలయం సుంకర వీరభద్రరావు భవనంలో శనివారం నియోజకవర్గ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాది ఎకరాలు బీడు భూములుగా మారే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దాదాపు 53.5 టీఎంసీల వరదనీటి నిలువ సామర్థ్యం కలిగి, 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో అశ్రద్ధ వల్ల పశ్చిమగోదావరి జిల్లాలో 15 మండలాలు, కృష్ణాజిల్లాలో 18 మండలాల్లోని సాగుభూములు బీడు భూములుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మైలవరం, గన్నవరం, నూజివీడు, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, వీరుల్లపాడు, గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, ఆగిరిపల్లి, విజయవాడ ప్రాంతాలు సాగు, తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజల భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలంటే సైకో ప్రభుత్వాన్ని గద్దెదింపాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు తూము కృష్ణయ్య, ఉదయ్, చిలుకూరి వెంకటేశ్వరరావు, నాగులు మీరా, నృహింహాద్రి వనమాలి పాల్గొన్నారు.

ఏపీటీడీసీలో మాయాజాలం

● సెకండ్ హ్యాండ్ బోట్ల కొనుగోలు ● రూ.30 లక్షలకు పైగా అవినీతి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఏపీటీడీసీ సెకండ్ హ్యాండ్ బోట్ల కొనుగోలు వ్యవహారాన్ని అత్యంత రహస్యంగా ఉంచటంపై అనుమానాలు నెలకొన్నాయి. పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ప్రభుత్వ రంగ సంస్థ అయి ఉండి కూడా గుజరాత్ నుంచి సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేయటం చర్చనీయాంశమైంది. సెకండ్ హ్యాండ్ బోట్ల కొనుగోలు పేరుతో భారీ ఎత్తున కొందరు అధికారులు అవినీతికి పాల్పడ్డారని విమర్శలు వచ్చా యి.ఉన్నతాధికారులు మాత్రం గుట్టు చప్పుడు కాకుండా కొన్న సెకండ్ హ్యాండ్ బోట్లకు డబ్బులు చెల్లించేశారని తెలుస్తోంది.

గుజరాత్‌లో వాడేసి మూలన పెట్టిన మూడు మీడియం బోట్లను, రెండు సీ లైఫ్ బోట్లను కొనుగోలు చేశారు. వాటర్ స్పోర్ట్స్‌లో ఉపయోగించి పక్కన పెట్టిన బోట్లను ఏపీటీడీసీ అధికారులు కొనుగోలు చేశారు. ఒక్కో బోటు రూ. 9.50 లక్షలకు కొనుగోలు చేశారు. మూడు బోట్లను రూ. 30 లక్షల మేర వ్యయంతో కొనుగోలు చేశారు. ఓడలకు పక్కన కట్టి ఉంచే సీ లైఫ్ బోట్లను రెండింటిని కూడా తీసివేయగా వాటిని కొన్నారు. ఒక్కో బోటును రూ.1.70 లక్షల చొప్పున రూ. 3.40 లక్షలకు కొన్నారు. ఈ బోట్లను గుజరాత్ నుంచి విజయవాడకు తీసుకురావటానికి కూడా లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. ఇక్కడికి వచ్చాక పాత బోట్లు కావటంతో అంతా సోరెళ్లబెట్టారు. ఏ ప్రభుత్వం అయినా నాణ్యంగా ఉండే, దృఢమైన కొత్త బోట్లకు ప్రాధాన్యత ఇస్తుంది. అలాంటిది ఏపీటీడీసీ అధికారులు సెకండ్ హ్యాండ్ బోట్లను కొనుగోలు చేయటమే దారుణం. ఈ వ్యవహారం మాటున భారీగా డీల్ జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. విజయవాడ వచ్చిన తర్వాత ఈ బోట్లకు పెయింటింగ్, ఇతర ఫినిషింగ్ పనులు చేపట్టారు. ఈ పేరుతో కూడా అదనంగా ఖర్చు చేశారు. జీఎస్టీ లేకుండా కొనటం అనేది అసాధ్యం. సెకండ్ హ్యాండ్ బోట్లకు జీఎస్టీ బిల్లులు ఎలా తెచ్చారన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది. జీఎస్టీ బిల్లులు పెట్టారా ? పెడితే దొంగ బిల్లులు పెట్టారా ? అన్నది పరిశీలించాల్సిన విషయం. ప్రత్యక్షంగా కంపెనీల దగ్గర కొన్న బోట్లు కాదు కనుక జీఎస్టీ బిల్లులు ఏ విధంగా చూపారన్న దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సెకండ్ హ్యాండ్ బోట్లను ఎక్కువ రేటు పెట్టి కొన్నారని, వాస్తవానికి ఇంతకంటే సగం ధరకే దక్షిణాది రాష్ట్రాలలో దొరుకుతాయని తెలుస్తోంది. తక్కువ రేటుకు వచ్చే అవకాశం ఉన్నా, గుజరాత్ ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో ఎవరికీ అంతుచిక్కని రహస్యం. భవానీ ద్వీపంలో తిష్టవేసిన సంబంధిత బోటింగ్ విభాగ అధికారి కనుసన్నలలోనే వీటిని కొనుగోలు చేయటం జరిగింది. గతంలో ఈ అధికారి ఏపీటీడీసీలో పని చేసినపుడు ఎల్‌టీసీ కుంభకోణంలో విధుల నుంచి తొలగింపునకు గురయ్యారు. ఇప్పుడు అదే అధికారిని ఏపీటీడీసీ ఎండీ బోటింగ్ విభాగాధిపతిగా నియమించారు. సెకండ్ హ్యాండ్ బోట్ల కొనుగోలు విషయంలో ఈ అధికారి అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బిల్లు చెల్లింపులు నిలిపివేసి విచారణ జరిపించాల్సిన ఉన్నతాధికారులు, గుట్టుగా బిల్లు చెల్లింపులు చేయటం వెనుక ఉన్నతాధికారుల హస్తం కూడా ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ విభాగం ఏపీటీడీసీలో జరిగిన ఈ కొనుగోళ్ళపై సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గుజరాత్ నుంచి కొనుగోలు చేసిన సెకండ్ హ్యాండ్ బోట్లు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 155, 164, 175
చికెన్ విత్ స్కిన్ 300
చికెన్ స్కిన్‌లెస్ 310
నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

ఉగాది పంచాంగ శ్రవణానికి రండి

● సుజనా చౌదరికి ఆహ్వానం

వన్‌టౌన్, ఏప్రిల్ 6: భవానీపురం ఎస్ కన్వెన్షన్ హాలులో ఈ నెల 9న నిర్వహిస్తున్న క్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమానికి రావాలని పశ్చిమ నియోజకవర్గ కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిని విజయవాడ బ్రాహ్మణ సంఘం నేత ముష్టి శ్రీనివాస్ ఆహ్వానించారు. శనివారం సుజనాచౌదరి భవానీపురం బ్యాంకు సెంటర్‌లో ప్రచార కార్యక్రమంలో ఉండగా శ్రీనివాస్ ఆయనను కలిశారు. ఆహ్వానపత్రికను అందజేసి తప్పనిసరిగా రావాలని కోరారు.





ఆకట్టుకున్న భజన గీతాలు

వన్‌టౌన్, ఏప్రిల్ 6: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ధర్మపథం వేదికపై శనివారం సంతాన వేణుగోపాల భజన మండలి నిర్వాహకురాలు పి.ఉదయశ్రీ గీత ఆధ్వర్యంలోని బృందం భజనగీతాలను ఆలపించారు. దుర్గమ్మపై భక్తిరసంతో కూడిన భజన గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. 16 మంది బృందం గీతాలను ఆలపించారు.

రాష్ట్రంలో మద్యం మరణాలే అధికం

ప్రభుత్వంపై గద్దె అనురాధ ఫైర్

మొగల్రాజపురం, ఏప్రిల్ 6: రాష్ట్రంలో కరోనా మరణాల కంటే మద్యం మరణాలే అధికం అని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. శనివారం సాయంత్రం మొగల్రాజపురం ఏడో డివిజన్‌లో ఎస్‌బీఐ బ్యాంకు ఏరియాలో జనసేన, బీజేపీ బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె అనురాధ, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)లను సైకిల్ గుర్తు మీద ఓటేసి గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న మద్యం మరణాలు, ఇసుక దోపిడి, విచ్చలవిడిగా యువతను గంజాయికి బానిసలు చేస్తున్న అంశాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే గంజాయి, డ్రగ్స్‌ను రూపు మాపుతామని చెప్పారు. గుమ్మడి గురుప్రసాద్, పటమట సతీష్ చంద్ర, దోమకొండ అశోక్, జ్యోతి, ఎం.మల్లికార్జునరావు, కోట శివలక్ష్మి, నాగుమోతు రాజా, అన్నే రాయలు, శ్రీను, కర్రి రాజేష్ పాల్గొన్నారు.

ప్రశాంతినగర్‌లో ...

భారతీనగర్: తూర్పు పరిధి 4వ డివిజన్‌లోని ప్రశాంతినగర్‌లో గద్దె అనురాధ శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీజేపీ, జనసేన బలపరిచిన తూర్పు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తు పై ఓటు వేసి గెలిపించాల్సిందిగా ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ: తెలుగు దేశం పార్టీ అంటేనే అభివృద్ధికి చిరునామా అని అన్నారు. మేమంతా గద్దె రామ్మోహన్‌కు మద్దతుగా ఉంటామని ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి చెబుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి గద్దె రామ్మోహన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గద్దె అనురాధ కోరారు. స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, రత్నం రమేష్, సలిమిశెట్టి రాజామణి, కొలసాని నాగమణి, చలసాని రోజా తదితరులు పాల్గొన్నారు.



ఏడో డివిజన్ ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ

హామీలు విస్మరించిన జగన్

లబ్బీపేట: పేదల సంక్షేమానికి కృషి చేస్తానంటూ హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదల గురించి అస్సలు పట్టించుకోలేదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కుమారుడు గద్దె క్రాంతి అన్నారు. 19వ డివిజన్ పరిధిలోని నందమూరి రోడ్డులో శనివారం గద్దె క్రాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన, బీజేపీలు బలపరిచిన టీడీపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

గుణదల: చంద్రబాబు అధికారంలోకి రాగానే మొదటి సంతకం మెగా డీఎస్సీపైనే పెట్టనున్నట్లు టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతి కుమార్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రెండవ డివిజన్ పరిధిలోని కార్మికనగర్ అనుపబ్లిక్ స్కూల్ ఏరియాలో శనివారం ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. తూర్పు ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. దాసరి గాబ్రియేలు, నుగసాని కృష్ణ ప్రసాద్, దేవరపల్లి శ్రీహరి, కోయా శివ, వెల్లంకి సుధాకర్, నాళం నరేంద్ర, వి.రత్నశ్రీ, లింగం నాగలక్ష్మి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కునుకు రాజశేఖర్

విద్యాధరపురం, ఏప్రిల్ 6: మాజీ కార్పొరేటర్ కునుకు రాజశేఖర్ శుక్రవారం బీజేపీలో చేరారు. పశ్చిమ కూటమి బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి రాజశేఖర్‌ను కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అధిష్టానం సూచనల మేరకు పార్టీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.



ఇఫ్తార్ విందులో గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్

టీడీపీ అధికారంలోకి రాగానే హజ్‌హౌస్ నిర్మిస్తాం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్

పటమట, ఏప్రిల్ 6 : పవిత్రమైన రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు చేస్తూ, అల్లాను భక్తితో ప్రార్థిస్తూ, ఎంతో మందికి ఇఫ్తార్ విందులు ఇస్తూ ముస్లిం సోదరులు ఆదర్శప్రాయంగా ఉంటారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్‌లు తెలిపారు. అశోక్‌నగర్‌లో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద తూర్పు మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్ నేతృత్వంలో నిర్వహించిన ఇఫ్తార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు పాల్గొని వారితో ముచ్చటించారు. 1500 మందికి ఇఫ్తార్ విందు ఇవ్వడం ఆనందదాయకమని, టీడీపీ అధికారంలోకి రాగానే హజ్‌హౌస్ నిర్మించి తీరుతామన్నారు. రంజాన్ తోఫా ఇచ్చి తీరతామన్నారు. కార్పొరేటర్ పొట్లూరి సాయి బాబు, అబ్దుల్ ఖాలీక్, సిరాజ్, ఫిరోజ్, బుజ్జి, అజీమ్‌లు పాల్గొన్నారు.



చిన్నారి వైద్యానికి దీవెన ఆర్థిక సహాయం

విజయవాడ, ఏప్రిల్ 6 (ఆంధ్ర జ్యోతి) : బ్లడ్ కేన్సర్‌తో బాధపడు తున్న ఆరేళ్ల చిన్నారికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సహాయం చేసింది. రామలింగేశ్వరనగర్‌కు చెందిన జాజుల నాగకృష్ణ ఫొటోగ్రాఫర్. ఆయన ఆరేళ్ల కుమార్తె కొంతకాలంగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న దీవెన ఫౌండేషన్ ప్రతినిధులు పటమట ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, కానిస్టేబుల్ నాగరాజు ఆయనకు రూ.15వేల చెక్కును అందజేశారు. పాపకు కీమో థెరపీ చేయించడానికి ఈ సాయం చేశారు.

22వ డివిజన్‌లో కేశినేని శ్రీదేవి ఎన్నికల ప్రచారం

కృష్ణలంక, ఏప్రిల్ 6 : ప్రభుత్వం అంటే సంక్షేమంతో పాటు సంపద సృష్టించి అన్ని రంగాల అభివృద్ధికి బాటలు వేయాలని, జగన్ ఈ విషయంలో పూర్తి విఫలం చెందాడని కేశినేని శ్రీదేవి అన్నారు. కృష్ణలంక 22వ డివిజన్‌లో శనివారం గంగానమ్మగుడి నుంచి జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ పార్లమెంటరీ అభ్యర్థి కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ల విజయాన్ని కాంక్షిస్తూ ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంచి, అధికా రంలోకి రాగానే చంద్రబాబు అందించబోయే పథకాలు వివరించి చెప్పారు. టీడీపీ నాయకుడు పలిశెట్టి అన్నారావు, జనసేన నాయకుడు తోట శ్రీను, మాజీ కార్పొరేటర్ చందన సురేష్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, ఆడిపాటి నర్సి, టి.మల్లి, ఎ.భవానీ, చింతాడ శారద పాల్గొన్నారు.



కరపత్రాలను అందిస్తున్న కేశినేని శ్రీదేవి

ధరలను అదుపుచేసేది కమ్యూనిస్టులే

● సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కోటేశ్వరరావు

పాతరాజేశ్వరీపేట, ఏప్రిల్ 6: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను అదుపుచేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు అన్నారు. శనివారం కాంగ్రెస్, సీపీఎం బలపరిచిన సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు 34వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోదీ మతోన్మాదంతో హిందూ, ముస్లిం, క్రైస్తవుల ఐక్యతకు భంగం వాటిల్లే విధంగా పాలనా నిర్ణయాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తనను ఆదరించాలని స్థానికులను కోరారు. ప్రచార పాదయాత్ర లోటస్ వద్ద ప్రారంభమై కేదారేశ్వరపేట, ఖుద్దూస్ నగర్‌మీదుగా ఎర్రకట్ట మసీదు వద్ద ముగించారు. నక్క వీరభద్రరావు, కె.వి.భాస్కరరావు, కొట్టు రమణారావు, బుట్టి రాయప్ప, మూలి సాంబశివరావు, కె.ఆర్.ఆంజనేయులు, పంచదార్ల దుర్గాంబ, ఓర్సు భారతి, డి.సీతారావమ్మ, లంక గోవిందరాజులు, అయ్యప్ప, కాళ్ల చిన్నప్ప, సాయి, యువజన విద్యార్థి, మహిళ సంఘనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఉద్యోగావకాశాలు

వన్‌టౌన్, ఏప్రిల్ 6: హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో మంచి ఉద్యోగావకాశాలున్నాయని హైదరాబాద్ జెడ్‌ఎఫ్ టెక్నాలజీస్ అధినేత డాక్టర్ సోమలక్ష్మి వెంకట శ్రావణకుమార్ అన్నారు. వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లిఖార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కాలేజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈఈఈ విభాగంలో చదువుకునే విద్యార్థులకు రానున్న రోజుల్లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో లభించే ఉద్యోగావకాశాలపై ఆయన సోదాహరణ ప్రసంగం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మీనారాయణ, ఈఈఈ విభాగాధిపతి బాలకృష్ణలు సెమినార్ ముఖ్య ఉద్దేశ్యాన్ని తెలియజేస్తూ విద్యార్థులలో ఉన్న జిజ్ఞాసను మెరుగుపరుచుకోవాలని, మేధస్సుకు పదును పెట్టుకోవాలని, సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. సమాజానికి, పరిసరాలకు ఉపయోగపడేలా విద్యార్థులు తమలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కోరారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ సోమలక్ష్మి వెంకట శ్రావణకుమార్

ఎమ్మెల్యే సీటుకు పోతిన మహేశ్ అన్ని విధాలా అర్హుడు

జనసేన అభిమానులు, కార్యకర్తలు

వన్‌టౌన్, ఏప్రిల్ 6: పోతిన మహేశ్ ఎమ్మెల్యే సీటు పొందడానికి అన్నివిధాలా అర్హుడని జనసేన అభిమానులు, కార్యకర్తలు పేర్కొన్నారు. పశ్చిమ జనసేన కార్యాలయంలో శనివారం భవిష్యత్తు కార్యాచరణపై అభిప్రాయాలు తెలుసుకునేందుకు జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేశ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు నామినేషన్‌లకు ఇంకా సమయం ఉంది గనుక పశ్చిమ సీటును పోతిన మహేశ్‌కే కేటాయించాలని ఏకకంఠంతో చెప్పారు. పోతిన మహేశ్‌కు రాజకీయ భవిష్యత్తుతో పాటు క్యాడర్ భవిష్యత్తును కూడా పార్టీ బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పోతిన మహేశ్ అందరి అభిప్రాయాలను స్వీకరించారు.

నాదెండ్లను కలిసిన తిరుపతి సురేష్ దంపతులు

42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష, విజయవాడ అర్బన్ జనసేన ప్రచార కమిటీ సమన్వయకర్త తిరుపతి సురేష్‌లు శనివారం జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తెనాలిలోని మనోహర్ కార్యాలయానికి వెళ్లి ఆయనకు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

యువకుడిపై దాడికి పాల్పడ్డ ఇద్దరు అరెస్టు

గుణదల, ఏప్రిల్ 6: బైక్ కొంచెం రోడ్డుకు పక్కగా పెట్టుకోండి అని చెప్పిన పాపానికి ఇరువురు యువకులు ఏకంగా సదరు యువకుడిని చితకబాదిన ఘటన బెంజిసర్కిల్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. యువకుడిపై దాడికి తెగబడ్డ ఇరువురు యువకులను శనివారం అరెస్టు చేసినట్లు మాచవరం సీఐ గుణరామ్ తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్‌కు చెందిన సాయి కుమార్ బెంజిసర్కిల్ వైపు నుంచి మోటారు బైక్‌పై వెళుతున్నాడు. కృష్ణలంకకు చెందిన అడపాల నాగేంద్ర, కంకిపాడుకు చెందిన దేవరపల్లి విజయకుమార్‌లు ఒకే బైక్‌పై వెళుతూ గొడవపడుతున్నారు. బెంజిసర్కిల్ సిగ్నల్ సమీపంలో గొడవపడుతున్న వీరిని బైక్ పక్కకు పెట్టి గొడవపడండి అని సాయి కుమార్ సౌమ్యంగా చెప్పడంతో నువ్వెవడివిరా మాకు చెప్పడానికి అంటూ ఇరువురు యువకలు సాయిపై విరుచుకుపడ్డారు.

సమాచారం అందుకున్న మాచవరం సీఐ గుణరామ్ ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. సాయి ఫిర్యాదు మేరకు నాగేంద్ర, విజయకుమార్‌లను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

ప్రజల్లో నమ్మకం కోల్పోయిన జగన్‌రెడ్డి

● బొండా సుజాత

గుణదల, ఏప్రిల్ 6: ప్రజల్లో జగన్ రెడ్డి నమ్మకం కోల్పోయారని సెంట్రల్ టీడీపీ అభ్యర్థి బొండా ఉమా సతీమణి బొండా సుజాత అన్నారు. స్థానిక 26వ డివిజన్ పరిధిలోని మలేరియా కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు వంతెన వరకు కాల్వకట్టపై శనివారం ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా సుజాత మాట్లాడుతూ టీడీపీకి 2024లో బ్రహ్మరథం పట్టేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సెంట్రల్‌లో బొండా ఉమాను, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌లను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి, మాజీ కార్పొరేటర్ కంచర్ల శేషారాణి, డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, కారంపూడి సత్య కడియం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం

వన్‌టౌన్, ఏప్రిల్ 6: బస్టాండ్ సమీపంలోని కృష్ణలంక జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంకు వద్ద ఉన్న కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం గుర్తించారు. కృష్ణలంక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడికి సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని పోలీసులు తెలిపారు.


నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పాయకాపురం, ఏప్రిల్ 6: పాయకాపురం సబ్‌స్టేషన్ ఏరియా 11కేవీ శాంతినగర్, కండ్రిక, రాధానగర్, ఉడాకాలనీ, పాయకాపురం ఫీడర్లలో లైన్లు మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 10 వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ సుధాకర్ శనివారం తెలిపారు. శాంతినగర్ ఫీడర్‌లో శాంతినగర్, ప్రశాంతినగర్, కండ్రిక ఫీడర్‌లో పాత పాయకాపురం, నూజివీడు మెయిన్ రోడ్డు కండ్రిక, రాధానగర్ ఫీడర్‌లో బర్మాకాలనీ, విశాలంధ్రకాలనీ, రాధానగర్, డాక్టర్స్‌కాలనీ, ఉడాకాలనీ ఫీడర్‌లో ఎపీఎస్‌రెడ్డి రోడ్డు, డాక్టర్స్‌కాలనీ, పాత రాజీవ్‌నగర్, న్యూరాజీవ్‌నగర్, పాయకాపురం ఫీడర్‌లో ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్ నగర్ , పాయకాపురం సబ్‌స్టేషన్ నుంచి పైపుల రోడ్డు వరకూ కరెంట్ ఉండదని తెలిపారు. **లబ్బీపేట:** న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11 కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధి పకీర్ గూడెం, ప్రగతి నగర్, శ్రీరాం నగర్, చంద్రమౌళిపురం, బెంజిసర్కిల్, మైత్రీయ వీధి ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12వరకు సరఫరా ఉండదని ఈఈ సుధాకర్ తెలిపారు.


LYCA
SUBASKARAN PRESENTS
ULAGANAYAGAN
KAMAL HAASAN
IN
SHANKAR'S
భారతీయుడు II
ZERO TOLERANCE
RELEASING IN
JUNE 2024
IN CINEMAS WORLDWIDE
MUSIC ANIRUDH DIRECTOR OF PHOTOGRAPHY RAVI VARMAN
G.K.M.TAMIL KUMARAN - M.SHENBAGAMOORTHY
PRODUCED BY SUBASKARAN
NETFLIX


ZEE STUDIOS & BONEY KAPOOR PRESENT
IN ASSOCIATION WITH FRESHLIME FILMS
BAYVIEW
IN CINEMAS
THIS WED.
BONEY KAPOOR'S
MAIDAAN
BASED ON A TRUE STORY
EXPERIENCE IT IN IMAX
ADVANCE BOOKING NOW OPEN
A FILM BY AMIT RAVINDERNATH SHARMA
MUSIC COMPOSER A.R. RAHMAN
PRODUCED BY ZEE STUDIOS, BONEY KAPOOR, ARUNAVA JOY SENGUPTA & AKASH CHAWLA
ZEE STUDIOS WORLDWIDE RELEASE
PARAS


VIJAY ANTONY FILM CORPORATION
MEERA VIJAY ANTONY
WORLDWIDE RELEASE
APRIL 11
MYTHRI
VIJAY ANTONY
లవ్ గురు
U/A
VINAYAK VAITHIANATHAN


PARAVA FILMS
GOKULAM GOPALAN
SREE GOKULAM MOVIES
మలయాళంలో 200 కోట్లు సాధించిన
మంజుమ్మల్ BOYS
WRITTEN & DIRECTED CHIDAMBARAM
PRODUCED BY BABU SHAHIR, SOUBIN SHAHIR, SHAWN ANTONY
ADVENTUROUS
BLOCKBUSTER
think music
MYTHRI


MAHAATEJA
APRIL
19
IN
THEATERS
TENANT
SCREENPLAY, DIALOGUES & DIRECTION Y. YUGANDHAR PRODUCER CHANDRASHEKHAR REDDY MOGULLA
ADITYA MUSIC


SUMMER FAMILY ENTERTAINER
SRI VENKATESWARA CREATIONS
VIJAY DEVERAKONDA
THE FAMILY STAR
"DIL" RAJU
PARASURAM
NOW IN CINEMAS

9 ఆంధ్రజ్యోతి నవ్య కుటుంబ కదంబం 7 ఏప్రిల్ 2024 ఆదివారం



హిమాచల్‌ప్రదేశ్ సోయగం రుహానీ శర్మ, 'చి.ల.సౌ.' చిత్రంతో పరిచయమైన ఈమె క్రికెటర్ విరాట్ కోహ్లికి మరదలు అవుతుందనీ, అనుష్క శర్మకు చెల్లెలి వరుస అని చాలా మందికి తెలీదు. తెలుగులో అరడజనుకు పైగా చిత్రాల్లో నటించిన రుహానీ తన కెరీర్, సినిమాల గురించి 'నవ్య'కు వివరించారు.

హైదరాబాద్‌లో ఇల్లు కొనుక్కుంటా

మీరు నటి కావడానికి అనుష్క శర్మ ఇన్‌స్పిరేషనా?

ఆవిడతో నాకు ఉన్న అనుబంధం గురించి, ఇతర విషయాల గురించి చెప్పడం నాకు ఇష్టం లేదు. అది పూర్తిగా నా వ్యక్తిగత విషయం. అంతకుమించి చెప్పలేను.. సారీ.

హిమాచల్‌ప్రదేశ్ అమ్మాయి తెలుగు సినిమాల్లోకి ఎలా వచ్చింది?

నటిని కావాలనే ఆలోచన నాకు ఎప్పుడూ లేదు. సినిమాల గురించి అనుకోలేదు. డిగ్రీ పూర్తయ్యాక పంజాబీలో ఓ వీడియో ఆల్బం చేశా. ఆ తర్వాత కొన్ని యాడ్ ఫిల్మ్స్‌లో నటించా. అప్పటి నుంచి నటన మీద ఆసక్తి కలిగింది. నన్ను నటిగా గుర్తించింది తెలుగు చిత్రపరిశ్రమే. ఇక్కడ కొన్ని ఆడిషన్స్‌లో పాల్గొన్న తర్వాత 'చి.ల.సౌ'లో అవకాశం వచ్చింది. ఆ సినిమాతో నా జర్నీ మొదలైంది. ఆ తర్వాత 'హిట్2, 'డర్టీ హరి', '101 జిల్లాల అందగాడు' చిత్రాల్లో నటించాను. వాటి వల్ల తెలుగు వారి అభిమానం పొందగలిగాను.

మీరు చెప్పిన సినిమాల్లో కొన్ని హిట్స్, ఫ్లాప్స్ ఉన్నాయి

హిట్, ఫ్లాప్ అన్నది మన చేతుల్లో ఉండదు కదండీ. మంచి సినిమాలు చేయాలి. నటిగా పేరు తెచ్చుకోవాలి అన్నది నా పాలసీ. కొన్ని సినిమాలు జనానికి నచ్చవచ్చు, కొన్ని నచ్చకపోవచ్చు. అలా అని ఒక చోటే ఆగిపోలేం కదా.

అనుభవాల నుంచి నేర్చుకుంటూ ముందుకు వెళుతుండాలి. ఇలా చెయ్యకూడదు, అలా చెయ్యాలి అని నన్ను గైడ్ చేసే వాళ్లు లేరు. అందుకే జయాపజయాల నుంచి నేర్చుకుంటూ ముందుకు నడుస్తున్నాను.

పాత్రల ఎంపికలో మీ చెల్లెలు సలహాలు ఇస్తుంటారని విన్నాం

అవునండి. తనకి సినిమాల గురించి అవగాహన ఎక్కువ. సినిమాలు బాగా చూస్తుంటుంది. ఎలాంటి పాత్రలు చేయాలో నాకు సలహాలు ఇస్తుంటుంది. నిజ జీవితంలో నీకు హాస్యం అంటే ఇష్టం కదా.. అలాంటి పాత్రలే చెయ్యి అని చెబుతుంటుంది. నాకు కూడా అవే ఇష్టం. వాటి కోసం ఎదురుచూస్తున్నాను.

సినిమాలతో పాటు వెబ్ సిరీస్ చేస్తున్నారు. మీ ప్రయారిటీ దేనికి?

దేనికైనా మంచి కంటెంట్ ముఖ్యం. దాని తర్వాత నా పాత్ర బాగుండాలి. జనం మదిలో కలకాలం నిలిచిపోవాలి.ఇవి చూస్తాను తప్ప సినిమానా, వెబ్ సిరీసా అని ఆలోచించను. ఇప్పటికీ చాలా మంది నా తొలి సినిమాలో 'చి.ల.సౌ'లో అంజలి పాత్ర బాగుందని చెబుతుంటారు. అది విని చాలా ఆనందం కలుగుతుంది.

గ్లామర్‌గా కనిపించడానికి హద్దులు ఏమన్నా ఉన్నాయా?

సినిమా అంటేనే గ్లామర్. అయితే అది మితిమీరకుండా ఉంటేనే బాగుంటుంది. అందుకే నేను గ్లామర్ సీన్లకు అభ్యంతరం చెప్పను. కానీ వల్గారిటీకి మాత్రం నేను దూరంగా ఉంటాను. వాటికి నో చెప్పేస్తుంటాను.

మీరు నటిస్తున్న శ్రీరంగ నీతులు చిత్రం ఎలా ఉంటుంది?

ట్రైలర్ చూశారు కదా. దానిని మించి సినిమా ఉంటుంది. ప్రధానంగా నాలుగు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది.నేటి యువత ఆలోచనలు, కుటుంబ బంధాలు, వినోదం.. అంశాలు ప్రేక్షకుల్ని అలరిస్తాయి. మిమ్మల్ని మీరు చూసుకునేట్లు చిత్రంలో పాత్రలు ఉంటాయి. ఇక నా పాత్రను చూడగానే 'అరే ఈమె మనకు తెలిసిన అమ్మాయే' అనే భావన కలుగుతుంది. ఇంతవరకూ నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన క్యారెక్టర్ ఇది.

సౌత్, నార్త్ .. ఇండస్ట్రీల్లో చేస్తున్నారు. ఏది మీకు కంఫర్ట్‌గా ఉంది?

నిజం చెబుతున్నాను నమ్మండి. నాకు తెలుగు సినిమాల్లోనే నటించడమే ఇష్టం. నటిగా నా జీవితం తెలుగు సినిమాతోనే ప్రారంభం కావడం దీనికి ఒక కారణం కావచ్చు. తెలుగు ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరాభిమానాల్ని మరిచిపోలేను. ఇది నా సొంత ఇల్లు అనే భావన కలుగుతుంది. నన్నే కాదు నార్త్ నుంచి వచ్చిన చాలా మంది అమ్మాయిల్ని తెలుగువారు ఆదరిస్తున్న విధానం మరువలేనిది. 'నేను తెలుగు సినిమాల్లో నటిస్తున్నాను. అని చెబితే ముంబైలో కూడా 'వావ్.. గ్రేట్' అని అభినందిస్తుంటారు. దక్షిణాది సినిమాలు నార్త్‌లో చాలా ఎక్కువ మంది చూస్తుంటారు. ఎంజాయ్ చేస్తుంటారు.

మరి ఇక్కడ ఇల్లు కొన్నారా?

ఆ ప్రయత్నాల్లోనే ఉన్నాను. ఎందుకంటే ఏడాదిలో దాదాపు ఆరేడు నెలలు హైదరాబాద్‌లోనే ఉంటున్నాను. తెలుగువారి ఆశీస్సులతో ఇల్లు కొందామనే ఆలోచనలో ఉన్నాను.

సైంధవ్‌లో డాక్టర్‌గా నటించారు. ఆ సినిమా రిజల్ట్ డిజప్పాయింట్ చేసిందా?

లేదండీ. వెంకటేశ్‌గారితో కలసి నటించే అవకాశం నాకు ఆ సినిమా ఇచ్చింది. ఎన్నో మధుర సంఘటనలు మిగిల్చింది ఆ చిత్రం. అలాగే వరుణ్ సందేశ్‌తో చేసిన 'ఆపరేషన్ వాలెంటైన్' కూడా నాకు మంచి అవకాశం. అందరి హీరోలతో నటించాలన్నది నా కోరిక. అది తీరినప్పుడు మిగతా విషయాలు పట్టించుకోను. జయాపజయాలు మన చేతుల్లో లేవు కదా



మ్యూజికల్ ఆల్బమ్స్ మళ్లీ ఏమన్నా చేస్తున్నారా?

లేదండి. ప్రస్తుతం నా దృష్టి సినిమాల మీదే. అయితే ఎక్సయిటింగ్ ఆఫర్ వస్తే అప్పుడు ఆలోచిస్తా.


- వినాయకరావు

మేకప్

అందం అరవిందం

మేకప్ ప్రొడక్ట్స్ భిన్నమైన స్వభావాలు, ప్రయోజనాలను కలిగి ఉంటాయి. ముఖంలోని లోపాలను దాచడానికి తోడ్పడే ఆ ఉత్పత్తులను తెలివిగా ఉపయోగించినప్పుడే, వాటి ప్రయోజనాన్ని సంపూర్ణంగా పొందగలుగుతాం! కాబట్టి వాటి పట్ల అవగాహన పెంచుకోండి.

టోనర్: చర్మం నునుపుగా, బిగుతుగా మేకప్‌కు అనువుగా మారడం కోసం టోనర్ వాడడం తప్పనిసరి. అలాగే మొటిమలు, మచ్చలు ఉన్న చోట టోనర్‌ను అప్లై చేసుకుని, వాటిని కనిపించకుండా దాచేయవచ్చు.



మాయిశ్చరైజర్: మేకప్ సమంగా పరుచుకోవడం కోసం మేకప్‌కు ముందు మాయిశ్చరైజర్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ వాడడం వల్ల చర్మం మీద మేకప్ పగుళ్లు ఏర్పడకుండా ఉంటాయి. చర్మం పొడిబారిపోకుండా ఉంటుంది.

ప్రైమర్: చర్మానికీ, మేకప్‌కూ మధ్య ప్రైమర్ అడ్డుగా ఉండి, చర్మం మీది రంధ్రాలు కనిపించకుండా చేస్తుంది. దీంతో చర్మ రంధ్రాలు పూడుకుపోకుండా ఉంటాయి.

ఫౌండేషన్: స్కిన్ టోన్‌ను సమం చేసి, మేకప్‌కు బేస్‌గా మారుతుంది. కాబట్టి, ఫౌండేషన్‌ను ముఖం మీద సమంగా పరుచుకోవాలి.

కన్సీలర్: చర్మపు రంగుకు ఒకటి లేదా రెండు టోన్ల తేలిక రంగు కన్సీలర్ ఎంచుకోవాలి. దీంతో మచ్చలను దాచేసి, ముఖంలో కనురెప్పలు, ముక్కు, చుబుకం, చెక్కిళ్లను హైలైట్ చేసుకోవచ్చు.

కాంటూర్: దీంతో ముఖానికి ఆకారాన్ని తీసుకురావచ్చు. ముక్కు, చుబుకం, చెక్కిళ్లను ఆకర్షణీయంగా మలుచుకోవచ్చు.

బ్లష్: చెక్కిళ్లను హైలైట్ చేయడం కోసం దీన్ని వాడుకోవాలి.

మంచి ఆరోగ్యం కోసం...



- తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తినాలి. ప్యాకేజ్డ్ ఫుడ్ తగ్గిస్తే ఎంతో మంచిది.
- ఆరోగ్యంగా ఉండాలంటే మంచి తిండి తినటమే కాదు డైట్‌ను మార్పు చేసుకోవాలి. ముఖ్యంగా క్రమశిక్షణతో కూడిన జీవనవిధానాన్ని అలవాటు చేసుకోవాలి. ఉదయాన్నే నిద్రలేచి వాకింగ్, రన్నింగ్, స్విమ్మింగ్‌తో పాటు జిమ్‌లో వ్యాయామాలు చేయాలి. దీనివల్ల శరీరం చురుగ్గా ఉంటుంది. బరువు తగ్గుతారు. బరువే అన్ని సమస్యలకు మూలమని తెలుసుకోవాలి.
- గంటలపాటు కుర్చీలకే పరిమితం కావటం అనేది పాసివ్ స్మోకింగ్‌తో పోలుస్తారు. దీనివల్ల అనర్థాలెన్నో. అందువల్ల ఉద్యోగంతో పాటు కూర్చుని పని చేసేవాళ్లు గంటలపాటు కూర్చోకుండా మధ్య మధ్యలో నడవాలి.
- ఉప్పు, చక్కెరలను తగ్గించాలి. యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్ లాంటివి వాడకండి. దీనివల్ల భవిష్యత్తులో గుండె సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.
- ఎంత పని చేశారు? ఎన్ని గంటలు వ్యాయామం చేశారు? అనేవి ప్రశ్నలు కాదు. ఎంత గాఢంగా నిద్రపోయారన్నదే ప్రమాణం. ఇంట్లోఉండే వాళ్లు పగటిపూట గంట నిద్రపోయినా పర్లేదు. రీఛార్జ్ అవుతారు. మంచి నిద్రనే మీ ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందనేది మర్చిపోకూడదు.
- డిజిటల్ ప్రపంచానికి మీరే కాదు.. మీ పిల్లలను దూరంగా ఉంచండి. ఔట్‌డోర్ గేమ్స్‌ను ఎంకరేజ్ చేయాలి. దీని వల్ల శారీరకంగా, మానసికంగా ఉపశమనం కలుగుతుంది.

తెలుగులో 'ఇంకోసారి', 'శుభప్రదం' చిత్రాల్లో నటించిన ముంబై భామ మంజరి ఫడ్నిస్. బాలీవుడ్‌లోనే ఎక్కువ సినిమాల్లో నటించింది. ఓటీటీల్లోనూ మెరుస్తోన్న ఈ అమ్మడు 'యూపీ ఫైల్స్' చిత్రంలో పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటిస్తోంది. ఈ సందర్భంగా మంజరి ఫడ్నిస్ గురించి కొన్ని విశేషాలు...

అలాంటి చిత్రాల్లో నటించాలనుంది!

"ఓటీటీల్లో నటించటమంటే తక్కువేం కాదు.. కాస్త ఎక్కువే. ప్రయోగాత్మక చిత్రాలు, వెబ్‌సిరీస్‌లు చేయాలంటే ఓటీటీనే ప్రధానమైన వనరు. ఓటీటీని, సినిమాను కలిపి చూడనక్కర్లేదు. సెవన్టీ ఎమ్.ఎమ్., ఓటీటీ దేని ప్రత్యేకత దానిదే. ఓటీటీ వల్ల మంచి రచయితలు, దర్శకులు వస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో మంచి చిత్రాలు తీస్తున్నారిప్పుడు. ఇదెంతో మంచి పరిణామం.

అలా 'యూపీ ఫైల్స్'..

'కిస్ కిస్కో ప్యార్ కరూనా' చిత్రంలో మనోజ్ జోషితో కలసి నటించి. అతనే నా పేరు రిఫర్ చేశారు. ఆ తర్వాత దర్శకుడు నీరజ్ ఫోన్ చేసి పాత్ర గురించి చెప్పారు. పోలీస్ పాత్ర ఎప్పుడూ చేయలేదు. తొలిపాత్రనే పవర్‌ఫుల్ పోలీస్ పాత్ర చేయటం బావుంది. ఈ పాత్రకు కనెక్టయిపోయా. సీఎం చుట్టూ తిరిగే కథ ఇది. నిజజీవిత సంఘటనలుంటాయి. ప్రస్తుతం ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాం. ఈ చిత్రంతో మంచి పేరొస్తుందని నమ్ముతున్నా.



ఇదీ నేపథ్యం..

అమ్మ పేరు రుచి ఫడ్నిస్, నాన్న పేరు కల్నల్ భరత్ కుమార్ ఫడ్నిస్. నాన్న సైన్యంలో పని చేసి రిటైర్ అయ్యారు. 2003 'వి' ఛానల్‌లో పాప్‌స్టార్స్ సింగింగ్ రియాలిటీ షోలో పాల్గొన్నా. సినిమాల్లోకి వచ్చింది మాత్రం 'రోక్ సాకో తో రోక్ లో'. అయితే 'జానే తూ యా జానే నా' చిత్రంతో బ్రేక్ వచ్చింది. సినిమాల్లోకి వచ్చినా.. టెలివిజన్‌తో పాటు థియేటర్ ఆర్టిస్టుగా కొన్ని నాటకాల్లో నటించా. 'గ్రాండ్ మస్తీ', 'నిర్దోష్' చిత్రాల్లో నటించా. తెలుగు, కన్నడ, మరాఠా చిత్రాల్లో పని చేశా. వెబ్‌సిరీస్‌లతో పాటు మ్యూజిక్ ఆల్బమ్స్ చేశా.

వాటితోనే ఆడుకుంటుంటా...

మా ఇంట్లో మియా, సింబా అనే పిల్లులున్నాయి. వాటితోనే ఎక్కువ సమయం గడుపుతా. మూడ్ బాలేనప్పుడే కాదు.. ఎప్పుడూ వాటితో ఆడుకుంటుంటా. హీలింగ్ పవర్ వాటిలో ఉందని నమ్ముతా. సొంత పిల్లల్లా చూసుకుంటా. స్ట్రీట్ డాగ్స్‌ను చేరదీస్తుంటా. కెరీర్ పరంగా చూస్తే.. ఈ ఫేజ్ చాలా బావుంది. ప్రస్తుతం 'చల్తీ రహే జిందగీ'లో నటించి. ఇది పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమవుతోంది. 'పుణే హైవే' చిత్రంలో నటిస్తున్నా. మరో రెండు ప్రాజెక్టులకు ఇటీవలే సైన్ చేశా. మహిళా ప్రాధాన్యం ఉండే పాత్రల్లో విరివిగా నటించాలన్నదే నా లక్ష్యం."



అలనాటి కథ

పైగాల ప్రాభవం

వేల ఎకరాల ఎస్టేట్లు... కళ్లు చెదిరే కోట్ల విలువైన ఆభరణాలు... అందమైన ప్యాలెస్‌లు... పైగా నిజాంకు అత్యంత సన్నిహితులైన వ్యక్తులు. అయినా హైదరాబాద్‌కు చెందిన రాజ కుటుంబీకులు ప్రతి చోటా తమ హోదాను, అహంకారాన్ని ప్రదర్శించేవారుకాదు. పైగా కళలకు రాజధానిగా హైదరాబాద్‌కు పేరు రావటానికి వీరు చేసిన కృషి ఎంతో ఉంది. అలాంటి ఒక రాజ కుటుంబీకుడు జహీర్ యార్ జంగ్! సాలార్ జంగ్ అంకుల్ తర్వాత నాకు అత్యంత ఇష్టుడు. నిజాంకు అత్యంత సన్నిహితుడైన మొయిన్ ఉద్‌దౌలా కుమారుడు. ప్రస్తుతం జహీరాబాద్ ఆయన పేరిట ఏర్పడిందే.

నిజాం పెయిర్ (కాళ్లు) దగ్గర కూర్చునే సేవలకు 'పైగా'లు అనే పేరు వచ్చింది. అలాంటి పైగాలలో ప్రముఖుడు అమీరే పైగా. వీరి తర్వాత బాగా పేరు పొందిన వ్యక్తి జహీర్. నా చిన్నతనంలో నిజాం సంస్థానంలో పైగాలకు ప్రత్యేక స్థానముండేది. వీరి జాగీర్‌లలో వందల కొద్దీ గ్రామాలు ఉండేవి. జహీర్ అంకుల్ జాగీర్‌లో నాకు గుర్తున్నంత వరకు 320కు పైగా గ్రామాలు భాగంగా ఉండేవి. ప్రస్తుత జహీరాబాద్ ప్రాంతంలో మా నాన్న రాజా ధన్‌రాజ్‌గిర్‌కు నాలుగు వేల చెట్లతో ఒక గంధపు తోట కూడా ఉండేది. ఆ తోటలో ఫార్మ్ హౌస్ ఉండేవి. షోలాపూర్ వెళ్లే దారిలో మేము అప్పుడప్పుడు ఆగుతూ ఉండేవాళ్లం. జహీర్ అంకుల్‌కు నలుగురు పిల్లలు.



మహారాజా ఆఫ్ గ్వాలియర్, రాజా ధన్‌రాజ్‌గిర్, నవాబ్ జహీర్ యార్ జంగ్

ముగ్గురు అబ్బాయిలు. ఒక అమ్మాయి. మా తమ్ముడు మహేంద్రగిర్‌ని ఆమె ప్రేమించి పెళ్లి చేసుకుంది. దాంతో మా మధ్య చుట్టరికం కూడా ఉంది.

జహీర్ అంకుల్ అనగానే నాకు ముందు గుర్తుకొచ్చేది క్రికెట్. వాళ్ల నాన్నగారు నవాబ్ మొయిన్ ఉద్‌దౌలాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. దేశంలో రకరకాల క్రికెట్ జట్లు వచ్చి ఆడటానికి వీలుగా సరూర్ నగర్‌లో తన ప్యాలెస్ వద్దే ఒక స్టేడియం కట్టించారు. ఆటగాళ్లను స్టేడియంకు తీసుకువెళ్లటానికి నాన్న ప్రత్యేకంగా ఒక బస్సు కొన్నారు. ఆ బస్సు పేరు సుల్తానా. ఇక మొయిన్ ఉద్‌దౌలా ప్యాలెస్ నుంచే ఆయన క్రికెట్ చూసేవారు. ఆయన అలా మ్యాచ్ చూస్తూనే మరణించారు. ఆ సమయంలో 'బెహ్రమ్ ఉదౌలా ట్రోఫీ' అత్యంత ప్రతిష్టాత్మకమైనది. ఈ ట్రోఫీ గెలిచిన వారికి బంగారంతో చేసిన కప్... రన్నరప్‌కు వెండితో చేసిన కప్‌లు ఇచ్చేవారు. మూడు సంవత్సరాలు వరుసగా గెలిస్తే రోలింగ్ కప్ ఇచ్చేవారు. దీని కోసం విజయనగరం లెవెన్, నవాబ్ మొయిన్ ఉద్‌దౌలా 11, ఆలీగఢ్ యూనివర్సిటీ, హైదరాబాద్ స్టేట్, లాహోర్ స్టేట్, ముంబయి, ధన్‌రాజ్ లెవెన్‌లు (ఇది మా టీమే) పోటీ పడేవి.



నవాబ్ జహీర్ యార్ జంగ్

నాన్నకు క్రికెట్ అంటే పిచ్చి. అందువల్ల ఎప్పుడూ మా టీమ్ గెలవాలని ప్రయత్నించేవారు. మా టీమ్‌లో ముస్తాక్, సి.కె.నాయుడు, పాటియాలా యువరాజు తదితరులు ఆడేవారు. దీంతో మా టీమ్‌కు మంచి క్రేజ్ ఉండేది. సి.కె.నాయుడు మా ఇంటికి వచ్చినప్పుడు... ఆయన బాల్ వేస్తుంటే నేను షటిల్ బ్యాట్‌తో క్రికెట్ ఆడేదాన్ని. టోర్నీ విషయంలో కూడా రకరకాల వివాదాలు చెలరేగుతూ ఉండేవి. విజయనగరం లెవెన్ జట్టు వరుసగా మూడుసార్లు గెలిచింది. లెక్క ప్రకారమైతే కప్పును ఇచ్చేసి రోలింగ్ షీల్డ్‌ను తీసుకోవాలి. కానీ విజయనగరం మహారాజు విజ్జీ.. కప్పును ఇవ్వటానికి ఇష్టపడలేదు. దాంతో నవాబ్ మొయిన్ ఉద్‌దౌలా కొత్త కప్పును చేయించాల్సి వచ్చింది. నాన్న టీమ్‌కు కూడా రోలింగ్ షీల్డ్ వచ్చింది. ఈ టోర్నీలో ప్రతిభ ప్రదర్శించిన వారికి మొయిన్ ఉద్‌దౌలా బంగారు నాణేలు బహుమతిగా ఇచ్చేవారు.

ఆ రోజుల్లో రాజ కుటుంబీలను ఎంతో ఆదరంతో చూసేవారు. పాటియాలా యువరాజు క్రికెట్ టోర్నమెంట్ ఆడటానికి వచ్చినప్పుడు మా ఇంటికి వస్తూ ఉండేవారు. ఒకసారి ఆయన నిజాంను కలిశారు. ఆయన స్టైల్ నిజాంకు చాలా నచ్చింది. దాంతో పాటియాలా మహారాజును కూడా హైదరాబాద్‌కు ఆహ్వానిస్తూ ఒక ఉత్తరం రాశారు. సాధారణంగా యువరాజు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రాజ్‌భవన్‌లో నివసించేవారు. ఒకసారి రాజ్‌భవన్‌లో డిన్నర్ ఇచ్చారు. ఆ డిన్నర్‌లో యువరాజుకు ఒక వైపు జహీర్ అంకుల్, మరో వైపు నేను కూర్చున్నాం. ఆయన పాటియాలాకు వెళ్లిన తర్వాత నాకు ఒక ఉత్తరం రాశారు. అది ఇప్పటికీ నా దగ్గర పదిలంగా ఉంది.

జహీర్ అంకుల్ కుమారుడు కుతుబ్, ప్రిన్స్ ముఖరంఝా, మహేంద్రగిర్ ప్రాణ స్నేహితులు. ముఖరం ఝా, మహేంద్రగిర్ ఎప్పుడూ కుతుబ్‌తోనే ఉండేవారు. వీళ్లందరికీ కార్ల పిచ్చి ఉండేది. ఆ రోజుల్లో ఖార్దార్ అనే పెద్ద ప్రొడ్యూసర్ ఉండేవారు. ఆయన ఇల్లు మెరైన్ డ్రైవ్‌లో ఉండేది. ఖార్దార్‌కు ఇద్దరు అందమైన అమ్మాయిలు ఉండేవారు. వారి కంట్లో పడటం కోసం ఈ ముగ్గురూ వాళ్లింటి ముందు కాపలా కాస్తూ ఉండేవారు. కుతుబ్ ముంబయి వచ్చినప్పుడు మా ప్యాలెస్‌లోనే ఉండేవాడు. తను, మహేంద్రగిర్ గట్టిగట్టిగా మాట్లాడుకుంటూ ఉండేవారు. ఎంత పెద్దగా మాట్లాడేవారంటే... ఆ మాటలు దూరంగా ఉన్న నా రూమ్‌కు కూడా వినిపించేవి. నేను వెళ్లి గట్టిగా మాట్లాడవద్దని చెబుతూ ఉండేదాన్ని. కుతుబ్ మొదట్లో పెళ్లికి ఇష్టపడేవాడు కాదు. ఎన్ని సంబంధాలు వచ్చినా తిరగగొట్టేసేవాడు. దాంతో ఒక రోజు జహీర్ అంకుల్.. కుతుబ్‌ను, మహేంద్రగిర్‌ను పిలిచి.. "మీరు పెళ్లి చేసుకుంటే మంచి కారు బహుమతిగా ఇస్తా" అన్నాడు. కుతుబ్ మనసు మారింది. పెళ్లి సమయానికి జహీర్ అంకుల్.. కుతుబ్‌కు ఒక మంచి కారు బహుమతిగా ఇచ్చాడు. జహీర్ యార్‌జంగ్ ఏకైక కుమార్తె కరీమ్ పాషాను రాజా మహేంద్రగిర్ వివాహం చేసుకున్నాడు.

- రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ih2YJfN లో చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vujv1d6లో చదవండి.

బిజినెస్

బంగారం కొనుగోలుపై వెండి ఉచితం

జోయాలుక్కాస్ ఉగాది ఆఫర్

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ ఉగాది పండగను పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. నాలుగు రోజులు మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఆఫర్ కింద వినియోగదారులు కొనుగోలు చేసిన బంగారానికి అదే బరువుతో వెండిని పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించింది. ఈ పండగ సీజన్‌లో వినియోగదారులు ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జోయాలుక్కాస్ కోరింది. ఈ ఆఫర్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని అన్ని షోరూమ్‌ల్లో అందుబాటులో ఉంటుందని తెలిపింది. వినియోగదారులు ఉగాది పండగను మరింత సంబరంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో 'బంగారం కొనండి... అదే బరువు గల వెండిని ఉచితంగా పొందండి' ఆఫర్‌ను ప్రకటించినట్లు జోయాలుక్కాస్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ తెలిపారు.

హెచ్ఎస్ఎల్ టర్నోవర్ రూ.1,597 కోట్లు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,597 కోట్ల టర్నోవర్ సాధించింది. కాగా 'ఆత్మనిర్భర్ భారత్' కింద స్వదేశీ నౌకల తయారీకి కేంద్రం ప్రాధాన్యం ఇవ్వడంతో హెచ్ఎస్ఎల్‌కు భారీ ఆర్డర్లు దక్కాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ.1,103 కోట్ల టర్నోవర్‌పై రూ.65 కోట్ల లాభాన్ని ఆర్జించింది. తాజాగా ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,597 కోట్ల టర్నోవర్‌పై రూ.109 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. గత నెల 30వ తేదీన ఎల్ అండ్ టీ జియోస్ట్రక్చర్ సంస్థతో కలిసి ఫ్లీట్ సపోర్ట్ వెసెల్స్, ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ డాక్స్ నిర్మాణానికి 20 నెలల కాలపరిమితితో ఒప్పందం చేసుకుంది.

ఆంధ్రప్రదేశ్, రాజమండ్రిలోని ఐసీఎస్ఈ అనుబంధ పాఠశాల ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌తో గీతమ్ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ఫ్యూచర్ కిడ్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన తోడ్పాటును గీతమ్ అందించనుంది. అంతేకాకుండా ఫ్యూచర్ కిడ్స్ విద్యార్థులు.. గీతమ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్ కోసం అవసరమైన స్కాలర్‌షిప్స్‌ను అందుకునే అవకాశాన్ని కల్పించనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	375	విజయవాడ	390
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	390	వరంగల్	377
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	గోదావరి	152
వరంగల్	156	విజయవాడ	152
కరీంనగర్	156	గుంటూరు	152
మహబూబ్‌నగర్	156	ఒంగోలు	152
కర్నూలు	156	చిత్తూరు	148
విశాఖపట్నం	134		

విప్రో సీఈఓ డెలాపోర్ట్ రాజీనామా

కంపెనీ కొత్త సారథిగా శ్రీనివాస్ పల్లియా నియామకం



న్యూఢిల్లీ: దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ కంపెనీ విప్రో ఎండీ, సీఈఓ థియరీ డెలాపోర్ట్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో కంపెనీ కొత్త సారథిగా శ్రీనివాస్ పల్లియాను నియమించినట్లు విప్రో శనివారం ప్రకటించింది. ఈ నెల 19న కంపెనీ నాలుగో త్రైమాసిక (జనవరి-మార్చి) ఆర్థిక ఫలితాలు ప్రకటించనున్న నేపథ్యంలో సారథ్య మార్పు జరగడం గమనార్హం. గత కొంతకాలంగా విప్రో పనితీరు విషయంలో తన ప్రత్యర్థులతో పోలిస్తే వెనకబడింది. ఇందుకుతోడు, గడిచిన ఏడాది కాలంలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) జతిన్ దలాల్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ స్టెఫానీ ట్రాట్మాన్ సహా పది మంది ఉన్నతాధికారులు కంపెనీని వీడారు. తాజాగా డెలాపోర్ట్ సైతం గుడ్‌బై పలికారు. ఆయన రాజీనామా ఏప్రిల్ 6 నుంచే అమల్లోకి వచ్చినప్పటికీ మే 31 వరకు కంపెనీ ఉద్యోగ బాధ్యతల్లో కొనసాగుతారని విప్రో స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం అందించింది.

నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ సిఫారసు మేరకు కొత్త సీఈఓ, ఎండీగా శ్రీనివాస్ పల్లియా నియామకానికి బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ పేర్కొంది. ఈ నెల 7 నుంచి ఐదేళ్లపాటు శ్రీనివాస్ ఈ పదవిలో కొనసాగనున్నారు. ఇందుకు విప్రో వాటాదారులతో పాటు అవసరమైతే కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదం తెలపాల్సి ఉంటుంది. 2020 జూలైలో థియరీ డెలాపోర్ట్ విప్రో పగ్గాలు చేపట్టారు. అంతక్రితం ఆయన ఫ్రెంచ్ ఐటీ కంపెనీ క్యాప్‌జెమినీలో పనిచేశారు. గత ఏడాది రూ.80 కోట్ల వార్షిక పారితోషికం అందుకున్న డెలాపోర్ట్.. దేశీయ ఐటీ రంగంలో అత్యధిక ప్యాకేజీ అందుకున్న సీఈఓగా నిలిచారు. కాగా 1992లో విప్రోలో చేరిన శ్రీనివాస్..మూడు దశాబ్దాలకు పైగా కంపెనీకి సేవలందిస్తున్నారు. కంపెనీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పలు కీలక బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం కంపెనీకి చెందిన అతిపెద్ద, వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్ 'అమెరికాస్ 1'కు సీఈఓగా ఉన్నారు. అంతేకాదు, విప్రో ఎగ్జిక్యూటివ్ బోర్డులో సభ్యుడు కూడా. అమెరికాలోని న్యూజెర్సీ నుంచే సీఈఓగా బాధ్యతలు నిర్వహించనున్న శ్రీనివాస్..చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీకి రిపోర్ట్ చేయనున్నారు.

ఏటా రూ.8.30 లక్షల కోట్లు

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న కేంద్రం

న్యూఢిల్లీ: చాలామంది అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, బహుళ జాతి కంపెనీల (ఎంఎన్‌సీ) దృష్టి చైనా నుంచి భారత్‌కు మళ్లిన నేపథ్యంలో ఏటా కనీసం 10,000 కోట్ల డాలర్ల (రూ.8.30 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను ఆకర్షించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య శాఖ (డీపీఐఐటీ) కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. 2023 మార్చితో ముగిసిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో దేశంలోకి సగటున 7,000 కోట్ల డాలర్ల చొప్పున ఎఫ్‌డీఐలు తరలి వచ్చాయి. అంతర్జాతీయ అనిశ్చితులు, ఇతర ప్రతికూల పరిణామాల కారణంగా గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో మాత్రం ఎఫ్‌డీఐలు తగ్గాయి. ఈ ఏప్రిల్1తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) లోనూ సవాళ్లున్నప్పటికీ ఎఫ్‌డీఐలు 10,000 కోట్ల డాలర్ల లక్ష్యానికి చేరువ కావచ్చని సింగ్ పేర్కొన్నారు. "వచ్చే ఐదేళ్ల పాటు కనీసం 10 వేల కోట్ల డాలర్ల చొప్పున ఎఫ్‌డీఐలను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. పెట్టుబడుల ట్రెండ్ సానుకూలంగా, పెరుగుతూ పోయేలా ఉంద"ని ఈ మధ్య బ్లూంబర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. అంతర్జాతీయ అనిశ్చితులు, ప్రతికూలతల్లోనూ మన ఆర్థిక వ్యవస్థలో కార్యకలాపాలు చురుకుగా సాగుతున్నాయి. జీడీపీ సహా ఈమధ్యకాలంలో విడుదలైన పలు స్థూల ఆర్థిక గణాంకాలే ఇందుకు నిదర్శనం.

దీంతో పలు ఎంఎన్‌సీలు, ముఖ్యంగా మాన్యుఫాక్చరింగ్ దిగ్గజాలు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నుంచి తమ వ్యాపారాలకు రక్షణ కల్పించేందుకు భారత్ వంటి సురక్షిత దేశాలకు కార్యకలాపాలను విస్తరించాలనుకుంటున్నాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం భారత్‌ను చైనాకు ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా మార్చే పనిలో ఉంది. ఈ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, ఐటీ, హార్డ్‌వేర్, టెలికాం సహా పలు రంగాలకు ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకాలను ప్రకటించింది. పీఎల్ఐ ప్రయోజనాలను అందుకునేందుకు యాపిల్, సామ్‌సంగ్ వంటి ఎలక్ట్రానిక్స్ దిగ్గజాలు ఇప్పటికే దేశంలో తయారీ కార్యకలాపాలను పెంచాయి.

బీ న్యూ ఉగాది ఆఫర్లు



హైదరాబాద్: ఉగాది పండగను పురస్కరించుకుని బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని వినియోగదారులకు అద్భుతమైన ఆఫర్లను ప్రకటించింది. ఈ ఆఫర్‌లో భాగంగా ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.5,999 విలువ గల స్మార్ట్ వాచీ లేదా బడ్స్‌ను అందించనున్నట్లు సంస్థ సీఎండీ వైడీ బాలాజీ చౌదరి వెల్లడించారు. అలాగే బీ న్యూ కస్టమర్లు.. బజాజ్ ఫైనాన్స్ ద్వారా చేసే కొనుగోలుపై రూ.6,000 వరకు క్యాష్‌బ్యాక్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ద్వారా చేసే కొనుగోలుపై రూ.5,000 క్యాష్‌బ్యాక్, హెచ్‌డీబీ ద్వారా కొనుగోలు చేస్తే 10 శాతం వరకు క్యాష్‌బ్యాక్‌ను ఆఫర్ చేస్తున్నట్లు సంస్థ సీఈఓ సాయి నిఖిలేష్ తెలిపారు. కాగా స్మార్ట్ ఫోన్, టీవీ కొనుగోలుపై స్క్రాచ్ అండ్ విన్ గేమ్ ద్వారా స్మార్ట్ వాచీ, బడ్స్, స్మార్ట్ టీవీని ఏదైనా ఒక బహుమతిగా పొందవచ్చని బీ న్యూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితీష్ తెలిపారు.

కాగ్నిజెంట్‌లో జీతాల పెంపు వాయిదా

ఏప్రిల్‌కు బదులు ఆగస్టులో హైక్

న్యూఢిల్లీ: నాస్‌డాక్ లిస్టెడ్ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ ఉద్యోగుల జీతాల పెంపును నాలుగు నెలలు వాయిదా వేసింది. గత ఏడాది ఏప్రిల్‌లో వేతన పెంపును అమలు చేసిన కంపెనీ.. ఈసారి మాత్రం ఆగస్టులో పెంచనున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ ఆర్థిక మందగమనంతో ఐటీ సేవలకు డిమాండ్ తగ్గిన నేపథ్యంలో ఈ రంగ కంపెనీలు తమ లాభాల మార్జిన్లను కాపాడుకునేందుకు వీలైనన్ని మార్గాల్లో వ్యయ నియంత్రణ చర్యలు చేపడుతున్నాయి. కాగ్నిజెంట్‌కు ప్రపంచవ్యాప్తంగా 3.47 లక్షల మంది ఉద్యోగులుండగా, అందులో 2.54 లక్షల మంది కంపెనీకి చెందిన భారత కార్యాలయాల్లోనే పనిచేస్తున్నారు.

కామన్ ఇన్‌పుట్స్ మీద క్రెడిట్ ఎలా తీసుకోవాలి..?

ఇదీ GST



రాంబాబు గొండాల

రఘు ఒక పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. ఇందులో పన్ను పరిధిలోకి వచ్చే ఉత్పత్తులతో పాటుగా పన్ను నుంచి మినహాయింపు పొందిన ఉత్పత్తులను కూడా తయారు చేస్తున్నాడు. అయితే ఈ రెండింటికి సంబంధించిన ముడి పదార్థాలు (రా మెటీరియల్) ఒకటే. దీంతోపాటుగా కొన్ని సర్వీసులు కామన్‌గా వాడుతున్నాడు. అంటే గోడౌన్, ఆఫీస్ అద్దె, సెక్యూరిటీ, మార్కెటింగ్, ట్రాన్స్‌పోర్ట్ సేవలు మొదలైనవి. వీటిని ఉత్పత్తి వారీగా విడదీయటం కష్టం. మరి అలాంటప్పుడు తాను కొనుగోలు చేసిన ఇన్‌పుట్స్, సర్వీసుల మీద క్రెడిట్ ఎలా పొందాలి? ఎంత మేర రివర్స్ చేయాలి అన్న దానికి జీఎస్‌టీ చట్టంలో ఒక విధానం ఉంది. ఎప్పుడైతే కామన్ ఇన్‌పుట్స్ అంటే ముడి పదార్థాలు కావచ్చు లేదా సర్వీసులు కావచ్చు. వీటిని పన్ను పరిధిలోకి వచ్చే, పన్ను నుంచి మినహాయింపు పొందే ఉత్పత్తుల కోసం వాడినట్లయితే, పన్ను మినహాయింపు పొందిన వస్తువుల ఉత్పత్తిలో వాడిన ఇన్‌పుట్స్‌కి సంబంధించిన క్రెడిట్ రివర్స్ చేయాలి. కానీ పైన చెప్పినట్లు ఇన్‌పుట్స్‌ను, సర్వీస్‌లను ఉత్పత్తి వారీగా విడదీయటం కష్టం కాబట్టి, ప్రతి నెలా మొత్తం అమ్మకాల విలువలో పన్ను మినహాయింపు పొందిన అమ్మకాల విలువ ఎంతో లెక్కించి దామాషా పద్ధతిలో తీసుకున్న క్రెడిట్‌ను రివర్స్ చేయాల్సి ఉంటుంది. దీన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

జనవరి నెలలో ముడి పదార్థాల మీద రూ.10 లక్షల మేర క్రెడిట్, సర్వీసుల మీద రూ.2 లక్షల వరకు క్రెడిట్ పొందాడనుకుందాం. అంటే మొత్తం మీద రూ.12 లక్షల వరకు అతనికి క్రెడిట్ వచ్చింది. అలాగే ఆ నెలలో మొత్తం రూ.20 లక్షల వరకు అమ్మకాలు జరిగాయి. అంటే సరఫరాలు జరిగాయి. వీటిలో రూ.15 లక్షల వరకు పన్ను పరిధిలోకి వచ్చే అమ్మకాలు కాగా, రూ.5 లక్షలు పన్ను మినహాయింపు పొందిన అమ్మకాలు ఉన్నాయి. అంటే మొత్తం అమ్మకాల్లో పన్ను మినహాయింపు పొందిన అమ్మకాలు 25 శాతం అన్నమాట. కాబట్టి తాను పొందిన రూ.12 లక్షల క్రెడిట్‌లో నుంచి 25 శాతం అంటే రూ.3 లక్షల క్రెడిట్ ఆ నెలకు దాఖలు చేసే జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లో రివర్స్ చేయాలి. ఇలా ప్రతి నెలా చేస్తుండాలి. అయితే ఇందులో చిన్న సమస్య ఉంది. తీసుకున్న క్రెడిట్‌కు, ఉత్పత్తిలో వాడిన ఇన్‌పుట్స్‌కు, జరిపిన అమ్మకాలకు కొన్ని సార్లు సంబంధం ఉండకపోవచ్చు.

ఉదాహరణకు ఎక్కువ మొత్తంలో ముడి పదార్థాలు కొనుగోలు చేస్తే ధర తక్కువ వస్తుంది. ట్రాన్స్‌పోర్ట్ కలిసివస్తుందని.. రఘు తాను వాడే ముడి పదార్థాలను భారీ మొత్తంలో కొనుగోలు చేశాడనుకుందాం. సహజంగానే, వీటి మీద క్రెడిట్ కూడా భారీగానే వస్తుంది. అయితే, ఆ నెలలో తనకు పన్ను మినహాయింపు పొందిన ఉత్పత్తులకు ఎక్కువ ఆర్డర్ వచ్చింది. అప్పుడు ఆపైన చెప్పిన పద్ధతి ప్రకారం ఎక్కువ క్రెడిట్ రివర్స్ చేయాల్సి ఉంటుంది. కానీ, తదుపరి జరిపే అమ్మకాల్లో సింహభాగం పన్ను కింద వచ్చే అమ్మకాలు ఉండవచ్చు. అయినప్పటికీ అప్పటికే రఘు భారీ మొత్తంలో క్రెడిట్ రివర్స్ చేయటం జరిగింది. కాబట్టి దాన్ని తిరిగి తీసుకోలేడు. అలాగే కొన్నిసార్లు దీనికి వ్యతిరేకంగా కూడా జరగవచ్చు. అంటే, క్రెడిట్ పొందిన నెలలో ఎక్కువ భాగం పన్ను కింద అమ్మకాలు జరిగి తదుపరి నెలలలో పన్ను మినహాయింపు జరిపే అమ్మకాలు జరగవచ్చు.

అందుకే దీన్ని దృష్టిలో పెట్టుకుని నెలవారీ రిటర్నులు చేస్తూ ఆర్థిక సంవత్సరం చివరలో ఆ ఆర్థిక సంవత్సరంలో పొందిన మొత్తం క్రెడిట్‌ను పరిగణనలోకి తీసుకుని సంవత్సరం మొత్తంలో జరిపిన అమ్మకాల్లో పన్ను మినహాయింపు పొందిన అమ్మకాల శాతం లెక్కించి, దాని ప్రకారం రివర్స్ చేయాల్సిన క్రెడిట్ ఎంతో లెక్కించుకోవాలి.

ఈ విలువ ఆ సంవత్సరంలో ప్రతి నెల రివర్స్ చేసిన మొత్తాల కంటే ఎక్కువ ఉంటే ఆ మేర అదనంగా రివర్స్ చేయాలి. ఎందుకంటే తాను చేయవలసిన రివర్స్ కంటే తక్కువ చేసినట్లు. ఒకవేళ ఈ విలువ కంటే నెలవారీ రివర్స్ చేసిన మొత్తం ఎక్కువ ఉంటే, తాను రివర్స్ చేయాల్సిన దాని కంటే ఎక్కువ చేసినట్లుగా భావించి ఆ మేర క్రెడిట్‌ను తదుపరి నెల జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లో తీసుకోవచ్చు. ఇలా అదనంగా రివర్స్ చేయటం లేదా పొందటమనేది ఆ ఆర్థిక సంవత్సరం తదుపరి వచ్చే సెప్టెంబరు నెల జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ దాఖలు చేయాల్సిన గడువు తేదీ లోపు అంటే అక్టోబరు 20 లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది.

అంటే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గడువు తేదీ 2024 అక్టోబరు 20. కానీ ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే, క్రెడిట్ రివర్స్ చేయాల్సిన సందర్భంలో ఏప్రిల్ 1 నుంచి క్రెడిట్ రివర్స్ చేసినంత వరకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే మార్చి 31 వరకు ఈ లెక్కలు పూర్తి చేసి క్రెడిట్ రివర్స్ చేస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. లేకుంటే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఏది ఏమైనా క్రెడిట్ రివర్స్ చేయాల్సిన సందర్భంలో ఆ మొత్తాన్ని గడువు లోపల కచ్చితంగా చెల్లించాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు

ముంబై x ఢిల్లీ	మ.3.30 నుంచి
లఖ్‌నవూ x గుజరాత్	రాత్రి 7.30 నుంచి

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	చాహల్ (రాజస్థాన్)
316 పరుగులు	8 వికెట్లు




రాజస్థాన్ జోష్

బట్లర్ అజేయ శతకం

వరుసగా నాలుగో విజయంతో టాప్‌లోకి

● బెంగళూరు ఓటమి ● విరాట్ సెంచరీ వృథా



జోష్ బట్లర్ (58 బంతుల్లో 100 నాటౌట్)

2 ఐపీఎల్‌లో ఎక్కువ సెంచరీలు (6) చేసిన రెండో బ్యాటర్‌గా గేల్‌తో సమంగా నిలిచిన బట్లర్. విరాట్ (8) అగ్రస్థానంలో ఉన్నాడు.

1 ఐపీఎల్‌లో ఏ వికెట్‌కైనా ఎక్కువ సార్లు (10) 100+ భాగస్వామ్యాలు నమోదు చేసిన జోడీగా విరాట్-డుప్లెసి.

జైపూర్: ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో అదరగొడుతూ ప్రత్యర్థి జట్లకు గుబులుపుట్టిస్తోంది. కెరీర్‌లో వందో లీగ్ మ్యాచ్ ఆడిన ఓపెనర్ జోష్ బట్లర్ (58 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 100 నాటౌట్) అజేయ శతకంతో ఎట్టకేలకు సత్తా చాటుకున్నాడు. ఫలితంగా రాజస్థాన్ 6 వికెట్లతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై నెగ్గింది. 8 పాయింట్లతో శాంసన్ సేన టేబుల్ టాపర్‌గా ఉంది. రాజస్థాన్‌కిది వరుసగా నాలుగో గెలుపుకాగా.. ఆర్‌సీబీకి ఐదు మ్యాచ్‌ల్లో నాలుగో ఓటమి. విరాట్ కోహ్లీ (72 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 113 నాటౌట్) సైతం శతకం సాధించినా ఆర్‌సీబీకి ఫలితాన్నివ్వలేకపోయింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఆర్‌సీబీ 20 ఓవర్లలో 3 వికెట్లకు 183 పరుగులు చేసింది. డుప్లెసి (33 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 44) రాణించాడు. ఛేదనలో రాజస్థాన్ 19.1 ఓవర్లలో 4 వికెట్లకు 189 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ సంజూ శాంసన్ (42 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 69) అర్ధసెంచరీ సాధించాడు. టోప్లేకు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా బట్లర్ నిలిచాడు.

బట్లర్, శాంసన్ అదుర్స్: ఛేదనలో నిదానంగా ఆరంభమైన రాజస్థాన్ ఇన్నింగ్స్ బట్లర్, శాంసన్‌ల బాదుడుకు జోరందుకుంది. అటు ఆర్‌సీబీ బౌలర్లు ఎప్పటిలాగే నిరాశపరిచారు. టోప్లే ఒక్కడే ఆకట్టుకోగలిగాడు. ఓపెనర్ జైస్వాల్ (0) ఈ సీజన్‌లో పేలవ ఫామ్‌ను మరోసారి కొనసాగించగా, తొలి ఐదు ఓవర్లు ముగిసేసరికి రాజస్థాన్ స్కోరు 34/1 మాత్రమే. అయితే తన చివరి ఆరు ఇన్నింగ్స్‌లో 35 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచిన ఇంగ్లండ్ స్టార్ బట్లర్ ఎట్టకేలకు ఫామ్‌ను అందుకున్నాడు. ఆరో ఓవర్‌లో అతడు 4,4,6,4తో 20 రన్స్ రాబట్టడంతో పవర్‌ప్లేను జట్టు 54 పరుగులతో ముగించింది. తర్వాత మధ్య ఓవర్లలోనూ వేగాన్ని తగ్గించకుండా బట్లర్, శాంసన్ దీటుగా పరుగుల వరద పారించారు. ఈ ఇద్దరూ చకచకా బౌండరీలతో రన్‌రేట్ తగ్గకుండా చూశారు. 30 బంతుల్లోనే బట్లర్ ఫిఫ్టీ పూర్తి చేయగా, 11వ ఓవర్‌లో శాంసన్ 4,6,4తో 33 బంతుల్లో ఈ ఫీట్ సాధించాడు. అయితే 15వ ఓవర్‌లో శాంసన్ వికెట్ తీసిన సిరాజ్ రెండో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యానికి తెర దించాడు. తర్వాతి రెండు ఓవర్లలో రియాన్ పరాగ్ (4)ను యష్ దయాళ్, ధ్రువ్ జురెల్ (2)ను టోప్లే అవుట్ చేశారు. అప్పటికి జట్టు గెలుపునకు 18 బంతుల్లో 14 రన్స్ అవసరమవగా, హెట్‌మయెర్ (11 నాటౌట్)తో కలిసి బట్లర్ మ్యాచ్‌ను ముగించాడు. అయితే ఆఖరి ఓవర్‌లో గెలుపునకు ఒక్క పరుగు అవసరం కాగా, బట్లర్ 94 పరుగుల వద్ద ఉన్నాడు. దీంతో అతడు తొలి బంతినే సిక్సర్‌గా మలిచి సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం.



విరాట్ కోహ్లీ (72 బంతుల్లో 113 నాటౌట్)

1 ఐపీఎల్‌లో అత్యధిక (8) శతకాలు బాదిన బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ. ఐపీఎల్‌లో నెమ్మదైన (67 బంతుల్లో) శతకం సాధించిన బ్యాటర్‌గా మనీశ్ పాండేతో సమంగా నిలిచిన కోహ్లీ.

కోహ్లీ ఒక్కడై: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ విరాట్ కోహ్లీ అంతా తానై తుది కంటా నిలిచాడు. ఈ క్రమంలో మరో ఓపెనర్ డుప్లెసితో కలిసి తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. అలాగే ఈ సీజన్‌లో బెంగళూరు జట్టు తొలిసారి వికెట్ కోల్పోకుండా పవర్‌ప్లేను ముగించగలిగింది. అయితే మధ్య ఓవర్లలో అంత వేగం కనిపించలేదు. తొలి ఓవర్‌లోనే వికెట్ తీసే అలవాటున్న పేసర్ బౌల్ట్ ఈసారి తేలిపోయాడు. ఫామ్‌లో లేని డుప్లెసి ఆరంభంలో నిలదొక్కుకునే ప్రయత్నం చేయగా, విరాట్ వేగం కనబర్చడంతో పవర్‌ప్లేలో జట్టు 53 పరుగులు సాధించింది. ఆ తర్వాత స్పిన్నర్లు అశ్విన్, చాహల్ పరుగులను కట్టడి చేశారు. కానీ బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ 9వ ఓవర్‌లో డుప్లెసి రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించాడు. అటు చాహల్, రియాన్ ఓవర్లలో ఒక్కో సిక్సర్‌తో విరాట్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. స్కోరు నెమ్మదించడంతో వేగంగా ఆడే యత్నంలో డుప్లెసి 14వ ఓవర్‌లో చాహల్‌కు దొరికిపోయాడు. దీంతో తొలి వికెట్‌కు 125 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. హిట్టింగ్ కోసం మ్యాక్స్‌వెల్ (1), సౌరవ్ చౌహాన్ (9)లను ముందే పంపినా ఫలితం లేకపోయింది. ఈ సమయంలో ఆర్‌సీబీకి కావాల్సిన జోష్‌ను 16వ ఓవర్‌లో కోహ్లీ మూడు ఫోర్లతో అందించాడు. అటు 19వ ఓవర్‌లో బర్గర్ నాలుగు పరుగులే ఇవ్వగా.. విరాట్ ఓ సింగిల్‌తో 67 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. చివరి ఓవర్‌లో కోహ్లీ మూడు ఫోర్లు బాది 14 రన్స్ రాబట్టడంతో జట్టు స్కోరు 180 దాటింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	4	4	0	0	8	1.120
కోల్‌కతా	3	3	0	0	6	2.518
చెన్నై	4	2	2	0	4	0.517
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
హైదరాబాద్	4	2	2	0	4	0.409
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	4	2	2	0	4	-0.580
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	4	1	3	0	2	-1.347
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్



శాంసన్ (69)

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (నాటౌట్) 113, డుప్లెసి (సి) బట్లర్ (బి) చాహల్ 44, మ్యాక్స్‌వెల్ (బి) బర్గర్ 1, సౌరవ్ చౌహాన్ (సి) జైస్వాల్ (బి) చాహల్ 9, గ్రీన్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 183/3; వికెట్ల పతనం:** 1-125, 2-128, 3-155; **బౌలింగ్:** బౌల్ట్ 3-0-30-0, బర్గర్ 4-0-33-1, అశ్విన్ 4-0-28-0, అవేశ్ 4-0-46-0, చాహల్ 4-0-34-2, రియాన్ 1-0-10-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) టోప్లే 0, జోష్ బట్లర్ (నాటౌట్) 100, సంజూ శాంసన్ (సి) యశ్ (బి) సిరాజ్ 69, రియాన్ పరాగ్ (సి) కోహ్లీ (బి) యష్ 4, జురెల్ (సి) కార్తీక్ (బి) టోప్లే 2, హెట్‌మయెర్ (నాటౌట్) 11, **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 19.1 ఓవర్లలో 189/4; వికెట్ల పతనం:** 1-0, 2-148, 3-155, 4-164; **బౌలింగ్:** టోప్లే 4-0-27-2, యశ్ దయాల్ 4-0-37-1, సిరాజ్ 4-0-35-1, దాగర్ 2-0-34-0, గ్రీన్ 3.1-0-27-0, హిమాన్షు 2-0-29-0.

ప్రతి సిక్స్‌కు.. ఆరు ఇళ్లకు సోలార్ కరెంట్

రాజస్థాన్ మహిళల సాధికారిత కోసం రాజస్థాన్ రాయల్స్ జట్టు తమవంతు సహకారం అందించనుంది. 'పింక్ ప్రామిస్'గా శనివారం బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో ఇరుజట్ల నుంచి నమోదైన ప్రతి సిక్స్‌కు.. ఆరు గృహాల చొప్పున సోలార్ కరెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని రాయల్స్ యాజమాన్యం ప్రకటించింది. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో అమ్ముడైన ప్రతి టికెట్‌కు రూ. 100 చొప్పున స్వచ్ఛంద సంస్థకు అందజేస్తామంది. కాగా, ఈ మ్యాచ్‌లో మొత్తం 13 సిక్స్‌లు నమోదయ్యాయి.

కజకిస్థాన్ చాలెంజ్ విజేత తరుణ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కజకిస్థాన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ యువ షట్లర్ మన్నెపల్లి తరుణ్ సింగిల్స్ చాంపియన్‌గా నిలిచాడు. శనివారం కజకిస్థాన్‌లోని అస్తానాలో జరిగిన ఫైనల్లో తరుణ్ 21-10, 21-19తో సూంగ్ జో వెన్ (మలేసియా)పై గెలిచి ట్రోఫీ అందుకున్నాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను భారత్‌కే చెందిన అనుపమ ఉపాధ్యాయ దక్కించుకుంది.

ఏఐటీఏ రన్నరప్‌గా సంజన



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏఐటీఏ మహిళల టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి సంజన సిరిమల్ల సింగిల్స్ రన్నరప్‌గా నిలిచింది. శామీర్‌పేట్‌లో శనివారం జరిగిన ఫైనల్లో వడదెబ్బ కారణంగా సంజన మ్యాచ్ మధ్యలోనే వైదొలగింది. దీంతో ప్రత్యర్థి నికోల్ (తమిళనాడు)ను విజేతగా నిలిచింది.

సుమిత్ శుభారంభం

మోంటే కార్లో (ఫ్రాన్స్): భారత ఏస్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ మోంటే కార్లో మాస్టర్స్‌లో శుభారంభం చేశాడు. శనివారం జరిగిన క్వాలిఫయర్స్‌లో సుమిత్ 6-2, 6-3తో ప్రపంచ 63వ ర్యాంకర్ ఫ్లావియో కొబోలి (ఇటలీ)పై గెలుపొందాడు.


నకామురాకు విదిత్ షాక్

హంపికి డ్రా — క్యాండిడేట్స్ చెస్

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ రెండో రౌండ్‌లో వరల్డ్ నెం.3 నకామురా (అమెరికా)కు భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజ్‌రాతీ షాకిచ్చాడు. నల్లపావులతో తలపడిన విదిత్ కేవలం 29 ఎత్తుల్లో ప్రత్యర్థిని చిత్తు చేశాడు. ఇద్దరు భారత గ్రాండ్‌మాస్టర్లు తలపడిన మరో రెండో రౌండ్‌లో గుకేష్ 33 ఎత్తుల్లో ప్రజ్ఞానందపై గెలుపొందాడు. నెపోమ్నియాచి-అలిరెజాను, టాప్‌సీడ్ కరువానా-అబసోవ్‌ను ఓడించారు. రెండో రౌండ్ ముగిసేసరికి విదిత్, గుకేష్, కరువానా, నెపోమ్నియాచి తలా 1.5 పాయింట్లతో అగ్ర స్థానంలో కొనసాగుతున్నారు. ఇక, మహిళల విభాగంలో తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపికి రెండో రౌండ్‌లోనూ డ్రా ఎదురైంది. క్యాథరినా లగ్నో (రష్యా)తో గేమ్‌లో హంపి 38 ఎత్తుల అనంతరం డ్రాకు అంగీకరించింది. సలిమోవా-లీ టింగ్ జీ గేమ్ కూడా ఫలితం తేలకుండా ముగిసింది. గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలీ-టాన్ జోంగ్యీ చేతిలో పోరాడి ఓడింది. వరుసగా రెండో విజయంతో టాన్ (2 పాయింట్లు) టాప్‌లో కొనసాగుతోంది. మరో ఇద్దరితో కలిసి హంపి (1) మూడో స్థానంలో నిలిచింది. వైశాలీ (0.5) ఆరో స్థానంలో కొనసాగుతోంది.

రాళ్లను మోస్తూ.. పర్వతాలు ఎక్కుతూ

ఆర్మీ పర్యవేక్షణలో పాక్ జట్టు సాధన



కరాచీ: టీ20 వరల్డ్ కప్‌లో సత్తా చాటేందుకు పాకిస్థాన్ క్రికెట్ జట్టు అత్యంత తీవ్రంగా శ్రమిస్తోంది. ముఖ్యంగా ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యమిస్తూ కొండలు, గుట్టలు ఎక్కుతోంది. అబోటాబాద్‌లోని ఆర్మీ ఫిజికల్ ట్రైనింగ్ స్కూల్ అధికారుల పర్యవేక్షణలో 29 మందితో కూడిన పాక్ జట్టు కఠోర శిక్షణ తీసుకొంటోంది. ఈక్రమంలో పెద్ద రాళ్లను మోస్తూ.. రాళ్లతో నిండిన పర్వతాన్ని ఎక్కుతున్న వీడియోను ఆల్‌రౌండర్ ఇఫ్తికార్ అహ్మద్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. రిజ్వాన్, నసీమ్ షా కూడా రాళ్లను మోస్తూ, పర్వతం ఎక్కారు. రెండు వారాల ఈ శిక్షణ సోమవారంతో ముగియనుంది. ప్రపంచ కప్ జూన్‌లో అమెరికా/వెస్టిండీస్‌లో జరగనుంది.

విరాట్ కటింగ్‌కు రూ. లక్షపైనే!



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీకి ఆటగాడిగానే కాదు.. ఫ్యాషన్ ఐకాన్‌గానూ యూత్‌లో ఎంతో క్రేజ్ ఉంది. అతడి డ్రెస్సింగ్‌తోపాటు హెయిర్ స్టైల్స్‌కు ఫాలోయర్లు ఎక్కువే. ప్రతి ఐపీఎల్‌కు సరికొత్త హెయిల్ స్టైల్‌తో బరిలోకి దిగే కోహ్లీ.. ఈసారి కూడా అదే ట్రెండ్‌ను అనుసరించాడు. అయితే, ఇలాంటి స్టైల్ చేయడాన్నిట ప్రముఖ హెయిర్ డ్రెస్సర్ అలీమ్ హకీమ్ ఎంత చార్జ్ చేశాడో తెలిస్తే.. నోరెళ్లబెట్టాల్సిందే. కోహ్లీ హెయిర్ స్టైల్ కోసం ఎంత తీసుకొన్నాడో అతడు సూటిగా చెప్పలేదు. కానీ, తన చార్జ్ కనీసం రూ. లక్ష నుంచి ఉంటుందని చెప్పాడు. ధోనీ కూడా హకీమ్ ఖాతాదారుడే.

జగన్ కొనసాగితే ఉద్యోగులకు తిప్పలే

- ఇప్పటికే సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ నాశనమైపోయింది
- ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా అవన్నీ చెల్లిస్తాం
- ప్రతినెలా 1నే జీతాలు పడేలా చర్యలు తీసుకుంటాం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీలు



తాడేపల్లిలోని అపార్టుమెంట్ వాసులతో లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 6: 'జగన్ ఇంకా అధికారంలో కొనసాగితే ఉద్యోగులకు తిప్పలు తప్పవు. ఇప్పటికే సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ నాశనమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25వేల కోట్ల మేర బకాయిలు పెట్టారు. ఇదిలాగే కొనసాగితే ఉద్యోగుల భవిష్యత్తు ఏమవుతుందో" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పూర్ణిమా అపార్టుమెంట్ వాసులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తనకు తెలుసని చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం బకాయిలను ఏడాదిలోగా చెల్లిస్తామని, గతంలో మాదిరి ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అడ్డగోలు సంపాదనపైనే శ్రద్ధ

సీఎం జగన్, ఆయన మంత్రివర్గ సహచరులకు అడ్డగోలు సంపాదనపై తప్ప రాష్ట్ర అభివృద్ధిపై ఎలాంటి శ్రద్ధ లేదని లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలు ఎప్పుడు తెస్తారని అడిగితే కోడిగుడ్డు కథలు చెబుతున్నారని, ఇటువంటి పనికిమాలిన మంత్రులుంటే రాష్ట్రానికి పరిశ్రమలు ఎలా వస్తాయని ఆయన ఎద్దేవా చేశారు. చంద్రబాబు దూరదృష్టిని, విజన్‌ను కొందరు పనిగట్టుకుని విమర్శిస్తుంటారని చెబుతూ గతంలో 5వేల ఎకరాల్లో శంషాబాద్ విమానాశ్రయం కడతానంటే అంత భూమి ఎందుకన్నారని ప్రశ్నించిన వారు చాలమంది ఉన్నారని గుర్తుచేశారు. జగన్ ఐదేళ్లలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచినా కరెంటు కోతలు మాత్రం తప్పడం లేదంటూ హేళన చేశారు(సరిగ్గా ఇదే సమయంలో కరెంటు పోవడంతో అపార్టుమెంట్‌వాసుల నుంచి మంచి స్పందన కనిపించింది). టీడీపీ హయాంలో ఒక్కసారి కూడా చార్జీలు పెంచకుండా నిరంతర విద్యుత్‌ను అందజేశామని చెప్పారు. కనీసం కరెంటు కూడా ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వాన్ని చూసి ఏ పరిశ్రమలైనా ఎందుకొస్తాయని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక టెస్లా వంటి ప్రఖ్యాత కంపెనీలను రాష్ట్రానికి రప్పించి యువతకు ఉద్యోగ కల్పన చేసి తీరుతామని చెప్పారు. దక్షిణాఫ్రికాను ఆదర్శంగా తీసుకుని 3 ముక్కలాటతో రాష్ట్రానికి జగన్ అన్యాయం చేశారని అన్నారు.





పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు సభలో మాట్లాడుతున్న చంద్రబాబు, హాజరైన జనం



కూటమి జెండాల కోలాహలం..

- వ్యక్తులు శాశ్వతం కాదు. చేసిన పనులు శాశ్వతం. అమరావతి పూర్తయి ఉంటే ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల ఆస్తి, ఆదాయం వచ్చి ఉండేవి. జగన్ వచ్చి ధ్వంసం చేశాడు.
- నా కొడుక్కి ఆంధ్రప్రదేశ్, కూతురుకు తెలంగాణ రాసిచ్చానని చెప్పిన ఆ తల్లి ఇప్పుడు కొడుకు, కూతురుకు బొట్లు పెట్టి ఈ రాష్ట్రంలో ఎన్నికల బరిలోకి పంపిస్తోంది. ఇద్దరికీ న్యాయం చేయలేని తల్లి 5 కోట్ల మందికి ఏం న్యాయం చేస్తుందో చెప్పాలి.
- నేను ఒంటరిగా రాలేదు. ఒకవైపు జనసేన, జనసైనికులు.. మరోవైపు బీజేపీ తోడు నిలిచాయి. ఓటు చీలనివ్వనని చెప్పిన ఏకైక నాయకుడు పవన్. చివరి వరకూ అదే మాటకు కట్టుబడి కూటమిని నిలబెట్టారు.

\- చంద్రబాబు

భవన నిర్మాణ కార్మికులకు మాదీ భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం కావాలని పిలుపిచ్చారు. తామొచ్చాక ఇసుకను గతంలో మాదిరిగా ఉచితంగా ఇస్తామని.. నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై ఆయన కుమార్తె పోరాటానికి అండగా నిలిచామని.. కానీ ఆమె ఇప్పుడు షర్మిలకు, కాంగ్రెస్‌కు ఓటేయాలని ప్రచారం చేస్తోందని, ఇది రాష్ట్ర ప్రజలకు చేటు తెస్తుందని స్పష్టం చేశారు. ప్రజాగళం యాత్రలో భాగంగా శనివారం సాయంత్రం ఆయన పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని క్రోసూరులో, రాత్రికి సత్తెనపల్లిలో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. 'ఒక తల్లి, ఒక కొడుకు, ఒక కూతురు రాష్ట్రంలో డ్రామాలు చేస్తున్నారు. వైసీపీ వ్యతిరేక ఓట్లు చీల్చడానికే తల్లి కాంగ్రెస్ నాటకాలాడుతోంది. పిల్ల కాంగ్రెస్‌తో కలిసి డ్రామాలు రక్తి కట్టిస్తోంది. వైసీపీ వ్యతిరేక ఓట్లు టీడీపీ కూటమికి పడకుండా.. చెల్లి షర్మిల తల్లి కాంగ్రెస్ ద్వారా ఓట్లు చీల్చాలనుకుంటోంది. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనివ్వనన్న జనసేనాని పవన్ కల్యాణ్ మాటలకు తూట్లు పొడిచి వైసీపీకి సహాయం చేయడమే! వివేకా చనిపోయినప్పుడు తక్షణమే నేను స్పందించాను. అన్నా చెల్లెళ్ల మధ్య కుటుంబ సమస్య ఉంటే అది కుటుంబంలోనే తేల్చుకోవాలి. అలాకాకుండా ఇలా రాజకీయాల పేరుతో ఐదుకోట్ల మంది జీవితాలను రోడ్లమీదకు ఈడ్చడం సరికాదు. ప్రజలందరూ ఒక్కసారి ఆలోచన చేయాలి. ఈరోజు నుంచి ఇదే అంశాన్ని ఎజెండాగా జనంలోకి తీసుకెళ్తాం' అని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

అమరావతిపై విషం కక్కాడు..

జగన్ విషం గక్కి, అందరినీ ఆ విషంతో చంపే రకం. నేను ప్రతిదీ దీర్ఘకాల దృష్టితో ఆలోచిస్తా. సైబరాబాద్ స్ఫూర్తితో అమరావతిని నిర్మించాలనుకున్నాను. రైతులు కూడా భూములిచ్చారు. అదే రాజధానిగా కొనసాగి ఉంటే దర్జాగా ఇక్కడే ఉద్యోగాలు వచ్చేవి. జగన్ నాశనం చేశాడు. కులాలు, మతాలు, అవినీతి పేరు చెప్పి చంపేశాడు. పెదకూరపాడు అంటే ఇప్పుడు ఇసుక బకాసురుడు శంకరరావు(ఎమ్మెల్యే), ఆయన ఇసుక దోపిడీ గుర్తుకొస్తున్నాయి. ఏకంగా కృష్ణానది మీదే రోడ్డువేసి ఇసుక దోపిడీ చేశారు. రాష్ట్రం దశ దిశ మార్చే ఎన్నికలివి. ప్రజల ఆవేశం తుఫానుగా మారి.. అందులో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం. కురుక్షేత్ర యుద్ధం ప్రారంభమైంది. కౌరవుల లాంటి వైసీపీ నేతల వధ తప్పదు. అహంకార దుర్యోధనుడిలా జగన్ వ్యవహరిస్తున్నాడు.

ఏప్రిల్ నుంచే 4 వేలు..

నాది విజన్.. జగన్‌రెడ్డిది పాయిజన్. జగన్ విషం గక్కి అందరినీ విషంతో చంపే రకం. అందుకే పింఛన్లపై రాజకీయాలు చేశాడు. లక్షా 30 వేల మంది సచివాలయ ఉద్యోగులను ఇళ్లకు పంపి ఒక్కరోజులో పింఛన్లు ఇప్పించలేకపోయాడు. జగన్.. నీకు చేతగాకపోతే రాజీనామా చెయ్. పెద్దకొడుకుగా నేను చేసి చూపిస్తా! రూ.200 ఉండే పింఛన్‌ను 2 వేలు చేశా. ఇప్పుడు 4 వేలకు పెంచుతా.. ఏప్రిల్ నుంచే అమలు చేస్తా. అధికారం చేపట్టిన వెంటనే ఏప్రిల్, మే, జూన్ నెలలకు పెంచిన పింఛన్ ఇస్తా. రాష్ట్రంలో ఏ రైతైనా ఆనందంగా ఉన్నాడా? నాసిరకం విత్తనాలతో నాశనమైపోతున్నాడు. పొలాలకు నీళ్లందని దుస్థితి ఏర్పడింది. కృష్ణా-గోదావరి అనుసంధానంతో నాగార్జున సాగర్ కుడికాలువ, అక్కడ నుంచి రాయలసీమకు నీరిచ్చేందుకు ప్రణాళిక వేశాను. అది జగన్ పుణ్యాన నాశనమైంది. పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తి చేశా. అదీ నాశనం చేశాడు. మీ అందరి కంటే యువకుడిని నేను! నా ఆలోచనలు 20 ఏళ్ల ముందుంటాయి. రాబోయే రోజుల్లో తెలుగుగడ్డమీద పుట్టినవాళ్లు ప్రపంచంలో అగ్రస్థానంలో నిలుస్తారు. ఏటా 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తా. మెగా డీఎస్సీ నిర్వహిస్తా. జాబ్ కేలెండర్ విడుదల చేస్తా! ఉద్యోగాలు వచ్చేవరకూ రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తా. పెదకూరపాడుకు ఐటీ పార్కు తెస్తా. అందుకోసం నేను కోరేది.. 30 రోజులు సైకిలెక్కి, టీడీపీ, బీజేపీ, జనసేన జెండాలు సైకిల్‌కు కట్టుకుని, గాజుగ్లాసు చేతబట్టుకుని ప్రచారం చేయడమే! బటన్ నొక్కితే గాజు గ్లాసు జగన్ గుండెల్లో గుచ్చుకోవాలి.

ఇదేనా ముస్లింలకు రక్షణ?

రాష్ట్రంలో ఏ ఒక్కరికీ రక్షణ లేదు. మహిళలకైతే అసలు లేదు. నందికొట్కూరులో ముస్లిం మహిళ బురఖా వేసుకుని నమాజ్‌కు వెళ్లి వస్తుంటే ఒక వైసీపీ దొంగ ఆమె బురఖాను బలవంతగా తీసి దొంగ అని మాట్లాడాడు. ఇదే మన తల్లికో, చెల్లికో జరిగితే ఎలా స్పందిస్తామో చెప్పండి. మాచర్ల నియోజకవర్గానికి చెందిన 100 కుటుంబాలు ఎన్నికల కోడ్ వచ్చాకగాని ఇంటికి రాలేకపోయారు. నా పాలనలో ఎప్పుడైనా ఇలాంటి ఘటన జరిగిందా? కేంద్రంలో పదేళ్లుగా ఉన్న ఎన్డీయే ప్రభుత్వమే మళ్లీ రాబోతోంది. ప్రజల భవిష్యత్ కోసమే ఎన్డీయేతో కలిశాం. మైనారిటీలకు అన్యాయం జరగనివ్వను.

అంబోతు రాంబాబును చిత్తుగా ఓడించండి

ఇక్కడ ఉన్న మంత్రి రంకెల రాంబాబా.. అంబోతు రాంబాబా? ఈయనకు మంత్రి పదవి అంటే ఏమిటో తెలుసా? సత్తెనపల్లి నియోజకవర్గంలో ఏమైనా అభివృద్ధి చేశాడా? ఇరిగేషన్ మంత్రి కదా.. క్యూసెక్కు, టీఎంసీ అంటే ఏంటో తెలుసా? కనీసం సత్తెనపల్లిలో కాలువల్లో పూడిక తీయించాడా? ఆయనకు పదవి ఇచ్చింది నన్ను, పవన్ కల్యాణ్‌ను తిట్టడానికే. మంత్రిగా ఉండి సంక్రాంతి సంబరాల్లో డాన్సులు వేశారు. పోలవరం పోయి వేస్తే అందరం సంతోషించే వాళ్లం. అక్రమ మైనింగ్ చేస్తున్నారని వైసీపీ కార్యకర్తలే ఆయనపై కోర్టుకు వెళ్లారు. ఆయన్ను చిత్తు చిత్తుగా ఓడించి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలి. ఎన్నికల్లో గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజలు బాగా ఆలోచించి ఓటు వేయాలి. అమరావతి రాజధాని వస్తే సంపద సృష్టి జరిగి ఉద్యోగాలు, ఉపాధి వస్తుంది.



సత్తెనపల్లి సభలో వైసీపీ ఎమ్మెల్సీ జంగాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

టీడీపీలోకి ఎమ్మెల్సీ జంగా

పల్నాడు జిల్లాలో పాలకపక్షం వైసీపీకి గట్టి షాకే తగిలింది. గురజాల నియోజవర్గానికి చెందిన ఆ పార్టీ ఎమ్మెల్సీ, సీనియర్ బీసీ నేత జంగా కృష్ణమూర్తి తన అనుచరులతో సత్తెనపల్లి ప్రజాగళం సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. అంతకుముందు క్రోసూరు సభలో బంగారు వ్యాపారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నరసరావుపేటకు చెందిన వైసీపీ ముఖ్య నేత కపిలవాయి విజయ్‌కుమార్, న్యాయవాది చిన్నపరెడ్డి కూడా టీడీపీలో చేరారు. వీరికి చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా.. క్రోసూరు సభలో చంద్రబాబు మాట్లాడుతుండగా.. రంజాన్ నమాజ్ సమయం కావడంతో తన ప్రసంగాన్ని నిలిపివేసి నమాజ్ చేశారు.

వృద్ధుల మృతిపై మాట మార్చిన వైసీపీ

- వారంతా ప్రమాదవశాత్తూ చనిపోయారు
- పెన్షన్లు కారణం కాదు: సజ్జల రామకృష్ణారెడ్డి

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): పింఛన్ల కోసం వెళ్లిన వృద్ధులు మృతి చెందడానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్ కారణమంటూ గడచిన రెండు రోజులుగా చేస్తున్న ఆరోపణలపై వైసీపీ మాట మార్చింది. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో పాల్గొంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా పింఛన్లు అందకపోవడం వల్ల 29 మంది వృద్ధులు చనిపోయారని, ఇందుకు చంద్రబాబే కారణమంటూ ఆరోపిస్తూ వచ్చారు. పింఛన్లు సకాలంలో అందకపోవడానికి కారణం చంద్రబాబేనంటూ రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లతో వైసీపీ విష ప్రచారం చేయించింది. కానీ పింఛన్ల పంపిణీని ప్రారంభించిన రెండు రోజులకే దాదాపు అందరికీ అందిపోవడంతో ఇక ఈ వ్యవహారాన్ని ముందుకు తీసుకువెళ్లడం అసలుకే ముప్పుగా మారనుందని వైసీపీ గ్రహించింది. దీనికితోడు వృద్ధుల మృతికి వైసీపీ నేతలే కారణమంటూ ఆధారాలతో కేంద్ర ఎన్నికల సంఘానికి చంద్రబాబు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. దీంతో వైసీపీలో అంతర్మథనం మొదలైంది. శనివారంనాడు వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ 'దురదృష్టవశాత్తూ వృద్ధులు ప్రమాదం కారణంగా మృతి చెందారంటూ' మాట మార్చారు.

తంబళ్లపల్లె బీజేపీ అభ్యర్థిపై తర్జనభర్జన

- ఆడిటర్ మధుసూదన్‌రెడ్డి వైపు మొగ్గు?
- రఘురామరాజు కోసం 'ఉండి' రామరాజుతో బాబు చర్చలు

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అనపర్తి, తంబళ్లపల్లె సీట్లను టీడీపీ, బీజేపీ పరస్పరం మార్చుకోవడం ఖరారైంది. టీడీపీ అధినేత చంద్రబాబు తమ పార్టీ ముఖ్యుల వద్ద దీనిని ధ్రువీకరించారు. తాజా నిర్ణయం ప్రకారం అనపర్తి సీటును టీడీపీ తీసుకుంటుండగా.. తంబళ్లపల్లె సీటును బీజేపీ తీసుకొంటోంది. అనపర్తిలో టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి పోటీచేయనున్నారు. తంబళ్లపల్లెలో బీజేపీ అభ్యర్థిపై ఇంకా తర్జనభర్జనలు జరుగుతున్నాయి. పార్టీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి, ఆడిటర్ మధుసూదన్‌రెడ్డి పేర్లు ఆ పార్టీ పరిశీలనలో ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి సీటుపై చర్చల ప్రక్రియను టీడీపీ అధిష్ఠానం ప్రారంభించింది. అక్కడ సిటింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుతో చంద్రబాబు శనివారం ఒక విడత మాట్లాడారు. ఆయనకు నచ్చజెప్పి ఆ సీటును సిటింగ్ ఎంపీ రఘురామరాజుకు ఇవ్వాలన్న యోచనలో టీడీపీ నాయకత్వం ఉంది.

కూటమి మేనిఫెస్టోకు రూపు

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సంయుక్త మేనిఫెస్టో వచ్చే వారంలో విడుదలయ్యే అవకాశముంది. రాజమహేంద్రవరం మహానాడు సందర్భంగా తమ పార్టీ వరకూ కొన్ని హామీలను టీడీపీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత జనసేన, బీజేపీ జతకలిశాయి. దీంతో మూడు పార్టీలు కలిసి సంయుక్త మేనిఫెస్టోను విడుదల చేయాలని నిర్ణయించాయి. ఆ పార్టీల ప్రతిపాదనలు ఇప్పటికే టీడీపీకి చేరాయి. మేనిఫెస్టో రూపకల్పన కోసం ఏర్పాటైన టీడీపీ కమిటీ శుక్ర, శనివారాల్లో సమావేశాలు నిర్వహించింది. మిత్రపక్షాల ప్రతిపాదనలతోపాటు ప్రజా సంఘాలు, పార్టీ నేతలు, వివిధ వర్గాల నుంచి తమకు అందిన సూచనలు, సిఫారసులపైనా ఈ సందర్భంగా చర్చించారు. ఈ మొత్తం ప్రతిపాదనలు 300కిపైగా ఉన్నాయి. అన్నీ కాకుండా ముఖ్యమైన వాటితో మాత్రమే మేనిఫెస్టో విడుదలచేయాలన్న ఆలోచనలో టీడీపీ నాయకత్వం ఉంది.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్

- ఎమ్మెల్యే కన్నబాబుతో కలసి ప్రచారం

సర్పవరం జంక్షన్/కొత్తపల్లి/వినుకొండ టౌన్, ఏప్రిల్ 6: కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గ్రామ సచివాలయం-2కు చెందిన వలంటీర్ మణికంఠ పాల్గొన్నారు. వైసీపీ మేనిఫెస్టో కరపత్రాలు పట్టుకుని ఎమ్మెల్యే వెంట తిరిగారు. ఇదిలాఉండగా, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన గ్రామ వలంటీర్ పి.నూకారెడ్డిని విధుల నుంచి తొలగించినట్టు కొత్తపల్లి ఎంపీడీవో పి.వెంకటనారాయణ తెలిపారు. కాగా, వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్ఎంయూ సీనియర్ నాయకుడు, కండక్టర్ ఆర్. శ్రీనుని సస్పెండ్ చేసినట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరరావు నాయక్ శనివారం తెలిపారు.





సభ నుంచి జనం వెళ్లిపోవడంతో పలుచబడ్డ దృశ్యం, కావలిలో జరిగిన 'మేము సిద్ధం' సభలో సీఎం జగన్ ప్రసంగిస్తుండగా గ్యాలరీ గేట్లు ఎక్కి వెళ్లిపోతున్న మహిళలు

తరలించినవారినే మళ్లీ మళ్లీ..

- సీఎం సభ ఎక్కడ జరిగినా వారే 'సిద్ధం'
- కావలి సభలో సీమ జనాలే ఎక్కువ

నెల్లూరు: ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కావలి సభను విజయవంతం చేయడానికి వైసీపీ సర్వశక్తులు ఒడ్డింది. తోలిన వారినే తిరిగి తిరిగి మళ్లీ కావలి సిద్ధం సభలకు తోలుకొచ్చింది. ఉదాహరణకు మేదరమిట్ల సిద్ధం సభకు నెల్లూరు జిల్లాలోని ప్రతి మండలం నుంచి జనాలను తరలించారు. ప్రత్యేకించి కందుకూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజలను మేదరమిట్ల సభకు తరలించారు. ఇప్పుడు మళ్లీ కావలి సభకు వారికే 170 ఆర్టీసీ బస్సులు, వందలాది ప్రైవేటు వాహనాల్లో తోలారు. అందుకు అవసరమైన ఆర్థిక భారాన్ని స్థానిక నాయకులపై మోపారు. నెల తిరగకముందే రెండు సార్లు సిద్ధం సభకు జనాలను తరలించాలంటే ఎంత ఖర్చు, ఎక్కడి నుంచి తేవాలి అనే ఆవేదన కందుకూరు వైసీపీ నాయకవర్గాల నుంచి వ్యక్తం అయ్యింది. దాదాపుగా చాలా జిల్లాల నాయకులకు ఇదేతరహా మోత మోగినట్లు తెలుస్తోంది. కావలి సభను సక్సెస్ చేయడానికి రాయలసీమ జిల్లా నుంచి కూడా జనాలను తరలించారు. రాయచోటి, పలమనేరు, చిత్తూరు జిల్లా నుంచి తెచ్చిన జనం ఎక్కువగా కనిపించారు. వీరంతా ఆయా జిల్లాల్లో సిద్ధం సభలకు హాజరైన వారే. చాలా మంది బస్సుల నుంచి కూడా కిందకు దిగలేదు. కాగా, నెల్లూరులోని చింతారెడ్డిపాలెం వద్ద ఉదయం 10 గంటలకు బస్సు యాత్ర ప్రారంభమైంది. కొవూరు, ఉలవపాడు మీదుగా సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో కావలి చేరుకుంది. అక్కడ సభలో పాల్గొన్న జగన్, రాత్రి బస కోసం జువ్విగుంట క్రాస్ వద్దకు చేరుకున్నారు.

వలంటీర్లతో సీఎం రహస్య భేటీ!

కావలి, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయం కోసం ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వలంటీర్లతో రహస్య సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. కావలి సమీపంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి చెందిన స్కూల్‌లో ఆయన మధ్యాహ్నం భోజన విరామం తీసుకున్నారు. ఈ సమయంలోనే వలంటీర్లతో జగన్ సమావేశమైనట్లు తెలుస్తోంది. సుమారు అరగంటసేపు వారితో మాట్లాడినట్లు సమాచారం. పథకాలు పొందిన లబ్ధిదారుల ఓట్లను ఎలాపొందాలనేది చర్చించినట్లు తెలుస్తోంది. సమావేశం అనంతరం వలంటీర్లకు భోజనం ఏర్పాటు చేసి తాయిలాలు కూడా అందించినట్లు సమాచారం. వలంటీర్లతో సీఎం రహస్యభేటీ కోడ్ ఉల్లంఘనకిందకే వస్తుందని, దీనిపై ఈసీ విచారణ జరపాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

58 నెలల్లో ప్రతి ఇంటికీ మేలు చేశాను

- అవినీతి, వివక్ష లేని పాలన అందించాను
- కావలి సభలో అవే అబద్ధాలు చెప్పిన జగన్

58 నెలల పాలనలో ఇంటింటికీ మంచి చేశామని, లంచాలు లేని, వివక్ష లేని పాలన అందించామంటూ సీఎం జగన్ మరోసారి అబద్ధాల దండకం వినిపించారు. నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన 'మేమంతా సిద్ధం' సభలో ఆయన పాల్గొన్నారు. "ప్రతి గ్రామంలో సచివాలయం, బడి, ఆసుపత్రి ఒకే చోట అందుబాటులో ఉండేలా చేశాం. ఎవరి వల్ల మేలు జరుగుతుందో లోతుగా ఆలోచించి ఓటు వేయండి" అంటూ వేడుకున్నారు. ఇవి ఎమ్మెల్యేలు, ఎంపీలను మాత్రమే ఎన్నుకునే ఎన్నికలు కావని, మూడు ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలకు సంబంధించిన ఎన్నికలన్నారు. 14ఏళ్లు సీఎంగా పనిచేశానని చెప్పుకొనే చంద్రబాబు ప్రజల గుండెల్లో నిలిచిపోయే పని ఒక్కటైనా చేశారా అని ప్రశ్నించి.. లేదు అని జనంతో అనిపించాలని ప్రయత్నించారు.

ఇలిలా.. ఇలిలా.. ఇలిలా..

చంద్రబాబు అది చేశారా, ఇది చేశారా అంటూ.. జనం నుంచి లేదు...లేదు అని చేతులు ఊపించుకోవాలని జగన్ పడిన తాపత్రయం ఫలించలేదు. ఇలిలా...ఇలిలా...అని జగన్ చేతులు ఊపి ఊపి సంజ్ఞలు చేసినా మొదటివరుసలోని కొంతమంది తప్ప ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'రాక తప్పలేదు కాబట్టి వచ్చాం. వినాలి కాబట్టి వింటున్నాం' అన్నట్లు నిర్లిప్తంగా ఉన్నారు. గతంలో లాగా జగన్ ప్రసంగానికి ఊగిపోవడం, హర్షధ్వానాలు చేయడం, దిక్కులు దద్దరిల్లేలా జయజయధ్వానాలు పలకడం లాంటి సన్నివేశాలు ఏవీ కావలి సిద్ధం సభలో కనిపించలేదు. జగన్ 'మీ బిడ్డ అడుగుతున్నాడు సిద్ధమా...సిద్ధమా' అని పదే పదే అనడమేగానీ సభికుల గొంతులు మాత్రం పెగల్లేదు.

జగన్: చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే పథకం ఒక్కటైనా ఉందా? ఇలిలా.. ఇలిలా రెండు చేతులు ఊపి లేదు అని చెప్పాలబ్బా.

జనం: జగన్ ముందు నిలబడిన కొందరు మినహా మిగిలిన వారి నుంచి నో రెస్పాన్స్.

జగన్: మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే అండగా నిలబడాలని మీ బిడ్డ అడుగుతున్నాడు.. సిద్ధమేనా!?

జనం: సైలెంట్ మోడ్.

జగన్: ఫ్యాన్‌కు రెండు ఓట్లు వేస్తేనే అభివృద్ధి జరుగుతుందని చెప్పండి.

జనం: నో రెస్పాన్స్

జగన్: చంద్రబాబు నీచ చరిత్రప్రజలకు వివరిస్తారా!?

జనం: నో రెస్పాన్స్

జగన్: ఈ కూటమి 2014లో ఇచ్చిన హామీలను నెరవేర్చిందా!? ఇలిలా.. ఇలిలా.. ఇలిలా.. లేదు అని రెండు చేతులెత్తి చూపాలబ్బా.

జనం: షరామామూలే. ముందు ఉన్న కొంది మంది తప్ప జనం నుంచి నో రెస్పాన్స్.

జగన్: పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేశారా..? రెండు చేతులూ పైకెత్తి ఇలిలా ఇలిలా చూపాలమ్మా.

బాబుకు వ్యతిరేకంగా జన స్పందనకు జగన్ పాట్లు

చేతులు ఎత్తి చూపినా, సంజ్ఞలు చేసినా నో రెస్పాన్స్

జనం: ఊహూ...నో రెస్పాన్స్

జగన్: ఆడబిడ్డపుట్టిన వెంటనే మహాలక్ష్మీ పథకం కింద 20,500 ఇస్తామన్నాడు చంద్రబాబు. ఇచ్చాడా..!!?

జనం: నో రెస్పాన్స్

జగన్: నిరుద్యోగ భృతి ఇచ్చాడా..!!?

జనం: నో రెస్పాన్స్.

జగన్: నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం, పక్కా ఇల్లు ఇచ్చాడా!?

జనం: రెస్పాన్స్ షరా మామూలే.

జగన్: ఈ చంద్రబాబు మాటలను నమ్ముతారా!? గట్టిగా రెండు చేతులు పైకెత్తి ఇలిలా.. ఇలిలా అనాలబ్బా.

జనం: నో రెస్పాన్స్.

మండుటెండలో ఏడిపించారు..!

ఆర్టీసీ బస్సులన్నీ సీఎం జగన్ సభలకే కేటాయింపు

- ప్రయాణికుల పడిగాపులు..



ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఒంగోలు(కార్పొరేషన్)/కనిగిరి, ఏప్రిల్ 6: ప్రజా రవాణా వ్యవస్థ వైసీపీ ప్రభుత్వ సొంత సంస్థలా మారింది. ప్రజల ఆదాయంపై నడిచే ఆర్టీసీ బస్సులు ఇప్పుడు వైసీపీ సభలకు నడుస్తున్నాయి. సీఎం జగన్ రాష్ట్రంలో ఎక్కడ సభ పెట్టినా 3వేల బస్సులు వెళ్లాల్సిందే అంటూ ఏకంగా రవాణాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం విస్తుగొలుపుతోంది. ఎన్నికల కోడ్ ముందు వరకూ అలాగే కేటాయించారు. కోడ్ రావడంతో ఈ సంఖ్యను 1,400కు కుదించారు. ఇంత పెద్దసంఖ్యలో బస్సులను జనసమీకరణకు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. శనివారం నెల్లూరు జిల్లా కావలిలో 'మేమంతా సిద్ధం' సభ నిర్వహించగా, ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా పొదిలిలో సభ జరుగనుంది. దీని కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 257 పల్లెవెలుగు బస్సులు కేటాయించడంతో శనివారం మండుటెండలో ప్రయాణికులు గంటల కొద్దీ పడిగాపులు కాశారు. చాలా వరకు బస్సులు రద్దు కావడంతో ప్రైవేటు ట్రావెల్స్, ఆటోలు, ఇతర ప్రత్యామ్నాయాలపై ఆధారపడాల్సి వచ్చింది. ప్రకాశం రీజియన్ పరిధిలో ప్రభుత్వ, అద్దె బస్సులన్నీ కలిపి 760 వరకూ ఉన్నాయి. వాటిలో నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ అధికారులు మాత్రం ప్రజల కష్టాలు పట్టించుకోకుండా ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి డిపోల నుంచి సుమారు 257 బస్సులను వైసీపీ ప్రచార సభకు కేటాయించడంతో ప్రయాణికులకు పాట్లు తప్పలేదు. మండుటెండలో పడిగాపులు కాసిన వారంతా ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

పచ్చటి చెట్లకు మూడింది

సీఎం జగన్ రోడ్‌షో కోసం నీడనిచ్చే భారీ చెట్లను నరికివేస్తున్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా సీఎం రోడ్‌షో ఆదివారం ఉదయం 10గంటలకు ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం జువ్విగుంట క్రాస్‌రోడ్డు నుంచి ప్రారంభమై పీసీపల్లి, కనిగిరి మీదుగా చినారికట్ల జంక్షన్ వరకు సాగుతుంది. ఆదివారం రాత్రి అక్కడ బహిరంగ సభలో జగన్ పాల్గొంటారు. ఈ నేపథ్యంలో శనివారం కనిగిరి నుంచి కందుకూరు రోడ్డు, కనిగిరి నుంచి పొదిలి వెళ్లే హైవే పక్కనున్న భారీవృక్షాలను మొదలు వరకూ సిబ్బంది నరికివేశారు. పాదచారులు సేద తీరుతున్న మహావృక్షాలు వైసీపీ నేతల దుర్మార్గాలకు నేలకొరుగుతున్నాయని, ఎండలు మండిపోతున్న వేళ చెట్లను నరికివేయడం సరికాదని ప్రజలు వాపోతున్నారు. అదేమని అడిగితే పోలీసులు బెదిరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జగన్ రోడ్ షో చెట్ల చావుకొచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కడపలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ షర్మిల


షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పూతలపట్టు వైసీపీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

వివేకా ఇల్లంతా రక్తంతో ఉంటే

'గుండెపోటు' అంటారా?

- ఎందుకు అబద్ధం చెప్పారో అవినాశ్ చెప్పాలి
- నేను వైఎస్‌కు పుట్టలేదంట
- విజయమ్మనూ అవమానించారు: షర్మిల

కడప, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగినరోజు ఇళ్లంతా రక్తంతో ఉంటే, ఆయన గుండె పోటుతో చనిపోయారని ఎందుకు అబద్ధం చెప్పారో ఎంపీ అవినాశ్‌రెడ్డి చెప్పాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ కేసులో సీబీఐ విచారణను ఎందుకు వద్దన్నారని, సీబీఐ అంటే ఎందుకు భయపడుతున్నారో చెప్పాలన్నారు. బస్సుయాత్రలో రెండోరోజు శనివారం కడపలో ఆమె మాట్లాడారు. "అవినాశ్ రెడ్డి పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నాడు. వివేకా హత్య కేసులో మేం బురద చల్లుతున్నామంట. మా విజ్ఞతకే వదిలేస్తున్నాడంట. ఇన్ని మాటలు చెప్పే బదులు... ఈ కేసులో సంబంధం లేదని చెప్పవచ్చు కదా. గూగుల్ మ్యాచ్‌తో మీకు సంబంధం లేదని చెప్పచ్చుకదా. మీ కాల్ రికార్డు హంతకుల ఫోన్ కాల్ రికార్డు ఎందుకు మ్యాచ్ అవుతున్నాయి? హంతకులకు మీకు ఏం సంబంధాలో చెప్పండి?" అంటూ షర్మిల ప్రశ్నించారు.

కన్న కూతురిపైనే నిందలు

"అవినాశ్ మాటలు చూస్తే త్యాగమూర్తి లెక్క ఉన్నాయి. వివేకా హత్య కేసులో మీరే ముద్దాయి అంటూ సీబీఐ చెబుతోంది. కడప ఎంపీగా పోటీ చేయమని ఐదేళ్ల క్రితం చిన్నాన్న నన్ను బతిమలాడాడు. ఎందుకు ఈయన ఇంతగా అడుగుతున్నాడనుకున్నా. ఆ రోజు ఒప్పుకొని ఉండుంటే ఈ ఘోరాలు జరిగేవి కావు. సొంత చిన్నాన్న చనిపోతే సీఎం జగన్ కేసును పట్టించుకోలేదు. స్వయంగా హంతకులను కాపాడుతున్నాడు. మళ్లీ వారికే సీటు ఇచ్చాడు. హంతకులకు శిక్ష పడలేదు. చివరికి వివేకా బిడ్డ సునీతే చంపిందని ముద్ర వేశారు. న్యాయం కోసం సునీత ఎక్కని గడప లేదు, కోర్టులేదు. చిన్నాన్న వివేకా నన్ను ఎత్తుకుని పెంచాడు. వైసీపీ సోషల్ మీడియాలో నన్ను, సునీతను అవమానిస్తున్నారు. నేను వైఎస్ షర్మిలారెడ్డినే కాదంట. నేను వైఎస్‌కు పుట్టలేదంట. విజయమ్మను కూడా అవమానించారు. ఎన్ని మాట్లాడినా భరించా. అహంకారంతో మదమెక్కి మాట్లాడుతున్నారు" అని షర్మిల అన్నారు. "అడిగినా అడగకపోయినా బీజేపీకి అన్ని బిల్లులకు జగన్ మద్దతు ఇస్తున్నాడు. రాజశేఖరరెడ్డి బీజేపీకి వ్యతిరేకి. వైఎస్ కొడుకు బీజేపీకి బానిస అయ్యాడు. ముస్లింలకు రిజర్వేషన్ ఇచ్చింది వైఎస్సార్. జగన్ ముస్లింలకు టోకరా పెట్టాడు. వైఎస్ బతికుంటే స్టీలు ఫ్యాక్టరీ ఎప్పుడో పూర్తయ్యేది. కడప స్టీలును జగన్ శంకుస్థాపనల ఫ్యాక్టరీగా మార్చారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం షర్మిల అమీన్‌పీర్ పెద్ద దర్గా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో మాట్లాడారు.

వైసీపీకి పూతలపట్టు ఎమ్మెల్యే రాజీనామా

- షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎంఎస్ బాబు

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో అధికార వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు, కీలక నేతలు ఇటీవల వరుసగా రాజీనామా చేస్తున్నారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వైసీపీకి రాజీనామా చేశారు. కడపలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మహమ్మద్ ఇక్బాల్ కూడా వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆమంచి సైతం కాంగ్రెస్‌లో చేరేందుకే మొగ్గు చూపుతున్నారని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

నన్నూ నరికేస్తారేమో

రాజకీయంగా అడ్డు పడుతున్నాడనే.. వివేకాను దారుణంగా నరికి చంపారు

ఆ దుర్మార్గులు ఎంతకైనా తెగిస్తారు

- వ్యవస్థలను మేనేజ్ చేస్తున్నారు
- వారి చేతిలో అధికారం ఉండకూడదు
- షర్మిలకు ఆదరణను చూసి తట్టుకోలేక వైసీపీ నుంచి బయటకు పంపారు
- వివేకాను రాజకీయంగా తప్పించాలని జగన్, అవినాశ్ కుటుంబం కుట్ర
- సొంతవాళ్లే ఘోరానికి పాల్పడ్డారు
- వివేకా కోరిక మేరకే కడప బరిలో షర్మిల
- ప్రజల తీర్పుతో న్యాయం కావాలి: సునీత

హైదరాబాద్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డిని కేవలం రాజకీయంగా అడ్డు తొలగించుకునేందుకే అత్యంత దారుణంగా నరికిచంపారని ఆయన కుమార్తె డాక్టర్ సునీత ఆరోపించారు. ఆ దుర్మార్గుల చేతిలో అధికారం లేకుండా చేసేందుకు తాను ఒంటరి పోరాటం చేస్తున్నానన్నారు. ఒంటరిగా బయటకు వెళుతున్నందున తనను కూడా అడ్డులేకుండా చేయడానికి నరికేస్తారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో వాస్తవాలు చెప్పి ఎన్నికల్లో ప్రజల తీర్పుతో తమకు న్యాయం కావాలని అడుగుతున్నామన్నారు. వివేకా కోరిక మేరకే తన సోదరి షర్మిల కడప నుంచి పోటీ చేస్తున్నారని చెప్పారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న వ్యక్తుల చేతుల్లో అధికారం ఉండకూడదని, అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని తాను నమ్ముతున్నానన్నారు. శనివారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... వివేకా హత్యకు గల కారణాలను, పరిస్థితులను వివరించారు. కుటుంబ సభ్యులు ఇంత ఘోరానికి పాల్పడతారని తాను ఊహించలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రికి జరిగిన అన్యాయంపై వ్యవస్థలతో కలిసి పోరాటం చేస్తున్నానని, తన వెనుకాల ఎవరూ లేరని, కోర్టులకు, పోలీసు స్టేషన్లకు ఒక్కదాన్నే వెళుతున్నానన్నారు. న్యాయం కావాలనే పోరాటం చేస్తున్నాను తప్ప ప్రతీకారం కోసం కాదన్నారు. ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచన ఉంటే తన తండ్రిని చంపిన వారిని తానే ఈపాటికి నరికివేసేదాన్నని చెప్పారు. ఇలాంటి సంఘటన మరోసారి జరగకుండా, తన బాధ మరొకరికి రాకుండా న్యాయపోరాటం చేస్తున్నానన్నారు.



కుటుంబం కలిసుండాలనే...

"వైఎస్ రాజశేఖర రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన తరువాత పులివెందుల ఎమ్మెల్యే టికెట్ ఎవరికి ఇవ్వాలనే దానిపై మా కుటుంబంలో రాజకీయ చర్చ మొదలైంది. వైఎస్ భాస్కర్ రెడ్డి తనకు కావాలని కోరగా అందుకు వివేకా వ్యతిరేకించారు. వైఎస్ విజయమ్మ లేదా షర్మిలలో ఎవరికో ఒకరికి కేటాయించాలని ప్రతిపాదించారు. కొద్ది రోజులకు వైఎస్ వివేకానంద రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇవ్వడంతో, చిన్నాన్నకు మంత్రి పదవి ఎలా ఇస్తారంటూ వైఎస్ జగన్ తీవ్రంగా వ్యతిరేకించారు. తన తల్లితో పాటు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చారు. ఆ తరువాత కొద్ది రోజులకే వైఎస్ఆర్‌సీపీని ఏర్పాటు చేశారు. ఆ పార్టీ ఏర్పాటు విషయంలో వివేకాతో ఏనాడు కనీసం చర్చించలేదు. తరువాత జరిగిన ఎన్నికల్లో పులివెందుల నుంచి విజయమ్మ, వివేకా పోటీ పడే పరిస్థితి ఏర్పడింది. వివేకా ఓడిపోవడం, ఆ తరువాత సీబీఐ కేసుల్లో జగన్‌ను అరెస్టు చేయడంతో కుటుంబమంతా ఒకటిగా ఉండాలని భావించిన వివేకా కాంగ్రెస్‌కు రాజీనామా చేసి వైసీపీలో చేరారు" అని సునీత వివరించారు.

షర్మిలే పార్టీని బతికించారు

"జగన్ జైలుకు వెళ్లాక పార్టీ బాధ్యతలను పూర్తిగా షర్మిల తన భుజాల మీద వేసుకుని ప్రజల్లోకి తీసుకెళ్లారు. లేదంటే అసలు ఆ పార్టీ బతికేదే కాదు. జగన్ జైల్లో ఉండగానే ఉప ఎన్నికలు రావడంతో షర్మిల ప్రచారం చేయడంతో వైసీపీ తరఫున 13 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ గెలిచారు. ఆ తరువాత షర్మిల రాష్ట్రమంతా తిరిగి పార్టీని బతికించారు. షర్మిలకు పెరుగుతున్న ఆదరణ చూసిన జగన్ తట్టుకోలేక ఆమెను పార్టీ నుంచి బైటకు పంపారు. 2014 ఎన్నికల్లో షర్మిలకు కడప ఎంపీ సీటు ఇవ్వాలని వైఎస్ వివేకా ప్రతిపాదించారు. షర్మిల ఇక్కడ ఉంటే తమకు ఇబ్బంది అని భావించిన జగన్, అవినాశ్ రెడ్డి కుటుంబాలు ఆమెను విశాఖ నుంచి పోటీ చేయిస్తామని చెప్పి చివరకు సీటే లేకుండా చేశారు. కడప ఎంపీ సీటు అవినాశ్ రెడ్డికి ఇవ్వడంపై వివేకా తీవ్ర అభ్యంతరం తెలిపారు" అని చెప్పారు.

వివేకాను దారుణంగా చంపారు

"2017లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకాను కావాలని ఓడించారు. తనను ఓడించినా జగన్‌ను వ్యతిరేకించకుండా వైసీపీ కోసం ప్రచారం చేశారు. 2019 ఎన్నికల్లో కడప నుంచి షర్మిలను పోటీ చేయించాలని వివేకా పట్టుపట్టారు. ఆ ఏడాది ఫిబ్రవరి 10న కడపలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ప్రజల ఎదుటే వేదికపై అవినాశ్ పట్ల తనకున్న కోపాన్ని వివేకా చూపారు. వివేకాకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని, ఆయన్ను రాజకీయాల నుంచి తప్పించాలని జగన్, అవినాశ్ కుటుంబం పథకం ప్రకారమే కుట్రలు చేయడం మొదలు పెట్టారు. రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకు పులివెందులలో ఆయన ఓటు తొలగించారు. దీనిపై 2019 మార్చి 4న ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ప్రత్యర్థి పార్టీల నాయకులే ఆ పని చేశారేమో అని మేమంతా భావించాం. ఎన్నికల్లో నా తండ్రి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారేమోనన్న భయంతో అత్యంత దారుణంగా నరికి చంపేశారు" అని సునీత ఆరోపించారు.

ఈ సార్లు సుద్దపూసలా!

(మొదటి పేజీ తరువాయి)

అందరూ కాకుండా... వీరు మాత్రమే ఎందుకు భుజాలు తడుముకున్నారు? అని కాస్త లోతుగా ఆలోచిస్తే అసలు కిటుకు ఇట్టే అర్థమవుతుంది! వీరంతా... ఐదేళ్లపాటు వైసీపీ సర్కారుతో అంటకాగి, వైసీపీనే ఐపీసీగా అమలు చేసినట్లు బలమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే! అందులో ఆరు మందిని ఇప్పటికే ఎన్నికల కమిషన్ పక్కకు తప్పించింది. ఎవరి ఆదేశాల మేరకు కదిలారో తెలియదుకానీ.... ఈ ఆరుగురితోపాటు మొత్తం 19 మంది ఐపీఎస్‌లు అసాధారణ రీతిలో ఈసీకి సుదీర్ఘ లేఖ రాశారు. ఈసీ తీరుపై ఈసీకే ఫిర్యాదు చేయడం మరో చిత్రం! 'మీడియా గొంతు నొక్కండి. ప్రతిపక్షాలను కట్టడి చేయండి' అంటూ ఈసీకి పరోక్ష విన్నపాలు చేసుకున్నారు. మరికొందరు వైసీపీ ఐపీఎస్‌లు, ఐఏఎస్'లపై ఈసీ చర్యలు తీసుకోకుండా, విపక్ష ఫిర్యాదులు పట్టించుకోకుండా ఈసీపై ఒత్తిడి తెచ్చేందుకే ఈ లేఖ రాశారనే అనుమానాలూ తలెత్తుతున్నాయి. అలాగే... ఏదిఏమైనా ఎన్నికల డ్యూటీలో ఉండాలి, వైసీపీ సేవ చేయాలనే తహతహ కూడా ఈ అధికారుల్లో కనిపిస్తోందనే వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. సంతకాలు చేసిన 19 మంది వెనుక ఉన్న అసలు సూత్రధారి ఎవరనే అంశంపైనా ఐపీఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ లేఖలో ఐపీఎస్‌లు ప్రస్తావించిన అంశాలు, అసలు వాస్తవాలు ఇలా ఉన్నాయి...

ఐపీఎస్‌లు: ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, బీజేపీ, జనసేనతోపాటు కొన్ని మీడియా సంస్థలు ఐపీఎస్‌లపై తప్పుడు ప్రచా రం చేస్తూ పోలీసు ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తున్నాయి.

జవాబు: ప్రతిపక్షాల ఫిర్యాదులతో, మీడియా కథనాలతో ఐపీఎస్‌ల పరువు పోయిందనడం పెద్ద జోక్! వైసీపీ నేతల ఆకాంక్షలు, ఆదేశాల మేరకు విపక్ష కార్యకర్తలు, అమాయకులను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసి, చితక బాది, ఏకపక్షంగా కేసు లు నమోదు చేయించిన కొందరు ఐపీఎస్‌లు ఎప్పుడో పరువు పోగొట్టుకున్నారు. ఏపీ పోలీసు ప్రతిష్ఠను వాళ్లే దిగజార్చారు.

ఐపీఎస్‌లు: రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి ఆధారాల్లేకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఆపై మీడియా ముందుకొచ్చి నిందలు వేస్తున్నారు. ఒక వర్గం మీడియా వాటిని జనంలోకి తీసుకెళుతోంది. ఈ దుర్మార్గపు విష వలయంలో చిక్కుకుని గత రెండు నెలల్లో 30మంది ఐపీఎస్‌లు నష్టపోయారు.

వాస్తవం: ఎన్నికల కమిషనర్లుగా ఐఏఎస్‌లే ఉన్నారు. నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా చూడటం వారి విధి! ఎన్నికల కమిషన్‌కు భారీ స్థాయిలో ఫిర్యాదులు అందుతున్నాయి. వీటన్నింటిపై ఈసీ స్పందిస్తున్న దాఖలాలు లేవు. లోతుగా ఆరా తీసి, ఆధారాలు ఉన్నప్పుడే ఈసీ చర్యలు తీసుకుంటోంది. ఇక... రెండు నెలల్లో 30 మంది ఐపీఎస్‌లు నష్టపోయారని చెప్పడం మరో వింత! ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 20 రోజులవుతోంది. ఈసీ ఇప్పటికి ఆరుగురు ఐపీఎస్‌లపై మాత్రమే చర్యలు తీసుకుంది. కోడ్‌కు ముందు ఈసీ పాత్ర, ప్రమేయం లేనే లేదు. మరి... 30 మంది 'బాధితులు' ఎక్కడి నుంచి వచ్చినట్లు? మరి... 30 మంది ఐపీఎస్‌లు నష్టపోతే, ఈ 19 మంది మాత్రమే ఎందుకు స్పందించారు?

ఐపీఎస్‌లు: నిరంతరం ప్రతికూల ప్రచారం చేస్తూ, చిన్న ఘటనలనూ పెద్దవిగా చూపిస్తూ ఎన్నికల కమిషన్‌ను ప్రభావితం చేసి పలువురు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఒక ఐజీని బదిలీ చేయించడంలో ఈ వర్గాలు విజయం సాధించాయి.

జవాబు: అంటే మీడియా కథనాలను ఈసీ గుడ్డిగా నమ్ముతోందని మీ ఉద్దేశమా? ఇది ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను నేరుగా ప్రశ్నించడమే. అఖిల భారత సర్వీసు అధికారులు రాజకీయ నాయకుల తరహాలో ఇలాంటి ఆరోపణలు చేయొచ్చా? ఇంతకూ మీ ఆక్రోశం... మీడియా కథనాలు రాయడంపైనా, లేక ఈసీ చర్యలపైనా?

ఐపీఎస్‌లు: వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాల కట్టడిలో అగ్రగామిగా నిలిచిన ఏపీ పోలీసులు విధులు అనే బలిపీఠంపై నిలిచారు. సంఘ వ్యతిరేక శక్తుల నుంచి సమాజాన్ని పరిరక్షించేది, విపత్తుల సమయంలో పోలీసులకు నాయకత్వం వహించేది ఐపీఎస్ అధికారులే. చట్టాన్ని శ్రద్ధగా పాటిస్తూ పనిచేస్తున్న మా చొరవను నిరాధార ఆరోపణలతో నీరుగార్చే ప్రయత్నం జరుగుతోంది.

జవాబు: ఐపీఎస్‌లకు విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిదే! దీనిని ఒప్పుకోవాల్సిందే. నిక్కచ్చిగా పని చేసే ఐపీఎస్‌లకు సెల్యూట్ కొట్టాల్సిందే! కానీ... అసలు సమస్యంతా వైసీపీ ఐపీఎస్‌లతోనే! వీరి నిర్వాకాలు ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలు చూస్తూనే ఉన్నారు. ఇక... ఈ లేఖలో కొన్ని పేర్కొన్నట్లుగా రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదం లేనేలేదు. ఉగ్రవాదులూ లేరు. ఉన్నదంతా ప్రభుత్వ ఉగ్రవాదమే అని విపక్షాలు వాపోతున్నాయి. ఇక... భూకబ్జాలు, ఇసుక, మద్యం మాఫియా వంటి 'వ్యవస్థీకృత' నేరాలు చేస్తున్నదే వైసీపీ నేతలు. వాటిని ఐపీఎస్‌లు అణచివేశారా... అండగా ఉన్నారా అన్నది అందరికీ తెలుసు. హైకోర్టు న్యాయమూర్తులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడితే దిక్కులేదు. కానీ... అధికార పార్టీ నాయకులపై పోస్టులు ఫార్వర్డ్ చేసినా 'నేనేరా పోలీస్' అంటూ గర్జించారు. కరోనా సమయంలో కానిస్టేబుల్ నుంచి పై స్థాయి వరకూ పోలీసులు చేసిన సేవలు మరువరానివే. వైద్య సిబ్బందితోపాటు పోలీసులూ శ్రమించారు. దీనికీ ఈ అధికారులపై వచ్చిన ఆరోపణలకు సంబంధమేమిటో!?

ఐపీఎస్‌లు: నిరాధారమైన ఆరోపణలతో అధికారుల ప్రతిష్ఠ దిగజార్చి, కీలకమైన సమస్యల నుంచి దృష్టి మరల్చి సమాజంలో అనవసరమైన వైషమ్యాలను సృష్టించి ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగించే దురుద్దేశం ఉంది. ఎన్నికలు బహిష్కరించాలని మావోయిస్టులు పిలుపు ఇచ్చిన తరుణంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ పూర్తి చేయడం సవాలుతో కూడుకున్నది. అందుకు ధైర్యం, చొరవతో కూడిన పోలీసు దళం అవసరం. స్వేచ్ఛాయుత, హింసరహిత ఎన్నికలు జరగాలంటే పోలీసు అధికారులపై జరుగుతున్న ఇలాంటి దుష్ప్రచారాన్ని అరికట్టేందుకు ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలి.

జవాబు: ముందే చెప్పినట్లు... రాష్ట్రంలోని మొత్తం 144 మంది ఐపీఎస్‌లపై ఎవరూ ఫిర్యాదు చేయలేదు. వారందరిపైనా తీవ్రమైన ఆరోపణలు లేవు. సమస్యంతా 'వైసీపీ ఐపీఎస్'లతోనే! ఇక... రాష్ట్రంలో ఎన్నికలు బహిష్కరించాలని మావోయిస్టులు ఎప్పుడు పిలుపునిచ్చారో వారికే తెలియాలి. అసలు ఇక్కడ నక్సల్స్ ఉనికే లేదని పోలీసు బాస్‌లు చెబుతూనే ఉన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగాలనే ఎన్నికల కమిషన్ కూడా చర్యలు తీసుకుంటోంది.

ప్రభుత్వం మీద ఎప్పుడు ఈగ వాలినా విజయవాడ నగర కమిషనర్ కాంతిరాణా టాటా టక్కున స్పందిస్తారు. ఐపీఎస్ అధికారుల సంఘం అంటే తానే అన్నట్లుగా 'ఖండనలు' పంపిస్తుంటారు. ఇప్పుడు ఆయనే వెళ్లి 19 మంది ఐపీఎస్‌లు సంతకం చేసిన లేఖను సీఈవో మీనాకు అందించడం విశేషం. అన్నట్లు... కాంతి రాణా పనితీరును కొన్నాళ్ల కిందట విజయవాడలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలోనే తప్పుపట్టారు. అప్పటికి ఎన్నికల కోడ్ కూడా రాలేదు. విపక్షాల ఫిర్యాదులూ లేవు.

ఎన్నికల కమిషన్ ఇప్పటికి కేవలం ఆరుగురు ఐపీఎస్‌లను మాత్రమే బదిలీ చేసింది. కానీ... వీరితోపాటు ఏకంగా 19 మంది ఐపీఎస్ అధికారులు భుజాలు తడుముకున్నారు? ఎందుకని... ఆ అవసరం ఏమిటి?

2019 ఎన్నికల సమయంలో కడప, శ్రీకాకుళం, ప్రకాశం ఎస్పీలను... ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్‌ను, ఏకంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినే ఎన్నికల కమిషన్ పక్కన పెట్టేసింది. అప్పుడు వీళ్లెవరూ గగ్గోలు పెట్టలేదు. ఇతర ఐఏఎస్, ఐపీఎస్‌లూ హాహాకారాలు చేయలేదు.

ఈసీకి సమర్పించిన లేఖతో పత్రికల్లో ప్రచురితమైన కథనాలనూ జత చేశారు. అందులో... గ్రూప్-1 వ్యవహారంలో ఏపీపీఎస్సీ నిర్వాకంపై చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టిన వార్త కూడా ఉంది. పోలీసులకు ఏపీపీఎస్సీతో ఏం సంబంధం? ఇప్పుడు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న పీఎస్సార్ ఆంజనేయులు అప్పట్లో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా వ్యవహరించారు. ప్రస్తుతం మాజీ డీజీపీ గౌతమ్ సవాంగ్ కమిషన్ చైర్మన్‌గా ఉన్నారు. వీరిలో ఎవరికోసం ఈ ఐపీఎస్‌ల ఆరాటం?

లేఖపై సంతకాలు చేసింది వీరే..

1) పీవీ సునీల్ కుమార్-డీజీ అగ్నిమాపక, విపత్తుల నిర్వహణ సంస్థ 2) ఎన్ సంజయ్-ఏడీజీ, సీఐడీ 3) కాంతి రాణా - పోలీస్ కమిషనర్, విజయవాడ సిటీ 4) పాలరాజు- ఇటీవల ఈసీ పక్కనబెట్టిన ఐజీ 5) కొల్లి రఘురామి రెడ్డి- డీజీ వీ అండ్ ఈ, డీజీ డ్రగ్ కంట్రోల్ అథారిటీ 6) జీవీజీ అశోక్ కుమార్-ఐజీ, ఏలూరు రేంజ్ 7) సీహెచ్ విజయరావు- డీఐజీ కర్నూలు రేంజ్ 8)జి. కృష్ణకాంత్ - అవినాశ్ రెడ్డి అరెస్టుకు సీబీఐకి నో చెప్పిన కర్నూలు ఎస్పీ 9) విశాల్ గున్నీ- డీఐజీ, విశాఖపట్నం రేంజ్ 10)జీఆర్ రాధిక- ఎస్పీ, శ్రీకాకుళం 11) అమ్మిరెడ్డి- డీఐజీ, అనంతపురం రేంజ్, 12) అన్బురాజన్- ఇటీవల ఈసీ తప్పించిన అనంత ఎస్పీ, 13) సిద్ధార్థ కౌశల్- ప్రస్తుతం కడప జిల్లా ఎస్పీ, 14) రిశాంత్ రెడ్డి- ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ 15) మేరీ ప్రశాంతి- ఎస్పీ, ఏలూరు 16) రఘువీర్ రెడ్డి- ఎస్పీ, నంద్యాల, 17) తిరుమలేశ్వర్ రెడ్డి- ఈసీ తప్పించిన నెల్లూరు ఎస్పీ, 18) పరమేశ్వర్ రెడ్డి- ఈసీ తొలగించిన ప్రకాశం ఎస్పీ, 19) జాషువా- ఈసీ తప్పించిన చిత్తూరు ఎస్పీ


బద్వేలులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి

విచక్షణ, ఇంగితజ్ఞానం ఉండాలి!

- షర్మిల, సునీతలపై వైఎస్ అవినాశ్‌రెడ్డి మండిపాటు

బద్వేలు, ఏప్రిల్ 6: పీసీసీ అధ్యక్షురాలు, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల, మాజీ మంత్రి వైఎస్ వివేకా కూతురు డాక్టర్ సునీతల వ్యాఖ్యలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని వివేకా హత్య కేసు నిందితుడు, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం ఆయన బద్వేలులోని భావనారాయణ నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కొందరి వ్యాఖ్యలు వినడానికి భయంకరంగా ఉంటాయి. మసి పూస్తారు. బురద చల్లుతారు. తుడుచుకుంటూ పోతే తిడుతూనే ఉంటారు. అందుకే వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. మనిషి జన్మ అన్నాక విచక్షణ, ఇంగితజ్ఞానం ఉండాలి. అవి వారికి ఉన్నాయా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజ్ఞత కలిగిన ఎవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయరని మండిపడ్డారు. 'ఎన్ని మాటలు అంటారో అనండి. ఎంత ప్రచారం చేస్తారో చేయండి. వారి విజ్ఞతకే వదిలేస్తున్నా' అన్నారు.

అవినాశ్ రెడ్డిపై
నోరు పారేసుకోవద్దు!

- సిగ్గుఎగ్గు లేకుండా కాంగ్రెస్‌కు ఓట్లు అడుగుతున్నావ్
- వైఎస్ షర్మిలపై ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా మండిపాటు



కడప(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 6: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు, కడప ఎంపీ వైఎస్ అవినారెడ్డిపై నోరు పారేసుకోవద్దని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఉపముఖ్యమంత్రి అంజద్ బాషా హెచ్చరించారు. శనివారం కడప నగరంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ..'షర్మిల ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఆకాశానికి ఉమ్ము వేస్తే అది తిరిగి వచ్చి మన ముఖాన పడుతుందన్న వాస్తవం గ్రహించాలి. ఇష్టానుసారంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీ అవినాశ్ రెడ్డిలపై చేస్తున్న ఆరోపణలను ప్రజలు హర్షించలేదన్న నగ్న సత్యాన్ని ఆమె గ్రహించాలి' అన్నారు. విచక్షణ, విజ్ఞత లేకుండా నోరు పారేసుకోవద్దని సూచించారు. 'కడుపు మంటతో శత్రువులతో చేతులు కలిపావని జనమంతా నమ్ముతున్నారు. రాష్ట్రాన్ని నిలువునా చీల్చింది కాంగ్రెస్. డాక్టర్ వైఎస్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చింది కాంగ్రెస్ పార్టీ. 16 నెలలు అన్నను జైల్లో పెట్టింది కాంగ్రెస్ పార్టీ. ఇవన్నీ మరిచిపోయి సిగ్గుఎగ్గు లేకుండా ఆ కాంగ్రెస్‌కు ఓట్లు వేయమని ఎలా అడుగుతున్నావు?' అని ప్రశ్నించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.




మండే ఎండల్లో..

నిన్నటి వరకు చల్లని వాతావరణాన్ని ఆస్వాదించిన నగరవాసులకు ఈ వేసవి చుక్కలు చూపిస్తోంది. మధ్యాహ్నం బయటికి రావాలంటే ఒళ్లంతా కప్పుకుని రావాల్సిందే.. రోజు రోజుకూ పెరుగుతున్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు.




రాజకీయ అనుభవం చూసి గెలిపించండి

- బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరీ అభ్యర్థన
- జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్: కేశినేని శివనాథ్


పథకాల గురించి వివరిస్తున్న సుజనా, శివనాథ్

భవానీపురం, ఏప్రిల్ 6: తన రాజకీయ అనుభవాన్ని చూసి పశ్చిమ ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అభివృద్ధి పథంలో నిలుపుతానని పశ్చిమ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అసెంబ్లీ అభ్యర్థి వై. సుజనా చౌదరి పిలుపునిచ్చారు. 41వ డివిజన్ ఆశ్రమం రోడ్డులో ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి సుడిగాలి ప్రచారాన్ని శనివారం ప్రారంభించారు. తీన్‌మార్ వాయిద్యాల నడుమ అశేషంగా కూటమి నేతలు, కార్యకర్తలతో ఆశ్రమం వీధి, బేతపూడి అరుణ్‌కుమారి వీధి, అవుట్ ఏజెన్సీ ఏరియాల్లో కలిసి ఓటర్లను కలిసి అధికారంలోకి వస్తే తాము ప్రవేశపెట్టనున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సుజనా మాట్లాడుతూ 12 ఏళ్ల ఎంపీగా తన అనుభవాన్ని ఉపయోగించి ఎంపీగా కేశినేని శివనాథ్‌కు అండగా ఉంటానని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తానన్నారు. ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎంపీగా ఓ వ్యక్తికి చంద్రబాబు రాజకీయ భిక్షను పెడితే ఆ వ్యక్తి ఆయన్నే దూర్భాషలాడే హక్కు లేదన్నారు. ఏ రోజైనా వన్‌టౌన్‌లోని కొండ ప్రాంతంలోని ఏ కొండనైనా ఎక్కి ప్రజలు సమస్యలు తెలుసుకున్నావా? అంటూ కేశినేని నాని ప్రశ్నించారు. అధికారంలో రాగానే ఉచితంగా మూడు సిలెండర్లు, ఇంటిలోని చదువుతున్న పిల్లలకు రూ.15వేల చొప్పున ఆర్థికసాయం, ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేసి తీరతామన్నారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె. నాగూల్ మీరా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పార్లమెంట్ ఇన్‌చార్జి బబ్బూరి శ్రీరామ్, పశ్చిమ కన్వీనర్ పొట్టి శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు పత్తి నాగేశ్వరరావు, హబీబుల్లా, రామయ్య, బబ్బూరి నారాయణస్వామి, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, డివిజన్ అధ్యక్షులు, జనసేన నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే

రూ.3వేల నిరుద్యోగ భృతి

- యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి

గన్నవరం, ఏప్రిల్ 6: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వనున్నట్టు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సతీమణి యార్లగడ్డ జ్ఞానేశ్వరి అన్నారు. పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో శనివారం సాయంత్రం ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేస్తూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వరీ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య అధికమైందని, పారిశ్రామిక రంగం వెనుకబడటంతో యువత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పారిశ్రామిక రంగం అభివృద్ధి పథంలో ఉరకలేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన భర్త యార్లగడ్డ వెంకట్రావుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, ఉపసర్పంచ్ పాలడుగు నాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ సభ్యుడు మద్దినేని వెంకటేశ్వరరావు, మండవ లక్ష్మీ, మేడేపల్లి రమాదేవి, చిక్కవరపు నాగమణి, దేవినేని సులోచన, మండవ లక్ష్మీ, అరవపల్లి బోస్, గూడపాటి తులసీమోహన్, కంచర్ల సూర్య, షేక్ రఫీ, కంభంపాటి బాల నరేష్ పాల్గొన్నారు.


గన్నవరం శ్రీనగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి, తెలుగు మహిళలు

ప్రజారోగ్య పరిరక్షణకు సహకరించాలి

- ఐఎంఏ హెల్త్ మేనిఫెస్టోలో వినతి

గవర్నర్‌పేట, ఏప్రిల్ 6: ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు ప్రజారోగ్య పరిరక్షణకు సహకరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వార్షిక సమావేశం విజ్ఞప్తి చేసింది. ఇటీవల కేరళలో జరిగిన ఐఎంఏ 98వ వార్షికోత్సవ సదస్సులో విడుదల చేసినట్టు ఐఎంఏ ఏపీ అధ్యక్ష, ప్రధాన కా ర్యదర్శులు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నంద కిషోర్, జ నరల్ సెక్రటరీ డాక్టర్ పి.ఫణిధర్ పేర్కొన్నారు. కేరళ సమావేశంలో పాల్గొని నగరానికి వచ్చిన సంఘ నేతలు శనివారం చ ల్లపల్లి బంగ్లా సమీపంలోని ఐఎంఏ కార్యాలయంలో వార్షికోత్స వ సదస్సులో ఆమోదించిన ఆరోగ్య ప్రణాళిక ప్రమాణ పత్రా న్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రమాణ పత్రంలోని అంశాలను మీడియాకు వివరించారు. యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)ను సాంక్రమిక వ్యాధుల చికిత్సకు వాడ టం పెనుప్రమాదంగా పరిణమించిందని సమావేశం తీర్మానించినట్టు తెలిపారు. జీవ, ఆహార, పర్యావరణ రంగాల్లో ఏ ఎంఆర్ పెరుగుదల రేటు గత దశాబ్దకాలంలో విపరీతంగా ఉండి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, ఏఎంఆర్‌ను నిరోధించకపోతే ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మానవవనరులు, ఆర్థికవనరులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని సదస్సు ఆందోళన వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. దేశంలో వైద్య ఖర్చు ల్లో 63 శాతం ప్రజల జేబుల నుంచే ఖర్చు కావడం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రు లు మూత పడటం బాధాకరమని మందులపై విధిస్తున్న జీఎ స్‌టీ 18 శాతం తొలగించాలని ప్రజలకు వెసులబాటు కల్పించాలని కోరారు. మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ వి. రాంప్రసాద్, మా జీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీహెచ్ ప్రమోద్ పాల్గొన్నారు.



ఐఎంఏ వార్షిక సమావేశం ఆమోదించిన ఆరోగ్య ప్రణాళిక ప్రమాణ పత్రాన్ని విడుదల చేస్తున్న ఐఎంఏ రాష్ట్ర నేతలు

ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలోనే నగరాభివృద్ధి

- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 6: అన్న ఎన్టీరా మారావు, చంద్రబాబు నాయుడు హయాంలోనే నగరాభివృద్ధి జరిగిందని జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. స్థానిక 3వ డివిజన్ బాయన బాజ్జీ రోడ్డులోని సాయి క్లాసిక్ అపార్ట్‌మెంట్‌లో డివిజన్ వాసులతో ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. జనసేన, బీజేపీ నేతలతో పాటు టీడీపీ నేతలు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ: 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికై టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త కాలనీగా ఏర్పడిన డివిజన్ ఇదన్నారు. డివిజన్‌లో అనేకరోడ్లు అధ్వానంగా ఉండేవని, తాను అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ప్రధాన రహదారులను మరమ్మతులు చేశామన్నారు. రాజధాని అమరావతిని తీర్చి దిద్దడానికి చంద్రబాబు ప్రయత్నించారన్నారు. టవర్‌లైన్‌రోడ్డు టీడీపీ సృష్టి అన్నారు. దీంతో నాగార్జున నగర్, సుబ్బారావు, కరెన్సీనగర్‌కు మంచి కనెక్టవిటీ ఏర్పడిందన్నారు. కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు వెంకయ్యనాయుడు నగరాభివృద్ధికి రూ.500 కోట్లు మంజూరు చేశారని, టీడీపీ హయాంలో రూ.210 కోట్లతో అభివృద్ధి పనులు చేశారని, మిగిలిన రూ.290కోట్లను వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందో తెలియదన్నారు. ఎల్‌అండ్‌టీ కంపెనీ కాంట్రాక్టర్‌ను వైసీపీ నేతలు భయపెట్టి పారిపోయేలా చేశారన్నారు. కచ్చా రోడ్డును సీసీ రోడ్డుగా మార్చడానికి చంద్రబాబు రూ.1600 కోట్లను కేటాయించారని, ఈ లోగా ప్రభుత్వం మారడంతో ఆ నిధులు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. ఈ డివిజన్‌లో సుమారు రూ.60కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రశాంత జీవనం లేదని, ఎవరు ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తారో ఏ మహిళపై ఎప్పుడు దాడి జరుగుతుందోనన్న భయంగా జీవనం సాగిస్తున్నారన్నారు. బొప్పన భవకుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అయితే నగరాభివృద్ధి గురించి మర్చిపోవచ్చన్నారు. 2014 కనకదుర్గానగర్ ఏరియాకు లే అవుట్ మంజూరు చేయడానికి ఒక్కొక్క ప్లాట్ నుంచి రూ.3లక్షలు తీసుకున్నారని ఆరోపణలు చేస్తే తాను వైసీపీలో ఉన్నప్పుడు ధర్నా చేశానని, తర్వాత విచారిస్తే అలాంటిదేమీ లేదని తేలిందన్నారు. బీజేపీ నేత పోతంశెట్టి నాగేశ్వరరావు, 3వ డివిజన్ సెక్రటరీ గుత్తికొండ మోహన్‌రావు, కేశినేని శివనాథ్ కుమారుడు కేశినేని వెంకట్, తాడిబాబురావు, గుమ్మడి గురుప్రసాద్, ఈశ్వర్ పేరేపి, యలమంచిలి రాజేంద్రప్రసాద్, యలమంచిలి రాజా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

వీఆర్ సిద్ధార్థ నిరంతర అభివృద్ధి సాధించాలి

- వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి

పెనమలూరు, ఏప్రిల్ 6: డీమ్డ్ టుబీ హోదా సాధించిన వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల అత్యున్నత ప్రమాణాలతో విద్యనందిస్తూ బోధన, పరిశోధన రంగాల్లో నిరంతర అభివృద్ధిని సాధిస్తూ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవాలని వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి ఆకాంక్షించారు. శనివారం కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కళాశాల క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో అత్యధిక వేతనం సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ కళాశాల వార్షిక నివేదికలను సమర్పించారు. విద్యార్థులు అత్యధిక వార్షిక వేతనం పొందడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ కళాశాలకు యూజీసీ డీమ్డ్ టుబీ హోదాను ప్రకటించడంపై ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ టీంను అభినందించారు. అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత శ్రేణి ఆలోచనలు, నాయకత్వ లక్షణాలతో విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. కన్వీనర్ మలినేని రాజయ్య, అన్ని శాఖల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు బంగారు పతకాలు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

చంద్రబాబుతోనే యువతకు మంచి భవిష్యత్

- తెలుగు యువత అధ్యక్షుడు పరుచూరి నరేష్

గుణదల, ఏప్రియల్ 6: యువతకు మంచి భవిష్యత్తు కావాలంటే 2024లో చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన చరిత్రాత్మక అవసరం ఎంతో ఉందని గన్నవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు పరుచూరి నరేష్ అన్నారు. ప్రసాదంపాడులోని టీడీపీ రూరల్ మండల కార్యాలయంలో విస్తృతస్థాయి సమావేశం శనివారం జరిగింది. యువతను ఉద్దేశించి పరుచూరి నరేష్ మాట్లాడుతూ అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నా అని ప్రకటించిన ప్రస్తుత వైకాపా అభ్యర్థి అభివృద్ధి గాలికొదిలేసి అరాచకాలకు పాల్పడ్డాడన్నారు. గన్నవరం రూపురేఖలు మారాలన్నా అభివృద్ధిలో నెంబర్ వన్ స్థానంలో ఉండాలంటే యార్లగడ్డ వెంకట్రావును సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించుకోవడం ఒక్కటే మన ముందు ఉన్న కర్తవ్యమని తెలిపారు. తెలుగు యువత బూత్ స్థాయిలో అహర్నిశలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతలో రాజకీయ చైతన్యం రావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. నాయకత్వ క్షణాలున్న నేత యార్లగడ్డ వెంకట్రావును గెలిపించుకుని గన్నవరాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఐటీ కంపెనీలు మళ్లీ కుప్పలు కుప్పలుగా వస్తాయని తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభ్యమవుతాయన్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొసరాజు సాయిరామ్, టీడీపీ నేతలు గూడవల్లి నరసయ్య, గరిమెళ్ల నరేంద్ర, గుజ్జర్లపూడి బాబూరావు, పోకా కిరణ్, అమీర్ జానీ, ముక్కపాటి చైతన్య, దాసరి మహేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి రమణ, జనసేన పార్టీ అధ్యక్షుడు మహేష్, గూడవల్లి నరేంద్ర, జున్నూరి వాసు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత నేత నరేష్


దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు దంపతులు

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు దంపతులు

వన్‌టౌన్, ఏప్రిల్ 6: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు దంపతులు శనివారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇన్‌చార్జి ఈవోగా వ్యవహరిస్తున్న కోటేశ్వరరావు వారికి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం

దుర్గగుడిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి శనివారం కానూరుకు చెందిన బోడపాటి లక్ష్మి ప్రసూనాంబ రూ.1,00,116 దేవస్థానానికి విరాళంగా ఆలయాధికారులకు అందజేశారు. అధికారులు దాతకు అమ్మవారి దర్శనం చేయించి, వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

ఘనంగా గాలీబ్ షహీద్ దర్గా ఉరుసు ప్రారంభం

భవానీపురం, ఏప్రిల్ 6: 41వ డివిజన్‌లో హజ్రత్ సయ్యద్ గాలీబ్ షహీద్ దర్గా ఉరుసు వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దర్గా ప్రాంగణం ముస్లిం భక్తులతో కిటకిటలాడింది. సయ్యద్ సమాధిని అందంగా పూలతో అలంకరించారు. ప్రత్యేక సుగంధ ద్రవ్యాలు చల్లారు. ఉదయం నుంచి ముస్లిం భక్తులు సమాధిని దర్శించుకుని ప్రసాదాలను సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్గా కమిటీ పాలకవర్గం ముస్తాక్ అహ్మద్, రెహమాన్ ఇషాక్, సత్తార్, చాంద్ బాషా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం ప్రత్యేక దీపారాధన, రాత్రికి భారీ అన్నసమారాధనతో వేడుకలు ముగుస్తాయి.



ప్రత్యేక అలంకరణలో సయ్యద్ సమాధి, భక్తుల కోలాహలంతో దర్గా ప్రాంగణం

సాంకేతిక అభివృద్ధిలో మార్పులను

విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

మొగల్రాజపురం, ఏప్రిల్ 6: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని ఇన్నోపార్క్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ సీఈవో సబినేని కృష్ణారావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల బీబీఎం ఎలలిటిక్స్ విభాగం విశ్లేషక్ 2కె24 నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. విద్యార్థులకు బిజినెస్ క్విజ్, డేటా గేమ్, స్టార్ట్ అప్, మిస్టర్ అండ్ మిస్, డాన్స్, ఫొటోగ్రఫీలో పోటీలను నిర్వహించారు. జిల్లాల నుంచి 300 మంది విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, విభాగాధిపతి డి.వాసు, అధ్యాపకులు హనుమజ్యోతి, సాయిరాం పాల్గొన్నారు

యువజనోత్సవాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఫీజు మాఫీ

మొగల్రాజపురం, ఏప్రిల్ 6: పంజాబ్ రాష్ట్రం లూథియానాలో జరిగిన అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో కృష్ణా వర్సిటీ తరుపున పాల్గొని ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన తమ విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరంలో చెల్లించాల్సిన ఫీజులను మాఫీ చేస్తున్నట్టు పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. శనివారం కళాశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక విభాగంలో సౌత్‌జోన్ పోటీలో బహుమతులు సాధించడం అభినందనీయన్నారు. శిక్షణ ఇచ్చిన ఎస్.బాలను, విద్యార్థులను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ రాజేష్, అధ్యాపకులు, డైరెక్టర్ వేమూరి బాబూరావు అభినందించారు.




భద్రాద్రి రాముడికి 100 కేజీల తలంబ్రాలు

- సిద్ధం చేసిన భక్తవత్సల సేవా సమితి
- 12 ఏళ్లుగా సేవలో తరిస్తున్న సమితి సభ్యులు

రాణిగారితోట, ఏప్రిల్ 6: కృష్ణలంకకు చెందిన భక్తవత్సల సేవా సమితి సభ్యులు పుష్కరకాలంగా ఒలిచిన తలంబ్రాలను భద్రాచలం ఆలయానికి సమర్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా చేతితో ధాన్యం ఒలిచిన 100 కేజీల తలంబ్రాలను సిద్ధం చేసి పూజలు నిర్వహించి భద్రాచలానికి బయలుదేరారు. సమితి అధ్యక్షురాలు ధనలక్ష్మి మాట్లాడుతూ 2వేల మంది సభ్యులు గల తమ సమితి 12ఏళ్లుగా ఈ మహత్తర కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. జనవరిలో కొత్త పంట నుంచి సేకరించిన ధాన్యాన్ని విజయనగరానికి చెందిన రామతీర్థం పూజారి సుందర్శన శర్మ అందించారన్నారు. వాటిని భక్తిశ్రద్ధలతో శుభ్రపరిచి సమితి సభ్యులందరూ ధాన్యాన్ని గోటితో ఒలవడం జరిగిందన్నారు. ఈ ఏడాది ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి ఈ పవిత్రమైన తలంబ్రాలను అందిస్తామన్నారు. ఇలా సేవచేసే అవకాశం తమకు కలగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

ముస్లింల మతాచారాన్ని అగౌరవపరుస్తారా?: బాబు



అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ముస్లింల మతాచారాన్ని అగౌరవపరుస్తూ, మైనారిటీ మహిళ బురఖాను తొలగించే స్థాయికి వైసీపీ నేతల అహంకారం చేరుకుందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. నందికొట్కూరులో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మైనారిటీ సోదరి పట్ల అనుచితంగా వ్యవహరించడం, ప్రశ్నించిన బాధితులపైనే తిరిగి దాడి చేయడం రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శనమని శనివారం ట్వీట్ చేశారు.

రంజాన్ మాసంలోనూ దాడులా?: అచ్చెన్న

ముస్లింలను నమ్మకూడదన్న వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో కూడా ముస్లింలపై వైసీపీ నేతల వేధింపుల పర్వం కొనసాగుతోందని శనివారం ఇచ్చిన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. నంద్యాలలో ముస్లిం యువతికి జరిగిన అవమానాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో ముస్లింలపై 60కిపైగా దాడులు, 15 మందిపై అత్యాచారాలు, 9 మంది హత్య, వేలాది మందికి అవమానాలు జరిగాయని తెలిపారు.

భవిష్యత్ అప్పులూ తీసేసుకుంటున్న జగన్

▸▸ ఆర్థిక సంవత్సరాన్ని అప్పుతో ప్రారంభించిన ఘనుడు: యనమల



అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల తర్వాత రాబోయే ప్రభుత్వాల అప్పులను కూడా జగన్ ఇప్పుడే తీసేసుకుంటున్నారని మాజీ ఆర్థిక మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. 'ఎన్నికల ఫలితాలు వచ్చే జూన్ నాలుగో తేదీలోపు రూ.20 వేల కోట్ల అప్పు తీసేసుకోడానికి కేంద్రం నుంచి అనుమతులు కూడా తీసుకొన్నాడు. ఈ ఆర్థిక సంవత్సరాన్ని అప్పులతో మొదలు పెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుంది. ఈనెల 2న రూ.4 వేల కోట్ల అప్పులు రిజర్వు బ్యాంక్ నుంచి తీసుకున్నారు. జగన్ దిగిపోయే నాటికి రాష్ట్రం రూ.13 లక్షల కోట్ల అప్పుల ఊబిలో దిగబోతోంది. ఆర్థిక అరాచకం అంటే ఏమిటో జగన్ చూపిస్తున్నారు' అని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా ఘోరంగా పతనమైందని ఆరోపించారు. సుస్థిరాభివృద్ధి సూచిలో రాష్ట్రం 13వ స్థానానికి పడిపోయిందని, మానవాభివృద్ధి సూచికలో 21వ స్థానానికి దిగజారిపోయిందని తెలిపారు. రాష్ట్రం ఇంకా దిగజారకుండా చూడాలంటే జగన్ రెడ్డిని ఓడించాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

జగన్‌పై చర్యలు తీసుకోండి!

▸▸ సచివాలయ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిపైనా..

▸▸ సీఈవోకు టీడీపీ నేతలు వర్ల రామయ్య, దేవినేని ఉమా ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబును వ్యక్తిగతంగా దూషిస్తూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి నీచ రాజకీయాలకు తెరలేపారని టీడీపీ నేతలు మండిపడ్డారు. టీడీపీని, చంద్రబాబును అసభ్యకరంగా జగన్ దూషిస్తున్నారని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని అమరావతి సచివాలయంలో శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌లో సమావేశాలు నిర్వహిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయన సతీమణిపై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆ వివరాలను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విలేకరులకు వెల్లడించారు. మంత్రి బొత్స సత్యనారాయణ ఆయన సతీమణి ఝాన్సీ ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లో ఎందుకు మీటింగ్ పెట్టారని వర్ల రామయ్య ప్రశ్నించారు. ఆ సమావేశంలో ప్రభుత్వ వాహనాలు వాడారని, వీరిద్దరిపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరామన్నారు. అలాగే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులపై పెట్టిన కేసుల వివరాలివ్వాలని అడిగామన్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా ఇచ్చిన లేఖ ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఇచ్చిన లేఖ కాదని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి లేఖ ఇవ్వాలని, కార్యవర్గ సభ్యుడు కాంతిరాణా లేఖ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఆయన జగన్, సజ్జలకు వ్యక్తిగతంగా కావాల్సిన వ్యక్తి అని విమర్శించారు. తమ పార్టీ అభ్యర్థులపై రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఏమేమి కేసులున్నాయో ఈ నెల 10వ తేదీలోపు తెలపాలని డీజీపీని కోరామన్నారు. చంద్రబాబుపై ఏమేమి కేసులున్నాయో తెలపాలని 10 రోజుల క్రితమే అభ్యర్థిస్తే 13 జిల్లాల నుంచి మాత్రమే సమాచారం వచ్చిందని, మరో 13 జిల్లాల నుంచి ఇంకా వివరాలు అందలేదని తెలిపారు. మాజీ సీఎంపై ఉన్న కేసుల వివరాలు తెలపడానికే ఇన్ని రోజులు పడితే, ఇక మిగిలిన అభ్యర్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దీనిపై డీజీపీకి ఆదేశాలు ఇవ్వాలని సీఈవోను కోరామన్నారు. దేవినేని ఉమ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటమి భయంతోనే జగన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కొంతమంది అక్రమార్కులు జగన్ ప్రభుత్వాన్ని కాపాడుకోడానికి కుట్రలు పన్నుతున్నారని దేవినేని ఉమ మండిపడ్డారు.

పింఛన్ల ఆలస్యం కారకులపై చర్యలు తీసుకోండి

▸▸ సీఈవో మీనాకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ ఆలస్యానికి కారకులపై చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ డిమాండ్ చేసింది. ఆ సంస్థ ప్రతినిధులు నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, ఎల్వీ సుబ్రహ్మణ్యం శనివారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) మీనాను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్న 65 లక్షల మంది లబ్ధిదారుల్ని ఇబ్బంది పెట్టాలని కొందరు ప్రయత్నించారన్నారు. పెన్షన్ల పంపిణీని ఉద్దేశపూర్వకంగా కావాలనే కొందరు ఆలస్యం చేశారన్నారు. ఈ ఆలస్యానికి కారకులు ఎంతటి వారైనా వారిపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరామన్నారు. ఇప్పటి వరకు 94 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తైందని సీఈవో తెలిపారన్నారు. వచ్చే నెలలో ఎన్నికలు ఉన్నందున మే నెల మొదటి తేదీనే లబ్ధిదారులందరికీ పెన్షన్లు అందేట్లు చర్యలు చేపట్టాలని సీఈవోకు విజ్ఞప్తి చేశామని నిమ్మగడ్డ రమేశ్ కుమార్ తెలిపారు.

సిగ్గనిపించడం లేదా!

▸▸ వైసీపీ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశాలపై బుచ్చిరాం ప్రసాద్ ఆగ్రహం

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు బ్రాహ్మణ వర్గాన్ని దుర్మార్గంగా అణిచివేసి ఇప్పుడు అదే వర్గంతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించడానికి సిగ్గనిపించడం లేదా అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చిరాం ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవాలయాలు, పూజారులు, బ్రాహ్మణులపై దాడులు జరిగినప్పుడు జగన్ ఏనాడూ నోరు తెరవలేదని, ఎన్నికల ముందు వారిపై ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తున్నారని విమర్శించారు. 'రామతీర్థంలో రాముడి విగ్రహ ధ్వంసం, అంతర్వేదిలో రథం తగలబడటం, విజయవాడ దుర్గగుడిలో వెండి సింహాల మాయం వంటి ఘటనలపై కనీసం విచారణ జరిపారా? ఎంతమంది దోషులను శిక్షించారు? ఐదేళ్లలో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు ఇచ్చామని సీఎం గొప్పలు చెప్పుకొంటున్నారని, కానీ కార్పొరేషన్ ద్వారా ఒకరికైనా రుణాలు ఇచ్చారా? 6సీ పరిధిలోని దేవాలయాల్లో పూజారులకు వేతనాలు పెంచుతామన్నారు. పెంచారా? చిన్న దేవాలయాల్లో ధూప దీప నైవేద్యాలకు అదనపు సాయం చేస్తామన్నారు. చేశారా?' అని నిలదీశారు.

అవ్వాతాతల మరణాల కారకులపై కేసులు పెట్టాలి: బ్రహ్మంచౌదరి

రాష్ట్రంలో పెన్షనర్ల మరణానికి సీఎం జగన్‌రెడ్డి, సీఎస్ జవహర్‌రెడ్డి, సీఎంవో అధికారి ధనుంజయరెడ్డి, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డిలే కారకులని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మంచౌదరి ఆరోపించారు. ఒకటో తేదీన పెన్షన్లు ఇంటి వద్ద పంచకుండా, సచివాలయాల వద్ద పంచి, 32 మంది అవ్వాతాతల చావుకు కారణమైన వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 'శవరాజకీయాలు జగన్‌కు కొత్తేమీ కాదు. తండ్రి చావుకి రిలయన్స్ కారణమని రాజకీయం చేశాడు. బాబాయి శవాన్ని అడ్డం పెట్టుకుని గత ఎన్నికల్లో సానుభూతి పొందాడు. అన్నమయ్య డ్యాం కూలి 42 మంది చనిపోతే, శవరాజకీయం చేశాడు. ఇప్పుడు పెన్షనర్ల మరణాలను చంద్రబాబుపై నెడుతున్నాడు. ఎన్నికల వేళ తన బినామీ కాంట్రాక్టర్లకు రూ.12.95 కోట్లు దోచిపెట్టిన జగన్.. ఒకటో తేదీన పెన్షన్లు ఇవ్వడానికి ముందే డబ్బులు ఎందుకు డ్రా చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

'యాక్సిస్'పై ఎంత ప్రేమో!

▸▸ ఒప్పందం రద్దయినా సర్కారు రాయితీలు

▸▸ ప్రాజెక్టు పూర్తి చేయకున్నా లబ్ధి

▸▸ గతంలో విండ్, సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు యాక్సిస్‌తో పాటు సుజలాన్ ఒప్పందం

▸▸ జగన్ సీఎం అయ్యాక ఒప్పందం రద్దు

▸▸ ప్రాజెక్టు, విద్యుత్ వర్సిటీ ఏవీ లేవు

▸▸ అయినా సుజలాన్‌ను తప్పించి యాక్సిస్‌కు లబ్ధి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాన్ని ఏదైనా సంస్థ రద్దు చేసుకుంటే ఆ వ్యవహారం అంతటితో ముగిసిపోయినట్లే. ఆ తర్వాత ఎలాంటి సంబంధం ఉండదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు ఉండవు. కానీ యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా అనే సంస్థ ఒప్పందం రద్దు చేసుకున్న తర్వాత కూడా జగన్ సర్కారు రాయితీలు కొనసాగిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా యాక్సిస్‌కు ఆయాచిత లబ్ధి చేకూరుస్తోంది. రాష్ట్రంలో విద్యుదుత్పత్తి ప్లాంటు స్థాపించడంతో పాటు ఇంధన వర్సిటీని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియాతో పాటు సుజలాన్ రాష్ట్ర ప్రభుత్వంతో 2015లో ఒప్పందం చేసుకున్నాయి. 2021 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఒప్పందంలో పేర్కొన్నాయి. ఆ ప్రాజెక్టును పూర్తి చేయడం మాట అటుంచి, జగన్ ప్రభుత్వ హయాంలో ఒప్పందాన్ని కూడా రద్దు చేసుకున్నాయి. ఈ ఒప్పందం రద్దయినా ఆ రెండు సంస్థల్లో ఒకటైన యాక్సిస్‌కు వైసీపీ సర్కారు రాయితీలు కొనసాగిస్తోంది. దీనిపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఒప్పందాలు రద్దయినా...

కేంద్ర సంప్రదాయేతర ఇంధన వనరుల విధానంలో భాగంగా 2015లో 4000 మెగావాట్ల విండ్, సోలార్ విద్యుత్ ప్రాజెక్టును స్థాపించేందుకు సుజలాన్, యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ముందుకొచ్చాయి. ఈ సంస్థలు ప్రతిపాదించిన ప్రాజెక్టుకు రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ రూ.40 కోట్లు, ట్రాన్స్‌కో రూ.200 కోట్లు గ్యారెంటీలు ఇచ్చాయి. 2019లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక విండ్, సోలార్ విద్యుదుత్పత్తి సంస్థలతో రాష్ట్ర డిస్కమ్‌లు చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను అర్ధంతరంగా రద్దు చేసుకున్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సంప్రదాయేతర ఇంధనోత్పత్తి సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను జగన్ సర్కారు రద్దు చేసుకున్నాక.. సుజలాన్, యాక్సిస్ కూడా తమ ప్రాజెక్టు సామర్థ్యం 1672.80 మెగావాట్ల విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిస్కమ్‌లను కోరాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలు రద్దయ్యాయి. 2022లో రాష్ట్ర సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ, ట్రాన్స్‌కో గ్యారెంటీలను రద్దు చేసుకున్నాయి. దీంతో సుజలాన్, యాక్సిస్‌లతో రాష్ట్ర ఇంధన శాఖకు ఎలాంటి సంబంధమూ లేదు. ఆ సంస్థలకు రాయితీలు వర్తించవు. సంయుక్త భాగస్వామ్య ఒప్పందం రద్దయినందున అది రెండు సంస్థలకూ వర్తిస్తుంది. ఓ సంస్థను పక్కనబెట్టి, మరో సంస్థతో ఒప్పందాన్ని కొనసాగించడం నిబంధనలకు విరుద్ధమని ఇంధన రంగ నిపుణులు అంటున్నారు. అయితే జగన్ సర్కారు సుజలాన్‌ను పక్కనబెట్టి యాక్సిస్‌తో ఒప్పందాన్ని కొనసాగిస్తూ రాయితీలు ఇస్తోంది. యాక్సిస్ పట్ల జగన్ సర్కారు ప్రత్యేక ప్రేమ చూపడంపై నిపుణులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. యాక్సిస్ టారిఫ్ ఆర్డర్ పెండింగ్‌లో ఉందంటూ సంప్రదాయేతర ఇంధన వనరుల సంస్థ ప్రకటించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ ఒప్పందం

రాష్ట్ర ఇంధన శాఖతో చేసుకున్న ఒప్పందం మేరకు అనంతపురం జిల్లాలో 4000 మెగావాట్ల విండ్, సోలార్ విద్యుదుత్పత్తిని 2021 నాటికి ప్రారంభిస్తామని సుజలాన్, యాక్సిస్ పేర్కొన్నాయి. రాష్ట్రంలో సంప్రదాయేతర ఇంధన విద్యుత్ వర్సిటీని ఏర్పాటు చేస్తామని వెల్లడించాయి. విండ్ పవర్ బ్లేడ్, టవర్, జనరేటర్ వంటి సదుపాయాలు ప్రాజెక్టు ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని తెలిపాయి. అలాగే ఈ ప్రాజెక్టు ప్రాంగణంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించాయి. అయితే ఒప్పందంలో పేర్కొన్న అంశాలేవీ సుజలాన్, యాక్సిస్ అమలు చేయలేదు. ప్రభుత్వంతో ఒప్పందాలు రద్దయినందున రెండు సంస్థలకూ రాయితీలు వర్తించవు. అయితే యాక్సిస్‌కు మాత్రం గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు రాయితీలు వర్తిస్తాయంటూ జగన్ సర్కార్ చెప్పడంపై పలు ఆరోపణలు వస్తున్నాయి.

సీబీఐతో విచారణ చేయించాలి

ప్రభుత్వంతో ఒప్పందం రద్దయినా యాక్సిస్‌కు జగన్ సర్కారు రాయితీలు కొనసాగించడంపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ డిమాండ్ చేశారు. అక్రమాలు బయటపడాలంటే సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరారు. యాక్సిస్‌కు జగన్ సర్కారు రెడ్ కార్పెట్ వేయడం వెనుక మర్మమేంటో బయట పెట్టాలని బీజేపీతో పాటు రాజకీయ వర్గాలు, ఇంధన రంగ నిపుణులు కోరుతున్నారు.

కేరళలో మూక దాడి.. వలస కూలీ మృతి

కొచ్చి, ఏప్రిల్ 6: స్థానిక మహిళను వేధిస్తున్నాడనే నెపంతో ఓ వలస కార్మికుడిపై మూకదాడి చేసి హతమార్చిన ఘటన కేరళలోని మువట్టుపుళ ప్రాంతంలో జరిగింది. దాడితో సంబంధం ఉన్న పదిమంది నిందితుల్ని ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే... అశోక్‌దాస్(24) అనే వ్యక్తి అరుణాచల్‌ప్రదేశ్ నుంచి పని నిమిత్తం కేరళకు వచ్చి కొంతకాలంగా మువట్టుపుళ సమీపంలోని వలకంలో ఇంటిని అద్దెకు తీసుకుని జీవిస్తున్నాడు. అయితే, గురువారం సాయంత్రం మహిళ ఇంటికి వెళ్లి రభస చేయడంతో ఆగ్రహించిన స్థానికులు అతన్ని స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టారు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను కొలెన్‌చెర్రీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు.

ఢిల్లీలో చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా గుట్టు రట్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: ఢిల్లీలో బాలల అక్రమ రవాణా(చైల్డ్ ట్రాఫికింగ్)కు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టు అయింది. చిన్నారులను అక్రమంగా విక్రయిస్తున్న ఏడుగురు ముఠా సభ్యులను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. చిన్నారులను విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీబీఐ అధికారులు శుక్రవారం సాయంత్రం ఢిల్లీ, హరియాణాలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ముఠా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న రోజున్నర, 15 రోజుల వయస్సు గల ఇద్దరు శిశువులను స్వాధీనం చేసుకున్నారు. "ఈ ముఠా పేదవాళ్ల నుంచి పిల్లలను కొని.. వారిని రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు విక్రయిస్తున్నారు" అని ఓ అధికారి తెలిపారు.

ఎన్నికలు కాగానే పది వేల కోట్ల విద్యుత్తు భారం

▸▸ సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబూరావు

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా వినియోగదారులపై రూ.20,000 కోట్ల భారాన్ని వేసిన విద్యుత్తు పంపిణీ సంస్థలు.. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే మరో పది వేల కోట్ల రూపాయల భారాన్ని వేసేందుకు సిద్ధంగా ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భారానికి తోడు విద్యుత్తు స్మార్ట్ మీటర్ల గుదిబండ వినియోగదారుల నెత్తిన పడబోతున్నదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యుత్తు చార్జీలను పెంచబోమని చెప్పే ధైర్యం తెలుగుదేశం పార్టీకి ఉందా? అని బాబూరావు నిలదీశారు.

టిప్పర్ మొరం మీద పడి.. ముగ్గురు పిల్లల సజీవ సమాధి

హుజూరాబాద్/దమ్మపేట, ఏప్రిల్ 6: ఎదురుగా టిప్పర్ వస్తోందని రోడ్డు పక్కన ఆగడమే ఆ ముగ్గురు పిల్లలు చేసిన పాపమైంది. రాత్రివేళ నిర్లక్ష్యంతో వేగంగా టిప్పర్‌ను నడుపుకుంటూ వచ్చిన డ్రైవర్ వాళ్లను చూసి సడెన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో టిప్పర్ అదుపు తప్పి బోల్తాపడింది. అందులోని మొరం(మట్టి) అంతా ఆ ముగ్గురిపై పడింది. చిన్నారులు అందులో కూరుకుపోయి సజీవ సమాధి అయ్యారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దారుణం జరిగింది. టిప్పర్‌లో ఉన్న మట్టి పిల్లల మీద పడటంతో గ్రామానికి చెందిన అన్నాచెల్లెళ్లు గంట విజయ్ (17), గంట వర్ష (15), వాళ్ల బంధువు గంట సింధూజ(18) అక్కడికక్కడే చనిపోయారు.

కాపురం చేసుకుంటుంటే మళ్లీ రేప్ కేసు ఎందుకు?

కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6: పర్యవసానాలపై పూర్తి అవగాహన కలిగిన మహిళ పురుషునితో సంబంధం పెట్టుకొని అనంతరం మోసపోయానంటూ చెప్పలేదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానంటూ తప్పుడు హామీ ఇచ్చి మోసగించినట్టు కచ్చితమైన ఆధారాలు ఉంటే తప్ప దీన్ని నేరంగా పరిగణించలేమని తెలిపింది. మాయమాటలను నమ్మి అంగీకరించానంటూ ఆ మహిళ చెప్పలేదని పేర్కొంది. తనను పెళ్లి చేసుకుంటానంటూ శారీరక సంబంధం పెట్టుకొని, ఆ తరువాత నిరాకరించాడంటూ ఓ పురుషునిపై ఓ మహిళ రేప్ కేసు పెట్టింది. ఆ తరువాత సంప్రదింపులు జరగడంతో ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిని పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ అనూప్ కుమార్ మెండిరట్ట ఇద్దరు వివాహం చేసుకొని ఆనందంగా ఉన్నందున విచారణ అవసరం లేదంటూ కేసును కొట్టివేశారు. అయితే ఇలాంటి కేసులకు సంబంధించి నేరారోపణలు చేసే విషయమై స్పష్టత చేశారు. అన్నీ తెలిసే ఆమె అతనితో సంబంధం పెట్టుకుందని న్యాయమూర్తి తెలిపారు. పెళ్లి చేసుకుంటానన్న హామీతోనే ఆ పురుషుడు కూడా సంబంధం పెట్టుకున్నాడని, కానీ కుటుంబసభ్యుల ఒత్తిడి మేరకు తరువాత నిరాకరించాడని గుర్తు చేశారు. మోసం చేయాలన్న దురుద్దేశంతో కాకుండా తదనంతర పరిస్థితుల కారణంగా పెళ్లి చేసుకోలేనని చెప్పాడని అభిప్రాయపడ్డారు. ఇద్దరు పెళ్లి చేసుకొని సంతోషంగా జీవితం గడుపుతున్నందున రేప్ కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని తెలిపారు. కేసుపై విచారణ జరిపితే చట్టాన్ని దుర్వినియోగం చేసినట్టు అవుతుందని పేర్కొంటూ దానిని కొట్టివేశారు.

విమానంలో మద్యంమత్తులో మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

▸▸ వారించిన సిబ్బందిపై దూషణలు

▸▸ తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుడి అరెస్టు

రేణిగుంట, ఏప్రిల్ 6: విమానంలో మద్యం మత్తులో ఓ ప్రయాణికుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వారించేందుకు ప్రయత్నించిన సిబ్బందినీ దూషించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్యా జిల్లా రాజంపేట మండలం వరదయ్యగారిపల్లెకు చెందిన రెడ్డయ్య దుబాయ్ నుంచి వస్తూ హైదరాబాద్‌లో దిగారు. అక్కడి నుంచి స్పైస్ జెట్ విమానంలో శనివారం ఉదయం తిరుపతికి బయల్దేరారు. ఆయన మద్యం మత్తులో అనుచితంగా ప్రవర్తించారు. బాధిత మహిళా ప్రయాణికురాలితో కలసి విమాన సిబ్బంది ఫిర్యాదు చేశారు. తిరుపతి విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది రెడ్డయ్యను అదుపులోకి తీసుకుని ఏర్పేడు పోలీసులకు అప్పజెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

సంతోష్ అలియాస్ సాగర్ దుర్మరణం

▸▸ మృతుడు మావోయిస్టు రీజనల్ కంపెనీ కమాండర్

▸▸ మరో ఇద్దరు మావోయిస్టులు మృతి

చర్ల/వెంకటాపురం/కాటారం/మహబూబాబాద్(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 6: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మరోమారు తుపాకీ గర్జించింది. తెలంగాణ గ్రేహౌండ్స్-ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో.. మావోయిస్టులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు దుర్మరణంపాలయ్యారు. వీరిలో తెలుగువాడైన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ(ఎస్‌జడ్) సభ్యుడు, రెండో రీజనల్ కంపెనీ కమాండర్ అన్నె సంతోష్ అలియాస్ శ్రీధర్ అలియాస్ సాగర్ ఉన్నారు. ఇతని తలపై రూ.25 లక్షల రివార్డు ఉంది. మృతిచెందిన మరో ఇద్దరు మావోయిస్టుల్లో ఒకరిని మణిరాం అని గుర్తించగా.. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు మృతుల పేర్లను అధికారికంగా ప్రకటించకున్నా.. మావోయిస్టు నేత ఆజాద్ పేరిట విడుదలైన ఓ లేఖ ద్వారా మృతుల్లో సంతోష్, మణిరాం ఉన్నట్లు స్పష్టమవుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు బలగాల కూంబింగ్ విస్తృతమైంది. తెలంగాణ గ్రేహౌండ్స్ పోలీసులు కూడా సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం జల్లెడ పడుతున్నారు. శనివారం తెల్లవారుజామున 5.30 సమయంలో ఇటు గ్రేహౌండ్స్.. అటు ఛత్తీస్‌గఢ్ బలగాలు కూంబింగ్‌లో ఉండగా.. బీజాపూర్ జిల్లా కాంకేర్ సమీపంలోని పూజార కాంకేర్ గ్రామం సమీపంలోని కర్రి(ఛత్తీస్‌గఢ్), తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం దోలిగుట్టల అడవుల్లో మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో.. ఇరువైపులా కాల్పులు మొదలయ్యాయి. సుమారు గంటసేపు తుపాకులు గర్జించాయి. కాల్పులు నిలిచిపోయిన కొంతసేపటికి ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఆ ప్రాంతంలో పరిశీలించగా.. ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఘటనాస్థలి నుంచి ఒక లైట్ మెషీన్ గన్(ఎల్ఎంజీ), ఒక ఏకే-47, తూటాలు, పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని పోలీసులు తెలిపారు. అయితే.. మృతుల్లో సంతోష్ అలియాస్ సాగర్, మణిరాం, మరొకరు ఉన్నట్లు పేర్కొంటూ భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ సభ్యుడు ఆజాద్ పేరిట శనివారం సాయంత్రం ఓ లేఖ విడుదలైంది. భూటకపు ఎన్‌కౌంటర్లకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ములుగు ఎస్పీ కనుసన్నల్లో మావోయిస్టుల ఎన్‌కౌంట్ల పరంపర కొనసాగుతోందని ఆజాద్ ఆరోపించారు. "బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలది ఒకే వ్యూహం. మావోయిస్టు పార్టీని నిర్మూలించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాయి. దండకారణ్యాన్ని పోలీసు క్యాంపులతో నింపేస్తున్నారు. డ్రోన్లు హెలికాప్టర్ల ద్వారా దాడులు చేయిస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్రలో ముగ్గురు మావోయిస్టులపై విషప్రయోగం చేసి, ఆ తర్వాత కిరాతకంగా హింసించి ఎన్‌కౌంటర్ కథ అల్లారు. శనివారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఎస్‌జడ్ సభ్యుడు సాగర్, మణిరాం, మరో మావోయిస్టు మృతిచెందారు. మావోయిస్టుల ఎజెండానే తన ఎజెండా అని ప్రకటించిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక నియంతలా వ్యవహరించారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా పోలీసులతో దాడులు చేయిస్తోంది. ఈ ఎన్‌కౌంటర్లకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి" అని ఆ లేఖలో పేర్కొన్నారు. అన్నె సంతోష్ అలియాస్ శ్రీధర్ అలియాస్ సాగర్ స్వస్థలం జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అంకుసాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దస్తగిరిపల్లి.

వలంటీర్లను తప్పుబట్టం!

▸▸ ప్రస్తుత ప్రభుత్వం సంపద సృష్టించకపోగా భారం మోపింది

▸▸ సీఎఫ్‌డీ చర్చలో నిమ్మగడ్డ వ్యాఖ్యలు

▸▸ వలంటీర్లపై అనేక ఫిర్యాదులు: ఎల్వీ

▸▸ ప్రభుత్వాలు పెట్టుబడి వ్యయం పెంచాలి

▸▸ 'ఎకనమిక్ వీక్లీ' ఎడిటర్ మహేంద్రదేవ్

చాలీచాలని జీతం ఇచ్చి రాజకీయాలకు వాడుతున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న 'ఎకనమిక్ వీక్లీ' ఎడిటర్ మహేంద్ర దేవ్, వేదికపై నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, ఎల్వీ సుబ్రహ్మణ్యం

విజయవాడ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వలంటీర్లను తాము తప్పుబట్టడం లేదని రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ(సీఎఫ్‌డీ) కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అన్నారు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీబీటీ విధానంలోనే లబ్ధిదారులకు సొమ్ములు ఇస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో పెన్షన్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారని చెప్పారు. "పెన్షన్లు ఇవ్వడానికి వలంటీర్లు ఉండాలా? వారు లేకపోతే ఇవ్వలేరా? అని హైకోర్టు అడిగితే ఈ ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదు. డీబీటీ స్కీంలకు ఎలాంటి మధ్యవర్తిత్వం ఉండకూడదు. దేశం మొత్తం మీద రాష్ట్రంలోనే నిరుద్యోగం అధికంగా ఉంది. దీన్ని ఉపయోగించుకుని చాలీచాలని వేతనం ఇచ్చి వలంటీర్లను నియమించారు. దీనిలో చేరిన వారు వలంటీర్లుగా ఉండలేరు. అలాగని బయటకు వెళ్లలేరు. ఇప్పుడు వారిని రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నారు. వలంటీర్లను మేం తప్పుబట్టడం లేదు. 2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వలంటీర్లను ఆ ఎన్నికల్లో భాగస్వాములను చేయవద్దని రాజకీయ పక్షాలు ఎన్నికల సంఘానికి విన్నవించాయి. ఆనాడే వలంటీర్ల వ్యవస్థపై హైకోర్టు స్పందించింది. వలంటీర్లను కొనసాగిస్తామని అధికార పార్టీ చెబుతుండగా, మార్పులతో తామూ కొనసాగిస్తామని ప్రతిపక్షం చెప్పడం రాజకీయ అవకాశవాదం" అని రమేశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. సీఎఫ్‌డీ ఆధ్వర్యంలో 'అభివృద్ధితో సంక్షేమ-సుపరిపాలనకు సవాళ్లు' అనే అంశంపై శనివారం విజయవాడలో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు ఆదాయం కంటే అప్పులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఒక్కో వ్యక్తిపై రూ.2 లక్షల అప్పు ఉందని తెలిపారు. సీఎఫ్‌డీ చేసిన సూచనతోనే వలంటీర్లను పక్కన పెట్టాలని ఎన్నికల సంఘం చెప్పిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంపద సృష్టించడం లేదని, భారం మాత్రమే మోపుతోందని విమర్శించారు. వలంటీర్ల ద్వారా ప్రజల జుట్టును చేతుల్లో పెట్టుకోవాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. వలంటీర్లు రాజీనామా చేసి ఎన్నికల ఏజెంట్లుగా కూర్చోవడం సమర్థనీయం కాదన్నారు.

వలంటీర్లపై ఫిర్యాదులు: ఎల్వీ

మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఎన్నికల్లో వలంటీర్ల ప్రభావం ఉంటుందని తాము సీఈసీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వలంటీర్ల పనితీరుపై అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. పథకాలు అందుకునే వారి భావాలను వలంటీర్లు ప్రభావితం చేసే స్థాయికి వచ్చారని ఆరోపించారు. "మేం ఎవరి మోచేతి నీళ్లు తాగడం లేదు. మా ఆలోచన అంతా అభివృద్ధి కోసమే. ఒక రాజకీయ పార్టీకి అండగా ఉండే అధికారులు చింతించాల్సిన రోజు వస్తుంది. ప్రభుత్వ యంత్రాంగాన్ని కొంత మంది అభాసుపాలు చేస్తున్నారు. కలెక్టర్ నుంచి సీఎస్ వరకు అంతా నిష్పక్షపాతంగా ఉండాలి" అని సూచించారు. సీఎఫ్‌డీలో రాజకీయ పార్టీలకు సంబంధించిన వారు ఎవరూ లేరన్నారు. వలంటీర్లను సీఈసీ వద్దని చెప్పిన తర్వాత అధికారులు తమను నిందించడం సరికాదన్నారు.

పెట్టుబడి సాయం పెంచాలి

చర్చా కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న 'ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సంపాదకుడు మహేంద్రదేవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు పెట్టుబడి వ్యయాన్ని పెంచాలని, తద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రజలకు ఆదాయ మార్గాలు పెరుగుతాయన్నారు. దేశంలో స్వర్ణ చతుర్భుజిపై పెట్టుబడి పెట్టిన తర్వాత అద్భుతమైన జాతీయ రహదారులు ఏర్పడ్డాయన్నారు. వాటికి ఇరువైపులా వ్యాపారాలు పెరిగాయని వివరించారు. ప్రజలకు ఉచితాలు అందజేయడం కంటే పెట్టుబడి వ్యయం పెంచడంపై ఎక్కువగా దృష్టి సారించాలని చెప్పారు.

జగన్ వ్యక్తిగత సేవలో ఐఏఎస్‌లు

అధికారులు తప్పు చేస్తే ప్రశ్నించడం తప్పా?

టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిరామ్ ధ్వజం

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కొందరు ఐఏఎస్ అధికారులు జేపీఎస్(జగన్ పర్సనల్ సర్వీస్) అధికారులుగా మారారని టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. శనివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొంత మంది ఐఏఎస్ అధికారులు తాడేపల్లి ప్యాలెస్‌కు ఊడిగం చేస్తూ ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం సన్నగిల్లేలా వ్యవహరించారన్నారు. అధికారులు తప్పు చేస్తుంటే బాధ్యత గల ప్రతిపక్షంగా నిలదీయడం తప్పా? అని ప్రశ్నించారు. ఇలాంటి అధికారుల నేతృత్వంలో రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయన్న నమ్మకం ప్రజల్లో లేదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల తప్పుల్ని ప్రశ్నించకూడదని రాజ్యాంగంలో ఉందా? అని ప్రశ్నించారు. ఇటీవల ఈసీ ఐదుగురు ఐపీఎస్ అధికారుల్ని, ముగ్గురు ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేసిందని తెలిపారు. అలాంటి వారు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను సీఎస్ తుంగలో తొక్కారన్నారు. వైసీపీ పాలనలో కొందరు పోలీసు అధికారుల నిర్వాకంతో వ్యవస్థకు చెడ్డపేరు వచ్చిందని, పోలీసుశాఖపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని చెప్పారు. టీడీపీ నేతలు, ప్రతిపక్షాలు ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోకుండా తిరిగి ఎదురుదాడి చేస్తున్నారని ఆక్షేపించారు. రాష్ట్రంలో ఊడిగం చేసిన అధికారుల కారణంగా బాధితులే నేరస్థులైన పరిస్థితి నెలకొందన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో జరిగిన అఘాయిత్యాలపై ఏం చర్యలు తీసుకున్నారో కాంతిరాణా టాటా చెప్పాలని డిమాండ్ చేశారు.

6.69 లక్షల టన్నుల బొగ్గు విక్రయానికి చర్యలు

▸▸ సూలియారి కోల్‌బ్లాక్ కేంద్రంగా వేలం

▸▸ షెడ్యూల్ ఇచ్చిన ఏపీఎండీసీ

అమరావతి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) సూలియారి కోల్‌బ్లాక్‌లో తన వాటాకొచ్చే బొగ్గును వేలం ద్వారా విక్రయించాలని షెడ్యూల్ ఇచ్చింది. దేశంలో సూక్ష్మ, చిన్న తరహా కంపెనీలు, సంస్థలకు(ఎమ్ఎస్ఎమ్ఈ) వేలం ద్వారా జీ-6 గ్రేడ్ బొగ్గును అమ్మాలనుకుంటోంది. వేలం ద్వారా వచ్చే సొమ్ము పూర్తిగా ఎండీసీకి దక్కనుంది. వేలం ప్రక్రియను బెంగాల్‌కు చెందిన ఎమ్‌జంక్షన్ అనే ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టారు. దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఈలు ఈ వేలంలో పాల్గొనవచ్చు. సూలియారి కోల్‌బ్లాక్‌లో 2024-2025లో తొలి త్రైమాసికంలో భాగంగా 6.69 లక్షల బొగ్గును వేలం ద్వారా ఎమ్ఎస్ఎమ్ఈలకు విక్రయించనుంది. దేశవ్యాప్తంగా ఎన్నికల షెడ్యూల్ అమల్లోకి వచ్చిన తర్వాత, ఎన్నికలు జరిగే తేదీలకు కొద్దిరోజుల ముందే బొగ్గువేలం తేదీలను ఖరారు చేశారు. మే 2, జూన్ 2న వేలం నిర్వహించనున్నారు. పైగా ఇతర రాష్ట్రాల్లో వేలం జరగనుంది. ఏపీలో గనుల శాఖ టెండర్లు నిర్వహిస్తేనే కొందరు అధికారులు అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. బెరైటీస్, బీచ్‌శాండ్, ఇతర ఖనిజాల టెండర్లలో కంపెనీలకు మేలు జరిగేలా నిబంధనలు మార్చారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక వేలం నోటీసు ఇవ్వడం, ఏపీలో ఎన్నికలు జరగడానికి కొద్దిరోజుల ముందు మిగిలిన ప్రక్రియను పూర్తిచేయాలని నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది.

ధనుశ్ వల్లే కలిశాం

ప్రేమించి పెళ్లి చేసుకున్న సెలబ్రిటీ కపుల్స్‌లో నయనతార, స్టార్ డైరెక్టర్ విఘ్నేష్‌శివన్ ఒకరు. రీసెంట్‌గా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వీరిద్దరూ తమ పరిచయాన్ని గుర్తుచేసుకున్నారు.

"2015లో మొదటిసారి 'నేనూ రౌడీ నే' చిత్రం ద్వారా మేమిద్దరం కలుసుకున్నాం. మా కలయికకు కారణం ధనుశ్. 'నేనూ రౌడీ నే' చిత్రానికి హీరోయిన్‌గా నయనతార అయితే పర్‌ఫెక్ట్‌గా ఉంటుందని ఈ సినిమా నిర్మాత, నటుడు ధనుశ్ చెప్పారు. దాంతో నేను ఈ స్టోరీని ఆమెకు నెరేట్ చేశాను. కథ నచ్చి ఆమె వెంటనే ఈ సినిమాకు అంగీకరించారు. ఈ సినిమా షూటింగ్‌లోనే మా పరిచయానికి బీజం పడింది" అని విఘ్నేష్ తెలిపారు. "విఘ్నేష్‌తో పరిచయం కొద్దికాలంలోనే ధృడమైన బంధంగా మారింది. అత్యంత సహజంగా మా మధ్య ప్రేమ చిగురించి అది పెళ్లికి దారితీసింది" అని నయనతార చెప్పారు. వీరిద్దరూ 2022లో వివాహబంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే.





తగిన సమయం కాదు

'హార్ట్ అటాక్' సినిమాలో హయతి పాత్రతో కుర్రకారును ఆకట్టుకున్నారు అదాశర్మ. ఆ తర్వాత పలు తెలుగు, హిందీ చిత్రాల్లో నటించి.. 'ది కేరళ స్టోరీ' సినిమాతో సంచలన విజయం అందుకున్నారీ నటి. గతేడాది ఈ నటి, దివంగత నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఇంటి వద్ద కనిపించారు. అప్పటి నుంచి ఆమె ఈ ఇంటిని కొనుగోలు చేశారని ఊహాగానాలు వినపడుతున్నాయి. తాజాగా మీడియాతో జరిపిన ఓ సంభాషణలో ఆమె ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. "ప్రస్తుతం నేను ప్రేక్షకుల గుండెల్లో నివసిస్తున్నా. కాబట్టి నేను ఏ ఇంటినీ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. అయినా ఈ విషయంపై మాట్లాడేందుకు తగిన సమయం ఇది కాదు. నేను ఈ ఇంటిని చూడటానికి వచ్చినప్పుడు మీడియా దృష్టంతా ఇక్కడే ఉంది. నేను వ్యక్తిగత స్వేచ్ఛను ఇష్టపడతాను. నా సినిమాలు పబ్లిక్ దృష్టిని ఆకర్షించాలని కోరుకుంటా, నా వ్యక్తిగత విషయాలు కాదు. సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ మంచి నటుడు, ఆయనపై అపారమైన గౌరవం ఉంది. ఆయన ఉన్నంత కాలం మంచి సినిమాలతో అందరినీ అలరించారు. ఆయన ప్రస్తుతం ఈ భూమ్మీద లేరు. అలాంటి వ్యక్తి ఇంటి గురించి వార్తలు ప్రచారం అవ్వడం బాధాకరం" అని చెప్పారు.



ఆ క్షణం చాలా ఆందోళన చెందాను

'పుష్ప', 'యానిమల్' వంటి పాన్‌ఇండియా చిత్రాలతో బాలీవుడ్‌లోనూ మంచి ఫాలోయింగ్‌ను తెచ్చుకున్నారు రష్మిక మందన్న. ప్రస్తుతం ఆమె నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ఛావా'. ఈ చిత్రం ఛత్రపతి శివాజీ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహరాజ్ బయోపిక్‌గా తెరకెక్కుతోంది. టైటిల్ రోల్‌లో విక్కీ కౌశల్ నటిస్తున్నారు. తాజాగా ఓ బాలీవుడ్ టాక్ షోలో ఈ చిత్రం గురించి, సహనటుడు విక్కీకౌశల్ గురించి పలు విశేషాలను ఆమె పంచుకున్నారు.

"ఛావా' చిత్రబృందంతో కలసి పనిచేయడం మరిచిపోలేని అనుభూతి. ఈ చిత్రంలో నా పాత్ర తాలూకు షూటింగ్ అయిపోయింది. నా షూటింగ్ సమయం ఇంకొన్ని రోజులు ఉంటే బాగుండనిపిస్తోంది. ఈ చిత్రం షూటింగ్ విశేషాల గురించి నేను తరచూ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్‌తో మాట్లాడుతుంటాను. ఈ షూటింగ్ సమయంలో విక్కీకౌశల్ గాయపడడం నన్ను ఎంతో ఆందోళనకు గురిచేసింది. ఆయన కోలుకోగానే మనసు కుదుటపడింది. ఈ చిత్రం షూటింగ్‌లో విక్కీ నాకు ఎంతో సపోర్ట్ చేశారు, ఆయన బంగారం లాంటి వ్యక్తి' అని రష్మిక చెప్పారు.

బర్త్‌డే విషెస్

శుక్రవారం తన పుట్టినరోజును రష్మిక గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు.పలువురు నటులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఛావా' కోస్టార్ విక్కీకౌశల్ ఆమెకు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో శుభాకాంక్షలు తెలిపారు. "ప్రియమైన రష్మికకు పుట్టినరోజు శుభాకాంక్షలు. నీతో కలసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎంతో ఆనందాన్నిచ్చే విషయం. నువ్వెప్పుడూ ఇంతే పాజిటివ్‌గా, ఎనర్జిటిక్‌గా ఉండాలి" అని విష్ చేశారు.



పురాణ పాత్రలకు సై



రెగ్యులర్ పాత్రల్లో ఎంత రాణించినా, స్టార్‌డమ్ సంపాదించినా చారిత్రక, జానపద, పౌరాణిక చిత్రాల్లో నటించాలనే కోరిక కొంతమంది హీరోల్లో ఉందనే చెప్పాలి. కానీ పురాణాలు, ఇతిహాసాలు ఆధారంగా తెరకెక్కే చిత్రాలు ఈ రోజుల్లో చాలా తక్కువే. అందుకే అలాంటి అవకాశం వస్తే కథానాయకులు కళ్లకద్దుకుంటున్నారు. రొటీన్ హీరో పాత్రలకు భిన్నంగా ఉండడం, తమలోని నటుణ్ణి విభిన్నంగా ఆవిష్కరించుకునే అవకాశం కావడంతో పురాణ పాత్రలకు పలు పరిశ్రమలకు చెందిన అగ్రహీరోలు సైతం సై అంటున్నారు.

లవర్‌బాయ్‌గా పలు ప్రేమకథా చిత్రాల్లో ప్రేక్షకులను అలరించారు రణ్‌బీర్‌కపూర్. ఇటీవలే విడుదలైన 'యానిమల్' చిత్రంలో ఆయన క్రౌర్యాన్ని ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. తనలోని నటుడికి సవాల్ విసిరే పాత్రతో ఈసారి ఆయన ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముని పాత్రలో రణ్‌బీర్ కనిపించబోతున్నారు. ఇప్పటికే ఆయన శ్రీరాముని పాత్ర కోసం సన్నాహాలు మొదలుపెట్టారు. విల్లు ఎక్కుపెట్టడంలో నైపుణ్యం సాధించేందుకు సాధన కొనసాగిస్తున్నారు. తన కెరీర్‌లో ఇప్పటిదాకా ఎలాంటి పాత్ర చేసినా నటనలో వంకలు పెట్టడానికి వీల్లేని నటుడిగా రణ్‌బీర్‌కు పేరుంది. ఇక ఇప్పుడు శ్రీరాముని పాత్రనూ ఆయన అద్భుతంగా పండించగలరనడంలో ఎలాంటి సందేహం లేదు అంటున్నారు అభిమానులు. రాముని పాత్రకోసం తన అలవాట్లు మార్చుకున్నారు రణ్‌బీర్. మద్యం, మాంసాహారాన్ని మానేసినట్లు చెప్పారు. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక ఇదే చిత్రంలో రావణుని పాత్రకు హీరో యశ్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. హీరోగా ఆయన ఫాలోయింగ్ పీక్స్‌లో ఉంది. మరి ఇలాంటప్పుడు ఆయన నెగెటివ్ రోల్ చేసేందుకు ముందుకొస్తారా అనేది డౌటే. కొద్ది రోజుల్లో ఈ విషయంపై క్లారిటీ వస్తుంది. ఇక ఈ చిత్రంలో సాయిపల్లవి సీత పాత్ర కోసం ఖరారయినట్టే అని బాలీవుడ్ టాక్.

పరమ శివునిగా ప్రభాస్

'సలార్' చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకున్నారు ప్రభాస్. త్వరలోనే ఈ చిత్రం సీక్వెల్‌తో అలరించనున్నారు. ఇలాంటి యాక్షన్ రోల్సే కాదు ఇప్పుడున్న చాలా మంది యువ హీరోల్లో పురాణ పాత్రల్లో నటించే అరుదైన అవకాశమూ ప్రభాస్‌కే దక్కిందని చెప్పాలి. 'ఆదిపురుష్' చిత్రంలో ఆయన శ్రీరాముని పాత్రలో నటించి మెప్పించారు. సినిమాపైన ఎన్ని విమర్శలు వచ్చినా శ్రీరాముడిగా పాత్రలో ఒదిగిపోయి శభాష్ అనిపించుకున్నారు. ఇప్పుడు మరోసారి ఆయన దేవుని పాత్రలో కనిపించనున్నారు. మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో ప్రభాస్ పరమశివుని పాత్రలో నటిస్తున్నారు. గతంలో ఎన్టీఆర్, చిరంజీవి మహాశివుడి పాత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నటన ప్రదర్శించారు. ఇప్పుడు ఇక ప్రభాస్ వంతు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'కల్కి 2898 ఏడీ' చిత్రం మహాభారత యుద్ధంతో మొదలై కల్కి రాకతో ముగుస్తుంది. అంటే ఈ రెండు అంశాలూ పురాణ సంబంధమైనవే. ఆ నేపథ్యంలో వచ్చే సన్నివేశాల్లో ప్రభాస్ కృష్ణుడిగా, కల్కిగా కనిపించనున్నారనే మాట వినిపిస్తోంది.

ఇద్దరు కర్ణులు

ప్రస్తుతం 'కంగువ' చిత్రం పనులతో బిజీగా ఉన్నారు సూర్య. మాస్ హీరోగానూ, అభినయ ఆస్కారమున్న కథానాయక పాత్రల్లోనూ సూర్య తనదైన అభినయంతో ఆకట్టుకున్నారు. మహాభారతం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఓ చిత్రానికి ఆయన ఎస్ చెప్పారని కోలీవుడ్ టాక్. ఈ చిత్రంలో ఆయన కర్ణుడిగా అలరించనున్నారు. బాలీవుడ్ దర్శకుడు రాకేశ్ ఓం ప్రకాశ్ మెహ్రా కర్ణుడి పాత్ర ప్రధానంగా తీసుకొని ఓ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'కంగువ' పూర్తవ్వగానే సూర్య ఈ సినిమాను పట్టాలెక్కించే అవకాశముంది. ఈ చిత్రంలో సూర్యకు జోడీగా జాన్వీకపూర్ నటించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.


చారిత్రక నేపథ్యంలో సాగే కాల్పనిక గాథగా తెరకెక్కిన 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో కరికాల చోళుడిగా విక్రమ్ రౌద్ర రసాన్ని ఒలికించిన తీరు ప్రేక్షకులు మరువలేరు. ఇప్పుడు మరోసారి ఆయన యుద్ధభూమిలో గర్జించేందుకు సిద్ధమవుతున్నారు. కర్ణుడి పాత్రలో విక్రమ్ కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి ఆర్ ఎస్ విమల్ దర్శకుడు. 'సూర్యపుత్ర కర్ణ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 2017లోనే మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. కానీ సెట్స్ పైకి వెళ్లలేదు. ఈ ఏడాది ఈ చిత్రం షూటింగ్ మొదలుపెట్టబోతున్నట్లు దర్శకుడు ప్రకటించారు. వషు భగ్నానీ, జాకీ భగ్నానీ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

అశ్వత్థామగా షాహిద్ కపూర్

షాహిద్ కపూర్ కథానాయకుడిగా ఆగిపోయిన 'అశ్వత్థామ' ప్రాజెక్ట్ మళ్లీ మొదలైంది. ఇందులో మహాభారత యుద్ధం నేపథ్యంలో కొంత భాగం సాగుతుంది. ఆ పోర్షన్‌లో షాహిద్ కపూర్ అశ్వత్థామగా అలరించనున్నారు.



మనిద్దరం కదా తోడు దొంగలం



నేషనల్ ఆర్ట్ థియేటర్స్ పేరుతో చిత్ర నిర్మాణ సంస్థను నెలకొల్పి ఎన్టీఆర్ నిర్మించిన తొలి సినిమా 'పిచ్చి పుల్లయ్య'. తన రూమ్మేట్, విజయా సంస్థలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసే తాతినేని ప్రకాశరావును ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం చేశారు ఎన్టీఆర్. ప్రకాశరావు, ఎస్వీ రంగారావు మంచి మిత్రులు. ఆయన్ని దృష్టిలో పెట్టుకుని సినిమాలో ఓ పాత్ర క్రియేట్ చేశారు ప్రకాశరావు. అయితే ఆ పాత్రకు గుమ్మడిని తీసుకున్నారు ఎన్టీఆర్. షూటింగ్‌లో ప్రతి షాట్ హావభావాలతో చేసి చూపించడం ప్రకాశరావు పద్ధతి. ఆయన దృష్టిలో రంగారావు ఉండడంతో ఎస్వీఆర్ మేనరిజమ్స్, ఎక్స్‌ప్రెషన్స్ చేసి చూపించి గుమ్మడిని అలాగే చేయమన్నారు ప్రకాశరావు. ఈ సినిమా విడుదల అయ్యాక రంగారావుని ఇమిటేట్ చేశారనే విమర్శలు వినిపించాయి.

ఈ సినిమా పెద్దగా ఆడకపోయినా వెంటనే 'తోడు దొంగలు' చిత్రాన్ని నిర్మించారు ఎన్టీఆర్. ఇందులో తన పాత్రతో సమానమైన కేరెక్టర్‌ను గుమ్మడికి ఇచ్చి ప్రోత్సహించారు ఎన్టీఆర్. 'తోడు దొంగలు' చిత్రం తొలి కాపీ వచ్చిన తర్వాత అక్కినేని నాగేశ్వరరావుకి ప్రత్యేకంగా ప్రీవ్యూ వేసి చూపించారు రామారావు.

ఆ మర్నాడు ఎన్టీఆర్, ఏయన్నార్ ఎన్.ఎ.టి ఆఫీసులో కలిశారు. ఆ సమయంలో గుమ్మడి కూడా అక్కడే ఉన్నారు. 'ఎలా ఉంది బ్రదర్ పిక్చర్?' అని అడిగారు ఎన్టీఆర్. 'చాలా బాగుంది బ్రదర్.. కానీ గుమ్మడిగారు ఈ వేషం వేయకూడదు' అన్నారు అక్కినేని. 'అదేమిటి బ్రదర్.. వెంకటేశ్వరరావుగారు బాగా చేశారు కదా.. అలా అంటారేమిటి?' అని అడిగారు ఎన్టీఆర్. 'నిజమే.. ఆయన బాగా చేశారు కానీ.. ప్రజల దృష్టిలో, పరిశ్రమ వర్గాల దృష్టిలో తోడు దొంగలు అంటే మనిద్దరమే కదా' అని అక్కినేని జోక్ చేయగానే ఎన్టీఆర్ పకపకా నవ్వేశారు. యోగానంద్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'తోడు దొంగలు' చిత్రం 1954లో విడుదల అయింది. సినిమా ఫ్లాప్ అయినా ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ స్థాయిలో ప్రశంసా పత్రం పొందింది.

మేమేం సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకోలేదు



నటుడు సిద్ధార్థ్, అదితిరావు హైదరీ ఇటీవలే ఎంగేజ్‌మెంట్ చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ అవార్డ్ ఫంక్షన్‌లో పాల్గొన్న సిద్ధార్థ్.. తన నిశ్చితార్థం గుట్టు చప్పుడు కాకుండా జరిగింది అని వస్తోన్న ప్రచారాలపై స్పందించారు. "మా ఎంగేజ్‌మెంట్ గురించి చాలా మంది వివిధ రకాలుగా మాట్లాడుకుంటున్నారు. అంతా అనుకున్నట్లు మేమేం రహస్యంగా ఎంగేజ్‌మెంట్ చేసుకోలేదు. మా బంధుమిత్రుల సమక్షంలో ప్రైవేట్‌గా ఎంగేజ్‌మెంట్ చేసుకున్నాం. రహస్యంగా చేసుకోవడానికి, ప్రైవేట్‌గా చేసుకోవడానికి చాలా తేడా ఉంది. అది అందరూ గమనించాలి" అని చెప్పారు. నటుడు సిద్ధార్థ్, అదితిరావు హైదరీల నిశ్చితార్థం వనపర్తి జిల్లాలోని రంగనాథ స్వామి ఆలయంలో మార్చి 27న జరిగిన సంగతి తెలిసిందే.


ఓటీటీ స్పెషల్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

సినిమా/సిరీస్		విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్...		
అన్‌లాక్డ్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 10
వాట్ జెన్నీఫర్ డిడ్	ఆంగ్ల చిత్రం	ఏప్రిల్ 10
బేబీ రెయిన్‌డీర్	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 11
హార్ట్‌బ్రేక్ హై	వెబ్‌సిరీస్ 2	ఏప్రిల్ 11
అమర్‌సింగ్ చమ్కీలా	హిందీ చిత్రం	ఏప్రిల్ 12
అమెజాన్ ప్రైమ్		
ఫాలౌట్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 12
జీ 5		
గామి	తెలుగు చిత్రం	ఏప్రిల్ 12
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
బ్లడ్ ఫ్రీ	కొరియన్ సిరీస్	ఏప్రిల్ 10
ప్రేమలు	మలయాళ చిత్రం	ఏప్రిల్ 12
ది గ్రేటెస్ట్ హిట్స్	హాలీవుడ్ మూవీ	ఏప్రిల్ 12
సోనీ లివ్		
అదృశ్యం	హిందీ సిరీస్	ఏప్రిల్ 11
ఆహా...		
కార్తీక	తెలుగు చిత్రం	ఏప్రిల్ 09
లయన్స్ గేట్ ప్లే		
హైటౌన్	వెబ్‌సిరీస్	ఏప్రిల్ 12
సన్ నెక్ట్స్		
లాల్ సలామ్	తమిళ చిత్రం	ఏప్రిల్ 12





ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 7 ఏప్రిల్ 2024

నేషనల్ లా వర్సిటీలో మాస్టర్స్ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ(ఎన్ఎల్‌యూ)- ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహిస్తున్న మాస్టర్స్, ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఈ ప్రోగ్రామ్‌లను వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్(డబ్ల్యుఐపీఓ), కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్-డిజైన్స్-ట్రేడ్ మార్క్స్(సీజీపీడీటీఎం-ఇండియన్ ఐపీ ఆఫీస్)ల సహకారంతో సంస్థ నిర్వహిస్తోంది. వీటికి విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ 2024 ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

కోర్సులు

- మాస్టర్స్ ఆఫ్ ఆర్ట్స్(ఎంఏ) ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్
- మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా అండ్ మేనేజ్‌మెంట్

సీట్ల వివరాలు

- ఒక్కో ప్రోగ్రామ్‌లో 40 సీట్లు ఉన్నాయి. భారత అభ్యర్థులకు 25 సీట్లు, విదేశీ అభ్యర్థులకు 10 సీట్లు, సీజీపీడీటీఎం ఉద్యోగులకు 5 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: ఎంఏ ప్రోగ్రామ్‌నకు ఏదేని డిగ్రీ పూర్తిచేసిన తరవాత సంబంధిత సబ్జెక్టులతో మరో డిగ్రీ ఉత్తీర్ణులు, ఇంటర్ తరవాత సంబంధిత విభాగంలో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ పూర్తిచేసినవారు, ఏదేని స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తి చేసిన వారు, నాలుగేళ్ల బ్యాచిలర్స్ ప్రోగామ్(ఆనర్స్/రీసెర్చ్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్‌నకు ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- డిగ్రీ/పీజీ స్థాయిలో జనరల్ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు.

ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్: ఎంఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఇంగ్లీష్, అనలిటికల్ అండ్ లాజికల్ రీజనింగ్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(నాన్ లీగల్) అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.

- ఎల్ఎల్ఎం ప్రవేశ పరీక్షలో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ఆధారంగా సీట్ల సంఖ్యకు రెండు రెట్లమందిని ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 15 శాతం, దరఖాస్తుతోపాటు సబ్మిట్ చేసిన రిటెన్ పర్సనల్ స్టేట్‌మెంట్స్‌కు 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఒబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.4000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2000; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 3
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 13 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ 2024 తేదీ:** జూన్ 23
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 16 నుంచి
- **వెబ్‌సైట్:** nludelhi.ac.in, https://nationallawuniversitydelhi.in



నిట్ జలంధర్‌లో ఎంబీఏ

జలంధర్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్‌జే)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో 38 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. అభ్యర్థులకు క్యాట్/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్‌నకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **జీడీ&పీఐకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 22
- **గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 25
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** మే 25
- **కౌన్సెలింగ్ తేదీ:** మే 26
- **ఈ మెయిల్:** mbaadmission2024@nitj.ac.in
- **వెబ్‌సైట్:** www.nitj.ac.in

ఎడ్యుకేషనల్ ప్లానింగ్‌లో పీహెచ్‌డీ

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఐఈపీఏ-న్యూఢిల్లీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాలి. పార్ట్ టైమ్ అభ్యర్థులు అడ్మిషన్ పొందిన నాటి నుంచి కనీసం మూడేళ్ల తరవాతనే థీసిస్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. యూజీసీ నెట్, జేఆర్ఎఫ్ అర్హత ఉన్న ఫుల్ టైం అభ్యర్థులకు సంస్థ ఫెలోషిప్స్ ఇస్తుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్సు వర్క్, థీసిస్ వర్క్ ఉంటాయి. మొత్తం 25 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఎడ్యుకేషనల్ పాలసీ, ఎడ్యుకేషనల్ ప్లానింగ్, ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్, ఎడ్యుకేషనల్ ఫైనాన్స్.

పరిశోధనాంశాలు

- ఎడ్యుకేషనల్ పాలసీ అండ్ ఇంప్లిమెంటేషన్
- గవర్నెన్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎడ్యుకేషన్
- మల్టీ-డిసిప్లినరీ పర్‌స్పెక్టివ్స్ టు ఎడ్యుకేషన్
- టీచర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్
- లీడర్‌షిప్ ఇన్ స్కూల్ అండ్ హయ్యర్ ఎడ్యుకేషన్
- ఈక్విటీ, డైవర్సిటీ, ఇన్‌క్లూజన్ ఇన్ ఎడ్యుకేషన్
- ఫైనాన్సింగ్ ఆఫ్ ఎడ్యుకేషన్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సోషల్ సైన్సెస్ లేదా సంబంధిత విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్ తరవాత పీజీ(సోషల్ సైన్సెస్) మొదటి ఏడాది ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. రిజర్వుడు వర్గాల అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. పార్ట్ టైం కోర్సులో చేరేవారు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, ఏడాది లీవ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. అభ్యర్థులందరూ ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి 1000 - 1500 పదాలతో స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ)ను అప్‌లోడ్ చేయాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో రీసెర్చ్ మెథడాలజీ, సోషల్ సైన్స్ సంబంధిత సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ పరీక్షలో అర్హత పొందినవారికి మెరిట్ ప్రకారం పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **ఎంట్రెన్స్ టెస్ట్:** జూన్ 8
- **ఇంటర్వ్యూలు:** జూన్ 13, 14
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 20
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** జూలై 3, 4
- **ప్రోగ్రామ్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- వెబ్‌సైట్: www.niepa.ac.in





రైట్స్‌లో క్వాలిటీ ఇంజనీర్లు

RITES
THE INFRASTRUCTURE PEOPLE

గుర్‌గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్ లిమిటెడ్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టు: క్వాలిటీ ఇంజనీర్(సైట్ ఇన్‌చార్జ్) **ఖాళీలు:** 4

అర్హత: డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 45 సంవత్సరాలు మించకూడదు

ఇంటర్వ్యూ తేదీలు: ఏప్రిల్ 15, 16

ప్రదేశం: రైట్స్ లిమిటెడ్, శిఖర్, ప్లాట్ నెం.1, సెక్టార్-29, గుర్‌గావ్. లేదా రైట్స్ ఆఫీస్, 741/742, 4వ ఫ్లోర్, టవర్ నెం. 3, 7 సెక్టార్-30ఎ, ఇంటర్నేషనల్ ఇన్‌ఫోటెక్ పార్క్, వాషి రైల్వే స్టేషన్ కాంప్లెక్స్, నవీ ముంబయి.

వెబ్‌సైట్: https://www.rites.com/Career

నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ పోస్టులు

ఖాళీలు: 1377

నోయిడాలోని నవోదయ విద్యాలయ సమితి... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్‌వీఎస్ ప్రధాన కార్యాలయంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌వీఎస్ ప్రాంతీయ కార్యాలయాలు, ఎన్ఎల్ఐలు, జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు.

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, కాకినాడ, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్.

దరఖాస్తు విధానం: కేంద్రీయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు రుసుము: ఫిమేల్ స్టాఫ్ నర్స్ పోస్టులకు జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1500; ఇతర పోస్టులకు రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30

దరఖాస్తు సవరణ తేదీలు: మే 2 నుంచి 4 వరకు

వెబ్‌సైట్: navodaya.gov.in/nvs/en/Home1

అలిమ్‌కోలో వివిధ ఖాళీలు

ఖాళీలు: 142

కాన్పూర్‌లోని ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ కన్సల్టెంట్: 1 పోస్టు
2. మేనేజర్: 1 పోస్టు
3. డిప్యూటీ మేనేజర్: 1 పోస్టు
4. అసిస్టెంట్ మేనేజర్: 4 పోస్టులు
5. జూనియర్ మేనేజర్: 17 పోస్టులు
6. ఆడియాలజిస్ట్: 50 పోస్టులు
7. ప్రాస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్: 47 పోస్టులు
8. స్పెషల్ ఎడ్యుకేటర్: 5 పోస్టులు
9. క్లినికల్ సైకాలజిస్ట్: 5 పోస్టులు
10. ఆప్టోమెట్రిస్ట్: 5 పోస్టులు
11. సీఎస్ఆర్ కన్సల్టెంట్: 1 పోస్టు
12. క్యూసీ అసిస్టెంట్: 4 పోస్టులు
13. ఫైనాన్స్ అసిస్టెంట్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, పీజీ, బీఈడీ/ఎంఈడీ, ఎంఫిల్, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు, సీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఆడియాలజిస్ట్, ప్రాస్థెటిక్స్ అండ్ ఆర్థోటిక్స్, స్పెషల్ ఎడ్యుకేటర్, క్లినికల్ సైకాలజిస్ట్, ఆప్టోమెట్రిస్ట్, సీఎస్ఆర్ కన్సల్టెంట్ పోస్టులకు 40 ఏళ్లు; క్యూసీ అసిస్టెంట్, ఫైనాన్స్ అసిస్టెంట్, జూనియర్ మేనేజర్ పోస్టులకు 45 ఏళ్లు, మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 50 ఏళ్లు; సీనియర్ కన్సల్టెంట్‌కు 62 ఏళ్లు మించకూడదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16

వెబ్‌సైట్: https://alimco.in/content/7_1-_Careers

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్స్

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం పోస్టులు: 7

1. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్): 4 పోస్టులు
2. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రికల్): 2 పోస్టులు
3. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 1 పోస్టులు

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో మెకానికల్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత. షిప్ బిల్డింగ్/షిప్ రిపేర్/మెరైన్ రిపేర్/ఇంజనీరింగ్/ప్రభుత్వ కంపెనీల్లో కనీసం నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.47,000 - రూ.50,000

వయోపరిమితి: 35 ఏళ్లు మించరాదు

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, పని అనుభవం తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు: రూ.400. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 12

వెబ్‌సైట్: https://cochinshipyard.in/

ఎన్ఎల్‌సీలో ఇండస్ట్రియల్ ట్రెయినీలు

ఖాళీలు: 239

నైవేలీ(తమిళనాడు)లోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం): 100 పోస్టులు
2. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్): 139 పోస్టులు

అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా

గరిష్ఠ వయోపరిమితి: యూఆర్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 37 ఏళ్లు; ఓబీసీ అభ్యర్థులు 40 ఏళ్లు, ఎస్టీ/ఎస్సీ అభ్యర్థులు 42 సంవత్సరాలు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం) అభ్యర్థులకు రూ.18,000 - రూ.22,000. ఇండస్ట్రియల్ ట్రెయినీ(మైన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్) అభ్యర్థులకు రూ.14,000 - రూ.18,000.

ఎంపిక: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.nlcindia.in

లిటిల్స్



నిరుద్యోగి

పూర్వం ఒక ఊరిలో ఒక ధనవంతుడు ఉండేవాడు. పేరు తాతాజీ. పెద్ద జమీందారు. అతని పొలం, ఇల్లు.. అన్నీ దర్పాన్ని సూచించేవి. ధనం ఎప్పుడూ అతని ఇంట్లో కొలువుండేది. అందుకే అతని ఇంట్లో లక్ష్మీదేవి కొలువై ఉంటుంది అనేవాళ్లు ఆ గ్రామ ప్రజలు. విషయం ఏంటంటే తాతాజీ మంచి వాడు. ధనికుడైనా ఇతరుల పట్ల కటువుగా మాత్రం ఉండేవాడు కాదు. అతనిలో మానవీయకోణం ఉండేది. దాన, ధర్మాలకు పెట్టింది పేరు.

పక్క ఊరిలో ఉండే ఓ యువకుడు ఆ విషయం తెలుసుకున్నాడు. మరుసటి రోజు వెంటనే ధనవంతుడి ముందు ప్రత్యక్షమయ్యాడు. 'అయ్యా.. నేను నిరుద్యోగిని. చదువుకున్నా. దీంతో ఏ పని కూడా అబ్బలేదు. నా చెల్లి, మా అమ్మను నేను చూసుకోవాలి. దయచేసి ఉద్యోగం ఇప్పించండి' అంటూ వేడుకున్నాడు. జమీందారు కాళ్ల పట్టుకోబోయాడు ఆ యువకుడు. దీంతో జమీందారు ఇలా అన్నాడు.. 'నీకు నేను ఉద్యోగం ఇవ్వలేను. ఇక్కడ పనులు చేసేవారు ఉన్నారు. వాళ్లు వెళ్లిపోతే చూద్దాం. అందాకా నీకు నేను సాయం చేస్తా' అన్నాడు. ఇంట్లోకి వెళ్లి రెండు రూపాయలు తెచ్చి ఇచ్చాడు. ఆ యువకుడు సంబరపడ్డాడు. ఇంటికి వేగంగా వెళ్లిపోయాడు.


ప్రతి రోజూ జమీందారు దగ్గరకు వచ్చి ఆ పేదవాడు తన రెండు రూపాయలు తీసుకుని వెళ్లాడు. అది కూడా సాయంత్రం పూట వచ్చి తీసుకెళ్లేవాడు. ఆ తర్వాత పదిరోజులు ఆ జమీందారు దగ్గరకు రాలేదతను. 'జబ్బు చేసిందో ఏమో.. లేకుంటే ఉద్యోగం వచ్చిందేమో' అనుకున్నాడు మనసులో జమీందారు. పదకొండో రోజు వచ్చాడు ఆ యువకుడు. ఇన్నాళ్లూ ఎక్కడికి వెళ్లావు? అని ప్రశ్నించాడు. 'నేను పది రోజులు రాలేదు కదా. ఆ పదిరోజుల డబ్బులు ఇప్పించండి' అని అడిగాడు ఆ యువకుడు. నా ప్రశ్నకు సమాధానం చెప్పు? అన్నాడు ఆ జమీందారు. 'మైలు దూరం నడిచి ఈ రెండు రూపాయలు తీసుకోవటం ఎందుకు? ఒకేసారి తీసుకుంటే మంచిది కదా?' అన్నాడు ఆ యువకుడు.

'మైలు దూరం కూడా నడవలేని నువ్వు నా ఇంట్లో ఏం పని చేస్తావులే?. నా ఇంట్లో ఉద్యోగం ఉన్నా నీకు ఇవ్వలేను. నీ ముఖం చూపించకంటూ గట్టిగా అరిచాడు. ఆ ఇంట్లోని సేవకులు ఆ నిరుద్యోగిని వెళ్లగొట్టారు.

10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 275

		2		7				3
4	5			1	8		9	
			6					
		4					7	9
			7		5			
1	7					5		
					1			
	1		9	4			6	7
9				8		4		

సుడోకు - 274 సమాధానం

9	8	7	4	2	6	3	1	5
1	6	3	5	8	7	9	4	2
5	2	4	1	3	9	6	8	7
7	5	1	3	9	4	2	6	8
2	9	6	7	1	8	4	5	3
3	4	8	2	6	5	7	9	1
8	7	5	6	4	2	1	3	9
4	3	9	8	7	1	5	2	6
6	1	2	9	5	3	8	7	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.